

ఆరేళ్ల తర్వాత ఊరట

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులు చేసి వైసీపీ ప్రభుత్వ కక్షసాధింపు చర్యతో ఆ బిల్లులు అందక ఆర్థికంగా నష్టపోయిన వారికి ఊరట కలిగించేలా ప్రజా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అలాంటివి జిల్లాలో రూ.60కోట్ల నుంచి 70 కోట్ల వరకు ఉన్నట్లు అంచనా. అందులో చెల్లించకుండా ఆగిపోయినట్లు అధికారిక లెక్కల్లో చూపిన రూ.11కోట్లను ఆరు మాసాల క్రితం ప్రభుత్వం చెల్లించింది. నమోదు కాకపోయినా పనులు పూర్తి చేసినట్లు అధికారుల వద్ద రికార్డుల్లో ఆధారాలు ఉన్న వాటికి రూ.16.17 కోట్లను ప్రస్తుతం విడుదల చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మరో రూ.30కోట్లకుపైగా అసలు లెక్కాపత్రం లేకుండా నాటి వైసీపీ ప్రభుత్వం ఇబ్బందిపెట్టినవి ఉన్నట్లు అంచనా వేశారు. వాటికి అవసరమైన ఆధారాల సేకరణపై దృష్టి సారించారు. ప్రభుత్వ ఆదేశాలతో డ్వామా జిల్లా అధికారులు నియోజకవర్గాల వారీ కీలక సమావేశాలను ప్రజాప్రతినిధుల సమక్షంలో నిర్వహిస్తున్నారు.



ఉపాధి పెండింగ్ బిల్లుల మంజూరుకు చర్యలు

- నాటి టీడీపీ హయాంలో పెద్దఎత్తున పనులు
- చెల్లింపులను నిలిపివేసిన వైసీపీ ప్రభుత్వం
- భారీగా బకాయిలతో తెలుగు తమ్ముళ్ల అవస్థ
- ప్రస్తుతం వాటి చెల్లింపునకు చర్యలు
- ఆరు మాసాల క్రితం రూ.11 కోట్లు జమ
- మరో రూ.16.17 కోట్ల విడుదలకు చర్యలు
- ఆధారాలతో అప్‌లోడ్ చేస్తున్న అధికారులు
- నమోదు చేయకుండా నిలిపివేసిన వాటిపైనా దృష్టి
- నియోజకవర్గాల వారీ అధికారుల సమావేశాలు



ఒంగోలు ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ప్రభుత్వం (2014-19)లో ఉపాధి హామీ పథకం పనుల బిల్లులకు ఇప్పుడు మోక్షం లభిస్తోంది. మెటీరియల్ కోటా నిధుల ద్వారా అప్పట్లో పెద్దఎత్తున పనులు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సీసీరోడ్లు, డ్రైన్లు, శ్మశానాల అభివృద్ధి, పాఠశాలలకు ప్రహరీలు, మొక్కల పెంపకం, చెత్త నుంచి సంపద తయారీ (డబ్ల్యూపీసీ) కేంద్రాలు, అంగన్‌వాడీ, పంచాయతీ భవన నిర్మాణాలు భారీగా చేపట్టారు. జిల్లాలో సుమారు రూ.వెయ్యి కోట్ల మేర పనులు నాటి టీడీపీ ప్రభుత్వంలో జరిగాయి.

బిల్లులు చెల్లించకుండా వేధించిన వైసీపీ ప్రభుత్వం

2019 ఎన్నికలకు ముందు చేసిన పనులకు సంబంధించిన బిల్లులను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. అలా రూ.100 కోట్ల వరకు ఆగిపోయాయి. వీటిలో అత్యధిక భాగం టీడీపీ శ్రేణులు చేసి ఉండటంతో వారిని ఆర్థికంగా దెబ్బతీసేందుకు వైసీపీ ప్రభుత్వం అలా వ్యవహరించింది. కొంతకాలం తర్వాత పనులు చేసిన పలువురు కోర్టును ఆశ్రయించారు. దీంతో వైసీపీ ప్రభుత్వం విజిలెన్స్, ఇతర శాఖల ఇంజనీరింగ్ సిబ్బందితో

మిగతా 6వ పేజీలో



గోపాల.. గోపాల..

కృష్ణాష్టమి వేడుకలు దొనకొండలో వైభవంగా జరుగుతున్నాయి. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గ్రామంలోని రామాలయం వద్ద ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేశారు. అందులో గోపాలుడి విగ్రహాన్ని ఉంచి మూడు రోజులుగా పూజలు, భగవద్గీత శ్లోక పారాయణం చేశారు. సోమవారం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో కృష్ణుడి విగ్రహాన్ని ఉంచి మేళతాళాలు, బాణ సంచా మోతల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు.

- ఆంధ్రజ్యోతి, దొనకొండ

కలెక్టరేట్‌లో యువకుడు ఆత్మాహత్యాయత్నం

- ఇటీవల కులాంతర వివాహం
- సహచరులు హేళన చేస్తున్నారని మనస్తాపం
- 'మీ కోసం'లో అధికారులకు ఫిర్యాదు
- బయటకు వచ్చి ఎలుకల మందు తాగిన వైనం

6

అర్ధరాత్రి వరకు తాగుడే!

- జిల్లాలో 29 బార్లకు నోటిఫికేషన్
- 28న ఒంగోలులో లాటరీ ప్రక్రియ
- గీత కార్మికులకు మూడు కేటాయింపు



వివరాలను వెల్లడిస్తున్న డీసీ హేమంత్‌నాగరాజు, ఈఎస్ ఆయేషాబేగం

ఒంగోలు క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఎక్సైజ్ నూతన విధానం (2025-28)లో జిల్లాలో 29 బార్ల ఏర్పాటుకు నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. వీటిలో మూడు గీత కార్మికులకు కేటాయించారు. ఉదయం 10 నుంచి రాత్రి 12 గంటల వరకు బార్లు నిర్వహించుకోవచ్చు. స్థానిక జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్(డీసీ) హేమంత్ నాగరాజు, ఈఎస్ ఆయేషాబేగం సోమవారం నూతన బార్లకు నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. అనంతరం వివరాలను వెల్లడించారు. మొత్తం జిల్లాలో 29 బార్లు ఉండగా వీటిలో 3 గీత కార్మికులకు కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన 26లో ఒంగోలుకు 16, మార్కాపురానికి 5 కేటాయించామన్నారు. వీటికి ఒక్కోదానికి రూ.55లక్షలు లైసెన్స్ ఫీజుగా నిర్ణయించినట్లు చెప్పారు. పొదిలి, కనిగిరి, దర్శి, చీమకుర్తి, గిద్దలూరుకు ఒక్కో బార్‌ను కేటాయించామన్నారు. ఆ ప్రాంతాల్లో రూ.35 లక్షల లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈనెల 18 నుంచి 26 వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. 28న ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతిన బార్లను కేటాయిస్తామన్నారు. అప్లికేషన్

మిగతా 6వ పేజీలో



కురిచేడు ప్రాంతంలో వైట్ బర్లీ పొగాకు నాట్లు వేస్తున్న కూలీలు

సాగుకు ఉపయుక్తం

- జిల్లావ్యాప్తంగా వర్షం
- పశ్చిమాన వాగులు, వంకల్లో నీటి ప్రవాహం
- పంటలకు మేలు
- ఊపందుకోనున్న ఖరీఫ్ సాగు

ఒంగోలు ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆదివారం రాత్రి ఒక మోస్తరు వర్షం కురిసింది. పశ్చిమప్రాంత మండలాల్లో భారీగా పడింది. తాజా వర్షం సాగుకు చాలా ఉపయుక్తమని రైతులు చెప్తున్నారు. గత నెలలో లోటు వర్షపాతంతో పంటల సాగు ముందుకు సాగక ప్రతికూల పరిస్థితిని ఎదుర్కొన్న రైతులకు ఈనెలలో ఊరట కలిగించేలా జల్లులు పడుతున్నాయి. ఆగస్టులో సాధారణ వర్షపాతం 92.0 మి.మీ కాగా ఇప్పటి వరకు 80.2 మి.మీ కురిసింది. అందులో ఆదివారం రాత్రే సుమారు 15.30 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా అర్ధవీడు మండలంలో 45.0 మి.మీ కురిసింది. రాచర్లలో 43.80, మార్కాపురంలో 36.6, తర్లుబాడులో 29.4, కంభంలో 27.6, పెద్దారవీడులో 26.8 మి.మీ పడింది. మరో 12 మండలాల్లో ఒక మోస్తరు వర్షపాతం నమోదైంది. నల్లమల అటవీ ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. దీంతో అక్కడి వాగులు, వంకల్లో నీటి ప్రవాహం పెరిగింది. దోర్నాల ఎగువ ప్రాంతంలో తీగలేరు, దొంగల వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అర్ధవీడు మండలంలో కురిసిన భారీ వర్షాలతో జంపలేరుకు వరద నీరు వచ్చి పొంగింది.



ఎగువ చెర్లోపల్లి వద్ద వంతెనపై నుంచి ప్రవహిస్తున్న నీరు

మెట్టప్రాంతాల్లో సాగు ముమ్మరమయ్యే అవకాశం

తాజా వర్షం పంటల సాగుకు మేలు చేకూర్చింది. ప్రస్తుతం పొలాల్లో సుమారు 27వేల హెక్టార్లలో వివిధ రకాల పంటలు ఉన్నాయి. అత్యధికంగా 8,571 హెక్టార్లలో పత్తి ఉంది. 6,873 హెక్టార్లలో కంది, 3,200 హెక్టార్లలో మొక్కజొన్న, 2వేల హెక్టార్లలో సజ్జ, 3,457 హెక్టార్లలో

మిగతా 6వ పేజీలో



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

పనితీరు మార్చుకోకుంటే చర్యలు

- అభివృద్ధి విషయంలో కనీస అవగాహన లేకపోతే ఎలా?
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించను
- అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరిక

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను హెచ్చరించారు. గ్రామాలు, మునిసిపాలిటీల్లో ఏమి జరుగుతుందో.. అభివృద్ధి పనుల పురోగతి ఏ స్థాయిలో ఉందో కూడా కనీస అవగాహన లేకపోతే ఎలా? అంటూ మండిపడ్డారు. సమావేశాలకు పిలుస్తున్నప్పుడు కనీస సమాచారం లేకుండా ఎలా వస్తారని ప్రశ్నించారు. క్యాంపు కార్యాలయం నుంచి ఆమె సోమవారం సాయంత్రం ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురి పనితీరుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రవర్తన మార్చుకోవాలన్నారు. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఆయా అంశాలపై సమీక్ష సమావేశంలో ఎంపీడీవోలు, కొందరు మునిసిపల్ కమిషనర్లు తెల్లముఖం వేయడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతాయుతమైన స్థాయిలో ఉన్న అధికారులే ఇలా ఉంటే కిందిస్థాయిలో పనిచేసే సచివాలయ సిబ్బందిని ఏవిధంగా పర్యవేక్షిస్తున్నారో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చని అసహనం వ్యక్తం చేశారు పద్ధతి, ప్రవర్తన మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తల్లికి వందనం పథకంలో ఇప్పటికే 286 ఈకేవైసీ పెండింగ్ ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనితోపాటు హౌస్‌హోల్డ్ ఈకేవైసీ

మిగతా 6వ పేజీలో

ముప్పా సురేష్ అరెస్టు

- 14 రోజులు రిమాండ్ విధించిన న్యాయాధికారి

ఒంగోలు క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నాయకుడు, నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి హత్య కేసులో ప్రధాన సూత్రధారి అయిన ముప్పా సురేష్‌ను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. రిమ్స్‌లో వైద్య పరీక్షల అనంతరం న్యాయాధికారి ఎదుట హాజరుపరిచారు. న్యాయాధికారి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు.



సురేష్‌ను జైలుకు తరలిస్తున్న పోలీసులు

ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా!

- దర్శిలో రెచ్చిపోతున్న ఆక్రమణదారులు
- ఇప్పటికే రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు సొంతం
- దర్జాగా నిర్మాణాలు
- తాజాగా మరికొన్ని పరులపరం
- పట్టించుకోని అధికారులు

దర్శి ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : దర్శి పట్టణంలో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా చేస్తున్నారు. వాటిలో దర్జాగా పక్కా కట్టడాలు నిర్మిస్తున్నారు. ఇప్పటికే రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమయ్యాయి. అయినప్పటికీ అధికారులు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఆక్రమణదారుల నుంచి భారీ మొత్తాలు ముట్టడంతో మిన్నకుంటున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దర్శి పట్టణంలోని కురిచేడు రోడ్డుకు సమీపంలోని బండిదారి స్థలంలో యథేచ్ఛగా గృహాలు నిర్మించారు. కొంతమంది గోడౌన్‌లు ఏర్పాటు చేసుకున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో మరికొందరు కూడా ఆక్రమించి

మిగతా 6వ పేజీలో



దర్శిలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన గోడౌన్, మరికొంత భూమిలో ప్రహరీ



చిన్నబోయిన కంభం చెరువు

- వర్షాభావం, మధ్యలో అడ్డుకట్టలతో చేరని నీరు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు

7

నీ చిత్రం చూసి..

- భవిష్యత్ తరానికి ఓ సాక్ష్యం
- స్నేహానికి చెరగని గురుతు.. సెల్ఫీ
- మరపురాని జ్ఞాపకంగా ఫొటో
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

7

కరిగే కాలంలో చెదరని మధుర స్మృతులకు ప్రతిబింబాలు ఫొటోలు. ప్రతి ముఖ్యమైన సన్నివేశాన్ని కెమెరాలో బంధించి, జీవితకాలం వాటిని పదిలంగా దాచుకుని, అలనాటి జ్ఞాపకాలను మళ్లీమళ్లీ తనివితీరా వీక్షించుకునే అవకాశాన్ని ఇచ్చే తీపి గురుతులు. ఓ మాట వింటే కొన్నాళ్లకు మర్చిపోతాం. ఓ పదం చదివితే ఇంకొన్నాళ్లకు మరుగున పడుతుంది. కానీ ఓ ఫొటో చూస్తే ఎంతోకాలం మదిలో ముద్రవేసుకుపోతుంది. ప్రతి ఫొటో వెనుక ఓ జ్ఞాపకం, ఓ కథ, ఓ అనుభూతి దాగి ఉంటుంది. ఫొటోకు అంతటి ప్రాధాన్యం ఉంటుంది. ఈ నేపథ్యంలో నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..



ఒంగోలులో వర్షం కురిసిన ఓ సాయంత్రం వేళ ఇలా.. (ఫైల్)

ఆరేళ్ల తర్వాత ఊరట

(5వ పేజీ తరువాయి)

తనిఖీలు చేయించింది. పూర్తిచేసిన పనుల్లో భారీగా బిల్లులు తగ్గించి వేధింపులకు గురిచేసింది. ఎక్కువమంది కోర్టుకు వెళ్లలేక, వేధింపులను తట్టుకోలేక బిల్లులు అడగడం మానేశారు. చివరకు కోర్టు ఆదేశాలతో కొందరికి చెల్లించిన నాటి వైసీపీ ప్రభుత్వం భారీగా బిల్లులను అసలు ప్రభుత్వ రికార్డుల్లో (ఆన్‌లైన్‌లో) నమోదు కూడా కాకుండా వర్క్ క్లోజర్ డేటా కింద చూపింది. దీంతో కేంద్రానికి రాష్ట్రప్రభుత్వం నివేదించే బిల్లుల జాబితాలో అసలు ఆ పనులు నమోదు కాకుండా నిలిచిపోయాయి. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లూ బిల్లులు రాకపోవడంతో పనులు చేసిన టీడీపీ శ్రేణులు తీవ్రంగా నష్టపోయారు.

కేంద్ర వెబ్‌సైట్‌ను తిరిగి తెరిపించిన మంత్రి పెమ్మసాని

తిరిగి అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వం దృష్టికి ఉపాధి పథకం బిల్లుల వ్యవహారం వచ్చింది. దీంతో తొలివిడత అన్ని రికార్డుల్లో నమోదై వివరాలు సక్రమంగా ఉన్న పనులకు చెల్లింపులు చేసింది. అలా ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలలో జిల్లాలో రూ.11కోట్ల పెండింగ్ బిల్లులు జమయ్యాయి. రెండో దశలో పనులు చేసినట్లు రికార్డుల్లో ఉన్న వాటిపై దృష్టి సారించారు. వైసీపీ ప్రభుత్వ కాలంలో వర్క్ క్లోజర్ కింద చూపడంతో అలాంటి పనులను తిరిగి ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు కేంద్రం అనుమతి అవసరమై జాప్యం నెలకొంది. దీనిపై సీఎం ఆదేశాలతో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవచూపడంతో కేంద్రం నిలిపివేసిన ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను ఇటీవల తిరిగి ఓపెన్ చేసింది. దీంతో ప్రస్తుతం ఆ వివరాలను అధికారులు నమోదు చేస్తున్నారు. జిల్లాలో చిన్నాపెద్దవి కలిపి సుమారు రూ.16.17 కోట్లకు సంబంధించిన 19,393 పనులు ఉన్నట్లు గుర్తించారు. వాటిని ప్రస్తుతం నమోదు చేస్తుండగా నగదు జమవుతున్నదని సమాచారం.

ఆధారాలు ఉంటే చెల్లింపు!

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్పటికి టీడీపీ శ్రేణులు చేసిన పనుల్లో పూర్తయిన వాటికి చెల్లింపులు నిలిపివేయడమే కాక అసలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, ఎంబుక్‌లో రికార్డు చేయడం వంటివి కూడా ఆపివేసినవి భారీగా ఉన్నాయి. అలాంటి వాటికి కూడా ఆధారాలు ఉంటే తిరిగి నమోదు ప్రక్రియ పూర్తిచేసి చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని సీఎం కార్యాలయం నుంచి అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో అలాంటి వాటిని గుర్తింపుపై ప్రస్తుతం డ్వామా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

డ్వామా అధికారుల సమావేశాలు

మూడు రోజులుగా జిల్లాలో నియోజకవర్గాల వారీ ప్రజాప్రతినిధుల సమక్షంలో డ్వామా అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. పనులు చేయించడంలో కీలకమైన డ్వామా సిబ్బంది, ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ సిబ్బందితో సంయుక్తంగా ఈ సమావేశాలను నిర్వహించి అప్పట్లో పనులు చేసిన వారిని కూడా పిలిపిస్తున్నారు. వారి వద్ద ఉన్న ఆదారాలను పరిశీలిస్తున్నారు. ఈ తరహావి కూడా భారీగానే ఉన్నట్లు తెలుస్తోంది. కొద్దిపాటి ఆధారాలున్నా అలాంటి వాటిని నమోదు చేసి బిల్లులు అందేలా చర్యలు తీసుకొనే ఆలోచనలో అధికారులు ఉన్నారు. ఈక్రమంలో గత గురువారం కొండపి నియోజకవర్గ సమావేశం తూర్పునాయుడుపాలెంలో మంత్రి డాక్టర్ స్వామి క్యాంపు కార్యాలయంలో జరిగింది. డ్వామా పీడీ జోసఫ్‌కుమార్‌తోపాటు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సాగుకు ఉపయుక్తం

(5వ పేజీ తరువాయి)

నువ్వు, మరో నాలుగు వేల హెక్టార్లలో మిర్చితోపాటు పశుగ్రాసం ఇతర పలు రకాల పంటలు సాగు చేసి ఉన్నారు. తాజా వర్షాలు వాటన్నింటికీ మేలు చేయనున్నాయి. మెట్టప్రాంతాల్లో పత్తి, కంది, మిర్చి, మొక్కజొన్న, మినుముతో పాటు నీటి వనరుల కింద వరినాట్లు ముమ్మరమయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఖరీఫ్ మెట్ట పంటల సాగుకు సమయం మించిపోతూ రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ప్రస్తుతం కురిసిన వర్షం వారిలో ఆశలను చిగురింపజేసింది. జిల్లావ్యాప్తంగా వాతావరణం చల్లబడింది. ఎండల తీవ్రత నుంచి ప్రజలకు ఉపశమనం లభించింది.

జిల్లాలో 15.3 మి.మీ సగటు వర్షపాతం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆదివారం రాత్రి వర్షం కురిసింది. సోమవారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో 15.3 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అర్ధవీడు మండలంలో 45.0, రాచర్లలో 43.8, మార్కాపురంలో 32.6, తర్లుబాడులో 29.4, కంభంలో 27.6, పెద్దారవీడులో 26.8, బేస్తవారపేటలో 22.8, వెలిగండల్లో 21.0, పుల్లలచెరువులో 20.0, గిద్దలూరులో 19.8 మి.మీ కురిసింది. హనుమంతునిపాడులో 18.0, సీఎస్‌పురంలో 18.0, వైపాలెంలో 17.6, దోర్నాలలో 16.4, సింగరాయకొండలో 15.6, పామూరులో 15.4, త్రిపురాంతకంలో 14.4 కొనకనమిట్లలో 14.4 మి.మీ పడింది. దొనకొండ మండలంలో 13.2, పొన్నలూరులో 13.2, ఒంగోలు రూరల్‌లో 12.8, ఒంగోలు అర్బన్‌లో 12.8, దర్శిలో 12.4, కొండపిలో 11.6, పొదిలిలో 11.4, కనిగిరిలో 11.4, కొమరోలులో 10.2, చీమకుర్తిలో 10.0 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇతర మండలాల్లో కొద్దిపాటి జల్లులు పడ్డాయి.

అర్ధరాత్రి వరకూ తాగుడే!

(5వ పేజీ తరువాయి)

ధర రూ.5లక్షలుగా నిర్ణయించారని ఆ ఫీజు తిరిగి ఇవ్వరన్నారు. ప్రాసెసింగ్ ఫీజు రూ.10వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒక్కో బార్‌కు తప్పనిసరిగా 4 దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తామన్నారు.

గీత కార్మికులకు సగం ధరకే బార్

గీత కార్మికులకు లైసెన్స్ ఫీజులో 50శాతం రాయితీ ఇస్తారని డీసీ, ఈఎస్ తెలిపారు. వారికి మూడు బార్‌లు కేటాయించినట్లు వెల్లడించారు. ఒంగోలులో ఒక బార్ గౌడ్‌కు, మార్కాపురంలో ఒకటి గౌడా, మరొక బార్ గౌండ్లకు కేటాయించారు. వీరు ఈనెల 20 నుంచి 29 వరకు జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రీడ్ మోడ్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వీరికి కేటాయించే బార్‌లకు లైసెన్స్ ఫీజు రూ.27.50 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈనెల 30న దరఖాస్తులు పరిశీలించి లాటరీ తీసి కేటాయిస్తామని చెప్పారు.

పనితీరు మార్చుకోకుంటే చర్యలు

(5వ పేజీ తరువాయి)

సర్వేను కూడా ప్రత్యేక డ్రైవ్ మోడ్‌లో చేపట్టాలన్నారు. చదువుకున్న యువతకు వర్క్ ఫ్రం హోం కింద ఉపాధి కల్పించేలా ప్రభుత్వం నిర్వహిస్తున్న కౌశలం సర్వేను కూడా పర్యవేక్షించాలని ఆదేశించారు. సచివాలయ ఉద్యోగులు బయోమెట్రిక్ హాజరు వేసే విధంగా చూడాలన్నారు. గృహ నిర్మాణంలో ప్రతివారం స్పష్టమైన పురోగతి కనిపించాలన్నారు. ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎంపీడీవోలు, హౌసింగ్ ఏఈలు సమన్వయంతో పనిచేయాలన్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. 15 రోజులకు ఒకసారి తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇంకుడు గుంతల పనులను 15 రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. వీసీలో వివిధ శాఖల అధికారులు చిరంజీవి, గొట్టిపాటి వెంకటనాయుడు, డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, శ్రీనివాసప్రసాద్, జోసఫ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా!

(5వ పేజీ తరువాయి)

ప్రహరీలు ఏర్పాటు చేస్తున్నారు. దర్శి-కురిచేడు రోడ్డుకు ఉత్తరం వైపున యర్రచెరువు ఉంది. ఆ చెరువుకు, రోడ్డుకు మధ్యలో సుమారు ఎకరాకుపైగా ప్రభుత్వ స్థలం ఉంది. అక్కడ సెంటు స్థలం రూ.25 లక్షలు పలుకుతుంది. అక్రమార్కులు యర్రచెరువు స్థలంలో కొంతభాగాన్ని, ఆర్అండ్‌బీ రోడ్డు మార్జిన్ స్థలంలో కొంతభాగాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేసుకున్నారు. కొంతమంది రేకుల షెడ్లు వేసి కొంతకాలం తర్వాత శాశ్వత భవనాలు నిర్మించుకొని సొంతం చేసుకుంటున్నారు. అలాగే, దర్శి-పొదిలి రోడ్డులో కాటేరు వాగును ఆక్రమించి యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు సాగిస్తున్నారు. దర్శి-అద్దంకి రోడ్డులో ప్రభుత్వ స్థలంలో కొంతభాగాన్ని ఆక్రమించి భవనాలు నిర్మించారు. మరికొంత భాగాన్ని ఆక్రమించేందుకు అక్రమార్కులు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం.

సహకరిస్తున్న అధికారులు

ప్రభుత్వ స్థలాలకు రక్షణ కల్పించాల్సిన అధికారులు ఆదిశగా తీసుకుంటున్న చర్యలు మృగ్యమయ్యాయి. దీంతో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన వారు ఆ తర్వాత నిర్మాణాలు చేపడుతున్నారు. వాటిని తొలగించాల్సిన అధికారులు పెనాల్టీల పేరుతో పన్నులు వేసి క్రమబద్ధీకరణకు సహకరిస్తున్నారు. గతంలో ఎంతోమంది ఇదేవిధంగా ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేసి కొన్ని సంవత్సరాలు పన్నులు కట్టి ఆతర్వాత క్రమబద్ధీకరించాలని కోర్టులకు వెళ్లి ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఇలా ఇప్పటికే కోట్లాది రూపాయల విలువచేసే ప్రభుత్వ స్థలాలను అక్రమార్కులు సొంతం చేసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఈతంతు కొనసాగుతూనే ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాల రక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఒకచోట కళకళ.. మరోచోట విలవిల

ముంపు గ్రామమైన ధేనువకొండకు శాపం.. ఉమ్మనేనివారిపాలెంకు వరం...

గుండ్లకమ్మ ప్రాజెక్ట్ ముంపు గ్రామం కావడంతో మౌలిక వసతుల కల్పనకు అడ్డంకిగా నిబంధనలు

- ధేనువకొండ పంచాయతీ పరిధిలోని ఉమ్మనేనివారి పాలేనికి దండిగా నిధులు ఖర్చు
- సమస్యలతో విలవిల్లాడుతున్న నిర్వాసితులు
- పునరావాస కాలనీలకు కొద్ది మందే తరలి వెళ్లిన వైనం



తుమ్మ చెట్లతో మూసుకు పోయిన ధేనువకొండ రోడ్డు



ఉమ్మనేనివారిపాలెంలో వేసిన అంతర్గత సీసీ రోడ్డు

అద్దంకి, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి) : ధేనువకొండ.. అద్దంకి మండలంలో అతి పెద్ద గ్రామం. ఆ గ్రామం పరిస్థితి ముందు నుయ్యి.. వెనక గొయ్యి అన్న చందంగా మారింది. ఆ గ్రామంలో గత 15 ఏళ్లుగా కనీస మౌలిక వసతుల కల్పన కూడా చేయలేని దుస్థితి. ఆ వివరాలేంటో చూద్దాం... గుండ్లకమ్మ రిజర్వాయర్ నిర్మాణంలో ధేనువకొండ ముంపు గ్రామంగా ఉండటంతో మౌలిక వసతుల కల్పనకు నిబంధనలు పెద్ద సమస్యగా మారాయి. ముంపు గ్రామమైనప్పటికీ పంట భూములు చాలా వరకు ముంపునకు గురికాలేదు. జీవనాధారమైన భూములను నమ్ముకునే వ్యవసాయం చేస్తున్నారు. గ్రామానికి సుమారు 25 కి.మీ దూరంలో మూడు పునరావాస కాలనీలను ప్రభుత్వం నిర్మించినా అక్కడకు రైతులు వెళ్లేందుకు ఇష్టపడటం లేదు.

దక్షిణ ధేనువకొండ పునరావాస కాలనీలోనూ సమస్యలు

ఇంకొందరికి సమీపంలోని దక్షిణ ధేనువకొండ వద్ద పునరావాస కాలనీ ఏర్పాటు చేసినా కొద్దిమందికి మాత్ర మే స్థలాలు కేటాయించారు. ఇంకా మౌలిక వసతుల కల్పన జరగలేదు. దీంతో ఆ పునరావాసకాలనీలో కూడా ఇళ్ల నిర్మాణం జరగలేదు. ముంపు గ్రామం పరిధిలో మొత్తం 4 వేల మంది జనాభా ఉండగా సుమారు వెయ్యి మంది మాత్రం అద్దంకి పట్టణానికి సమీపంలో ఉన్న రెండు పునరావాస కాలనీలకు వెళ్లారు.మిగిలిన మూడు వేల మంది జనాభా ధేనువకొండలోనే నివాసం ఉంటున్నారు.

ప్రస్తుతం ఉన్న గ్రామానికి సమీపంలో దక్షిణ ధేనువకొండ పునరావాస కాలనీ ఉండటం, భవిష్యత్‌లో ఆ ప్రాంతంలోనే ఎక్కువ మంది రైతులు నివాసాలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉండటంతో ఆ నిధులతో కనీసం పేరాయపాలెం నుంచి ధేనువకొండకు, ఉమ్మనేనివారిపాలెం నుండి ధేనువకొండలకు గ్రావెల్ లేదా తారు రోడ్లు నిర్మాణం చేసుకునే అవకాశం ఉంది.

మురుగుతో విలవిల

గ్రామంలో కనీసం సైడ్ డ్రైన్‌లు లేకపోవటం, మురుగు ఎక్కడిక్కడే నిలిచి ఉండటంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. కనీసం పారిశుధ్య పనులు, బ్లీచింగ్ చల్లటం లాంటి పనులైనా చేయాలని కోరుతున్నారు. అయినప్పటికీ నేతలు, అధికారులు అటువైపు దృష్టి సారించకుండా మిన్నకుండటం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధేనువకొండ పంచాయతీలో మూలుగుతున్న నిధులను అభివృద్ధి పనులకు వెచ్చించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. ముంపు గ్రామంగా ఉండటం ధేనువకొండకు శాపం కాగా అదే పంచాయతీలో ఉన్న అతి చిన్న గ్రామమైన ఉమ్మనేనివారిపాలేనికి మాత్రం వరంగా మారిందని గ్రామస్థులు చెబుతున్నారు.



ఉమ్మనేనివారిపాలెంలో వేసిన ప్రధాన సీసీ రోడ్డు

మూలుగుతున్న కోటి రూపాయలు

గత 15ఏళ్లుగా ధేనువకొండ గ్రామ పంచాయతీకి వివిధ సందర్భాలలో 2 కోట్ల రూపాయల వరకు నిధులు మంజూరు కాగా, అందులో సుమారు కోటి రూపాయలతో ధేనువకొండ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఉమ్మనేనివారిపాలెంలో వెచ్చించి సీసీ రోడ్లు వేశారు. నివాస గృహాలు లేని రోడ్లను సైతం సీసీ రోడ్లుగా మార్చారు. సుమారు 150 మంది జనాభా ఉన్న ఉమ్మనేనివారిపాలెంలో పెద్ద ఎత్తున సీసీ రోడ్ల నిర్మాణం జరిగింది. ఇంకా కోటి రూపాయల నిధులు పంచాయతీలో మూలుగుతున్నాయి.

ఒంగోలు కలెక్టరేట్‌లో యువకుడు ఆత్మాహత్యాయత్నం

- ఇటీవల కులాంతర వివాహం
- సహచరులు హేళన చేస్తున్నారని మనస్తాపం
- 'మీ కోసం'లో అధికారులకు ఫిర్యాదు
- బయటకు వచ్చి ఎలుకల మందు తాగిన వైనం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని కలెక్టరేట్‌లో ఓ యువకుడు ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కంభంకు చెందిన వెంకటరంగారెడ్డి కనిగిరిలోని ఒక కోళ్లఫారంలో సూపర్ వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల ఆయన కులాంతర వివాహం చేసుకున్నాడు. తాను దళిత యువతిని పెళ్లి చేసుకున్నందున తనతో పనిచేసే కొందరు హేళన చేస్తూ మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని మీకోసం (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక)లో ఫిర్యాదు చేసేందుకు ఒంగోలు కలెక్టరేట్‌కు వచ్చారు. ఆమేరకు ఉన్నతాధికారులకు అర్జీ సమర్పించారు. గ్రీవెన్స్ హాలు నుంచి బయటకు వచ్చిన వెంటనే తనతోపాటు తెచ్చుకున్న ఎలుకల మందులో నీళ్లు కలుపుకొని తాగాడు. గుర్తించిన కలెక్టరేట్ సిబ్బంది ఆయన్ను జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ వెంకటరంగారెడ్డి చికిత్స పొందుతున్నాడు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే మీకోసంకు హాజరయ్యే వారిని పోలీసులు తనిఖీలు చేసిన తర్వాతనే లోపలికి అనుమతిస్తారు. అయితే వెంకటరంగారెడ్డి వద్ద ఎలుకల మందు ఉన్నా గుర్తించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు రావినూతల విద్యార్థులు

మేదరమెట్ల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు రావినూతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 17వ తేదీన యోగాసన అసోసియేషన్, ప్రకాశం జిల్లా ఆధ్వర్యంలో ఆంధ్రకేసరి కళాశాలలో నిర్వహించిన యోగా పోటీలలో సబ్ జూనియర్ విభాగంలో రావినూతల జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థులు పి.అనుస్మిత, కే.శ్రీవల్లి, సీహెచ్ గీతాంజలి, పీ మౌనిష్, బీ జాహ్నవి ప్రథమ స్థానంలో నిలిచారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయురాలు కందే కళ్యాణిలను హెచ్‌ఎం రాఘవరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బుజ్జి, ఉపాధ్యాయులు అభినందించారు. వీరు ఈ నెల 21వ తేదీన తాడేపల్లిగూడెంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని హెచ్‌ఎం తెలిపారు. ఈ సందర్భంగా విజేతలకు పాఠశాల పూర్వ విద్యార్థులు తమ్మన హనుమంతరావు, పల్లపోతు రామాంజనేయులు రెండు వేలు నగదు బహుమతులను అందజేశారు.



ప్రథమ స్థానం సాధించిన రావినూతల హైస్కూల్ విద్యార్థులు

రైతులకు మెరుగైన సేవలు అందించటమే లక్ష్యం

- సహకార సంఘం చైర్మన్ పోపూరి శ్రీనివాసరావు

పర్చూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అనునిత్యం అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించటమే లక్ష్యంగా కృషి చేస్తామని అడుసుమల్లి సహకార సంఘం(ఎల్‌ఎస్‌సీఎస్) చైర్మన్ పోపూరి శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం పర్చూరు మండల పరిధిలోని అడుసుమల్లి లార్జ్ సైజ్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి కృష్ణ, మండలపార్టీ అధ్యక్షులు షేక్ షంషుద్దీన్, కొరిటాల సురేష్, టీడీపీ లీగల్ సెల్ ప్రతినిధి అడ్డగడ వేణు, మక్కెన శేఖర్‌బాబు పాల్గొన్నారు. నూతన పాలక మండలికి ఎల్‌ఎస్‌సీఎస్ (సీఈవో) దొప్పలపూడి రమాదేవి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో సొసైటీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అడ్డగడ్డ వెంకటేశ్వర్లు, కారుమంచి పాపారావు. సొసైటీ డైరెక్టర్లుగా మూకిరి సుబ్బయ్య, అన్నవరపు శ్రీనివాసరావు(వాసు) పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న సొసైటీ చైర్మన్, డైరెక్టర్లు

కనక నాగవరపమ్మ దేవస్థానం కమిటీ చైర్మన్‌గా ఆంజనేయులు

చినగంజాం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం రావూరిపేట గ్రామంలో వేంచేసి యున్న కనకనాగవరపమ్మ అమ్మవారి దేవస్థానం ధర్మకర్తల మండలి నూతన కమిటీ ప్రమాణ స్వీకారం సోమవారం ఘనంగా జరిగింది. నూతన ధర్మకర్తల మండలి చైర్మన్‌గా వలేటి ఆంజనేయులు, ధర్మకర్తలుగా గోవిందు సుబ్బారావు, గుత్తి వీరప్రసాదరావు, చప్పటి వెంకటరావు, ఆతిన రమేష్, యర్రా శివనాగమల్లేశ్వరి, చుండి శ్రీలక్ష్మి, ద్రోణాదుల సుబ్బాయమ్మ, కంచర్ల భిక్షాలు ఎంపికచేసిన విషయం తెలిసిందే. కనక నాగవరపమ్మ దేవస్థాన ప్రాంగణంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వేణు గోపాల్ రావు నియమితులైన నూతన ధర్మకర్తలతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతనంగా ఎంపికైన ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులను పలువురు అభినందిచారు. కార్యక్రమంలో చీరాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కౌతవరపు జనార్దన్, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు యార్లగడ్డ లక్ష్మీ, టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షులు దేవతోటి సుందరయ్య, ఈవో పోతిన శ్రీనివాసరావులు పాల్గొన్నారు.



అమ్మవారి దేవస్థానం కమిటీ సభ్యులు

అర్హుల పింఛన్లు రద్దు అయితే సంప్రదించాలి

బల్లికురవ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఎవరైనా అర్హత ఉండి పింఛన్లు రద్దు అయితే వెంటనే వారు మరో మారు చీరాల ఏరియా వైద్యశాలను సంప్రదించి తమ వద్ద ఉన్న సదరం సర్టిఫికెట్లను అందజేయాలని జిల్లా దివ్యాంగుల విభాగం ప్రధాన కార్యదర్శి దమ్ము అంజయ్య కోరారు. తమ సర్టిఫికెట్లను పునఃపరిశీలన చేసుకొని ఎంపీడీవో కార్యాలయంలో అందజేస్తే తిరిగి పింఛన్లు మంజూరు చేస్తారని తెలిపారు.



చీమలమర్రి వద్ద ఉన్న ఎండిన చెట్లు

కర్నూల్‌రోడ్డుపై పొంచి ఉన్న ప్రమాదం

- రహదారికి ఇరువైపులా ఎండిన చెట్లు



చీమకుర్తి,ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి నుంచి ఒంగోలుకు వెళ్లే కర్నూల్ రోడ్డు మార్గంలో ప్రమాదం పొంచి ఉంది. రహదారికి ఇరువైపులా ఉన్న వృక్షాలలో కొన్ని ఎండిపోయి ఏక్షణాన్నైనా విరిగి రోడుపై పడే పరిస్థితి నెలకొంది. వర్షాకాలం, గాలుల సమయంలో విరిగి రహదారిపై పడితే వాహనదారులకు ప్రాణ ప్రమాదం చోటుచేసుకునే పరిస్థితి ఉంది. ఒకటీ అరా కాదు దాదాపు 28 భారీ చెట్లు ఇలా ప్రమాదకరంగా ఎండిపోయి రోడ్డుపక్కన ఉండటం ఆందోళన కల్గిస్తున్నది.దీనిపై చర్యలు తీసుకోవాలని చీమకుర్తి పట్టణానికి చెందిన బీజేపీ బిల్డింగ్ వర్కర్స్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండా శ్రీనివాసరావు సోమవారం జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. తక్షణమే ఎండిన చెట్లను తొలగించే చర్యలు చేపట్టి ప్రమాదం చోటుచేసుకోకుండా చూడాలని వినతిపత్రం అందజేశారు.

కండ్లగుంట సొసైటీ చైర్మన్‌గా పున్నారెడ్డి బాధ్యతలు

నాగులుప్పలపాడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కండ్లగుంట సొసైటీ త్రీమెన్ కమిటీ చైర్మన్‌గా మున్నంగి పున్నారెడ్డి, డైరెక్టర్‌లుగా అత్తంటి కోటేశ్వరరావు, డి.వెంకట్రావులు సోమవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో పదవీ బాధ్యతలను స్వీకరించారు. వారిని టీడీపీ మండలాధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు ఇంటూరి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఈదర వెంకటకృష్ణారావు, పలు గ్రామాల నాయకులు పూలబొకెలు అందజేసి అభినందించారు.

పెన్షన్‌ల తొలగింపుపై అప్పీలుకు అవకాశం

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల పెన్షన్ అప్పీల్ ప్రక్రియకు అనర్హులుగా నోటీసు అందుకున్న వారు, తాము అర్హులమని భావించినట్లయితే సమీప మండల పరిషత్ అభివృద్ధి అధికారి, (పీఎండీవో), మునిసిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలో కమిషనర్‌ను సంప్రదించి, తమ అర్జీని సమర్పించవచ్చని సెకండరీ హెల్త్ విభాగం సంచాలకులు సోమవారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు అర్జీని పరిశీలించి పెన్షన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి, తదుపరి షెడ్యూల్ ప్రకారం అర్జీదారుని ఆసుపత్రికి హాజరు కావాలని తెలియజేస్తూ మరో నోటీసు జారీ చేస్తారని తెలిపారు. ఎప్పుడు, ఏ ఆసుపత్రి అనే వివరాలు ఆ నోటీసులో తెలియజేస్తారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు గ్రామ/వార్డు సచివాలయ సెక్రటరీలను సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలకు పూర్వ విద్యార్థి చేయూత

సంతనూతలపాడు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.తక్కెళ్లపాడు గ్రామంలో మండల పరిషత్ పాఠశాలకు సోమవారం పూర్వవిద్యార్థి, టీడీపీ నేత కుంచాలరాజు రూ.18వేల విలువచేసే బీరువా, రూ.2వేల విలువచేసే సీలింగ్ ఫ్యాన్‌ను హెచ్‌ఎం సరస్వతికి అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదివి ఇష్టమైన స్థానాలకు చేరుకోవాలని, అదే విధంగా తోటివారికి సహాయకారిగా ఉండాలని పూర్వ విద్యార్థి కుంచాలరాజు తెలిపారు. అనంతరం రాజును ఘనంగా దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం పీపీ.శ్రీనివాస్, ఉపాధ్యాయులు, గ్రామనాయకులు పాల్గొన్నారు.

గణేష్ మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి

కనిగిరి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాబోయే వినాయకచవితి సందర్భంగా ముందస్తుగా గణేషుని విగ్రహ మండపాల ఏర్పాటుచేసుకునే వారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్ అన్నారు. సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వినాయక విగ్రహం ఏర్పాటు చేసుకునే మండపం యొక్క కమిటీ పోలీస్ యాప్‌లో సంబంధిత పత్రాలను పొందుపరచి నమోదు చేసుకుంటే అనుమతి జారీ చేస్తామన్నారు. మండపాలను ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవటంతో పాటు నిమజ్జనం రోజున పోలీసు ఆంక్షల నడుమ చేసుకోవాలన్నారు. పోలీసుల ఆంక్షలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నీ చిత్రం చూసి..

ప్రతి దృశ్యం ఓ జ్ఞాపకం.. భవిష్యత్ తరానికి ఓ సాక్ష్యం.. ● స్నేహానికి చెరగని గురుతు.. సెల్ఫీ..
● అన్నివర్గాల వారికి మరపురాని జ్ఞాపకంగా ఫొటో ● నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

ఫొటోగ్రఫీ రోజురోజుకీ కొత్త పుంతలు తొక్కుతోంది. ఆధునిక రంగంలో దూసుకెళుతోంది. వెయ్యి మాటల్లో చెప్పలేని భావాన్ని ఒక్క ఫొటో చెబుతుంది. వర్తమాన అంశాలను భవిష్యత్ తరాలకు అందిస్తుంది. మధుర జ్ఞాపకాలను తరతరాలు భద్రపరుస్తుంది. పండుగలు, పబ్బాలు, వివాహ వేడుకలు, విషాదగీతికలు, సాహసాలు, సవాసాలు.. ఇలా అన్నింటికీ 'ఫొటో' సాక్ష్యంగా నిలుస్తుంది. ప్రతి ఫొటో వెనుక ఓ జ్ఞాపకం.. ఓ కథ.. ఓ అనుభూతి దాగుంటుంది. అందుకే నేటి దైనందిన జీవితంలో ఫొటోగ్రఫీ ఓ భాగంగా మారింది. ప్రస్తుతం ఫొటోకి మరింత డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఫొటోగ్రఫీ వృత్తి చేపట్టిన వారి భవిష్యత్తుకు ఢోకాలేదనిపిస్తుంది. ఆగస్టు 19 ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం. - ఒంగోలు కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)



ఫొటోగ్రఫీ దినోత్సవం పుట్టిందిలా ..

మొట్టమొదటి సారిగా జోసఫ్ నిసీఫోర్ 1826లో ఫోటోను రూపొందించగా అంతగా ప్రాచుర్యం పొందలేదు. ఆ తర్వాత లూయిస్ డాగురే 1837లో ఫొటోకు గుర్తింపు తీసుకొచ్చారు. ఏడాది తర్వాత 1839లో ఆగస్టు 19న ఫ్రెంచ్ ప్రభుత్వం అక్కడి ప్రజలకు ఉచితంగా ఫొటోలు తీయడంతోపాటు, దాని ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లింది. దీంతో ఆగస్టు 19న ఫొటోగ్రఫీ దినోత్సవంగా జరుపుకుంటారు. తొలుత బ్లాక్ అండ్ వైట్ ఫోటోలు, ఆ తర్వాత ఈస్టమన్ కలర్ ఫోటోలు అందుబాటులోకి రాగా, మారుతున్న కాలక్రమంలో ప్రస్తుతం డిజిటల్ ఫొటోగ్రఫీ ప్రపంచ వ్యాప్తంగా అగ్రస్థానంలో నిలిచింది.

ఫ్యాషన్ షోలపై ఫొటో ప్రభావం

ముంబాయి, ఢిల్లీ, హైదరబాద్, బెంగళూర్ తదితర పెద్ద పెద్ద సిటీలలో జరుగుతున్న ఫ్యాషన్ షోలను సైతం తిలకిస్తున్న యూత్ వారిలాగా అందంగా, ఆకర్షణీయంగా ఉండాలనే ఆసక్తితో రోజురోజుకు పెరుగుతోంది. దీంతో ఎంత ఖర్చయినా సరే ఫోటో షూట్ చేయించుకుని ఆల్బన్‌లను తయారు చేసుకుని, అవకాశాల కోసం పరుగులు పెడుతున్నారు.

లైక్‌ల కోసం ఫొటోలకు ఫోజులు..

ప్రత్యేకించి ఇటీవల కాలంలో యువత ఫ్యాషన్ ఫొటో గ్రఫీవైపు అడుగులు వేస్తోంది. క్యాంపస్ కబుర్లతోనే కాలక్షేపం చేయకుండా, తమ స్నేహానికి చెదరని గుర్తులుగా చిత్రాలతో మరింత మెరుగులు దిద్దుకుంటోంది. క్రాఫ్ స్టైల్ మారిస్తే ఫొటో.. కొత్త షర్ట్ కొంటే ఫొటో.. కొత్త బైక్ కొంటే ఫొటో.. ఇలా ఏదో ఒక సందర్భంలో యువత జీవితం ఫొటోతో ముడిపడుతుంది. నేటి యువతీ యువకులు.. టాలీవుడ్, బాలీవుడ్ హీరోలను అనుకరిస్తూ, పలు మోడల్ ఫొటోలతో యూట్యూబ్‌లలో, వాట్సాప్‌లలో హల్‌చల్ చేస్తున్నారు. దీంతో వారికి వచ్చే ఫొటోలకు లైక్‌లు, కామెంట్‌లకు మరింతగా మురిసిపోతున్నారు. ఇటీవల కాలంలో ఈ సంస్కృతి మరింత పెరిగింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్.. యూట్యూబ్‌లతోపాటు, పలు రకాల యాప్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేస్తూ సందడి చేస్తున్నారు.



కల్యాణ బంధం కలకాలం గుర్తుండేలా

నేటి రోజుల్లో పెళ్లి అంటే రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. కళ్లముందు ఇంట్లో జరిగే వేడుక కలకాలం ఉండాలంటే కచ్చితంగా ఫొటోలు, వీడియోలు ఉండాల్సిందే. ఒకప్పుడు ఒక ఫొటోగ్రాఫర్, ఓ వీడియో గ్రాఫర్, పెళ్లి తంతు పూర్తయ్యాక ఓ ఆల్బమ్ ఇంతకుమించి పెద్దగా కనిపించేవి కావు. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. పెళ్లికి వారం ముందు నుంచే వధూవరుల ఇళ్ల వద్ద హడావిడి, సాధారణ పెళ్లి వేడుకకే ఫొటో, వీడియో, ఆల్బమ్‌లకు ఆసక్తి చూపుతున్నారు. మొత్తానికి ప్రతి వేడుక కలకాలం గుర్తుండేలా చేయడంలో ఫొటోగ్రఫీదే పెద్దపీట.

చిన్నబోయిన కంభం చెరువు

● వర్షాభావం, మధ్యలో అడ్డుకట్టలతో చేరని నీరు ● ఆందోళనలో ఆయకట్టు రైతులు

కంభం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వరుస తుఫాన్లతో, అల్పపీడన ప్రభావాలతో అన్ని డ్యాంలు, చెరువులు, కుంటలు పొంగిపొర్లుతూ జలకలను సంతరించుకున్నాయి. కానీ ఆసియ ఖండంలోనే 2వ అతిపెద్ద చెరువు అయిన కంభం చెరువుకు నీరు రాకపోవడంపై ఆయకట్టు పరిధి లోని రైతులు కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. 3 సంవత్సరాలుగా కంభం చెరువుకు 4 అడుగుల మేర నీరు వచ్చింది. చెరువు సంపూర్ణంగా నిండాలంటే 21 అడుగులకు నీరు చేరాలి. 2020లో కురిసిన భారీ వర్షాలకు చెరువు నిండి అలుగు పారిన విషయం విదితమే. అప్పటి నుంచి ఇప్పటివరకు చెరువుకు నీరు రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది భారీ వర్షాలు కురిసినా నల్లమల అడవుల్లో ఆశించిన మేర వర్షాలు పడకపోవడంతో చెరువుకు ప్రధాన నీటి వనరులైన గుండ్లకమ్మ నుంచి వరద నీరు రాలేదు. రాచర్ల మండలం చినగానిపల్లె వద్ద కంభం చెరువుకు నీరువచ్చే నీటివనరు గుండ్లకమ్మకు అడ్డంగా డ్యాం నిర్మించడంతో నల్లమల అటవీ ప్రాంతాల నుంచి వచ్చిన కొద్దిపాటి నీరు అక్కడే నిలిచిపోతోంది. దీంతో ఈ ఏడాది చెరువుకు నీరు చేరలేదు. ప్రస్తుతం 4 అడుగులమేర ఉన్న నీటిని భూగర్భజలాలు పెరిగేందుకు అలాగే ఉంచారు. దీనికితోడు రెండు తూముల నుంచి లీకుల ద్వారా నీరు వృథాగా పోతోంది. చెరువు



కంభం చెరువులో ఉన్న కొద్దిపాటి నీరు

కింద 10వేల ఎకరాలు అధికారికంగా, 7వేల ఎకరాలు అనధికారికంగా సాగు చేస్తున్నారు. ఈ పొలాల సాగు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. కంభం చెరువులోని కొద్దిపాటి నీటి వల్ల 3 మండలాల్లో భూగర్భజల మట్టాలు పెరిగి నీటిబోర్లలో నీరు చేరుతాయన్న ఆశతో ప్రజలు ఉన్నారు.

● వందేళ్లలో 11 సార్లే నిండింది

కంభం చెరువు వందేళ్లలో పూర్తిగా నిండింది 11 సార్లే. శ్రీకృష్ణదేవరాయల సతీమణి వరదరాజమ్మ (సచీదేవి) సుమారు 500 ఏళ్ల క్రితం 25వేల హెక్టార్ల విస్తీర్ణంలో చుట్టూ కొండలే ఆనకట్టలుగా చెరువును నిర్మించారు. ఇరిగేషన్ అధికారులు 100 ఏళ్ల నుంచి తయారు చేసిన రికార్డుల ప్రకారం 1917, 1948, 1949, 1950, 1956, 1963, 1966, 1975, 1983, 1996, 2020 సంవత్సరాలలో మాత్రమే చెరువు పూర్తిగా నిండింది. ప్రస్తుతం రెండు తుపాన్లు ఉన్నాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్న ప్రకారం ఈ తుఫాన్లలోనైనా కంభం చెరువుకు నీరు చేరుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

లారీని ఢీకొట్టిన మోటార్ బైక్

● బైకిస్టుకు తీవ్ర గాయాలు
● ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

సింగరాయకొండ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై వెళ్తున్న లారీ అకస్మాత్తుగా నెమ్మదించడంతో వెనుకవైపు వస్తున్న మోటార్ బైక్ లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైకిస్ట్ తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈసంఘటన స్థానిక జాతీయ రహదారి (రన్‌వేపై) శ్రీవెంకటేశ్వర కల్యాణమండపం ఎదుట సోమవారం చోటుచేసుకుంది. జరుగుమల్లి మండలం నందనవనం గ్రామానికి చెందిన ఇత్తడి జయప్రకాష్ (38) కె.బిట్రగుంట జాతీయ రహదారి పక్కన ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తుంటాడు. మూలగుంటపాడులో నివాసం ఉండే తను పనిచేసే పెట్రోల్ బాంకు యాజమానిని కలిసేందుకు మోటార్ బైక్‌పై జయప్రకాష్ బయల్దేరాడు. ఈక్రమంలో జాతీయ రహదారి వద్దకు చేరుకునేసారికి వేగంగా వెళ్తున్న లారీ ఒక్కసారిగా నెమ్మదించడంతో బైక్ అదుపుతప్పి వెనుకవైపు లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జయప్రకాష్ తలకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే మొబైల్ పోలీసులు తక్షణమే స్పందించి హైవే అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కి తరలించారు. ప్రమాద సమయంలో తలకు హెల్మెట్ ఉన్నా గాయాలపాలయ్యాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ జయప్రకాష్ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. జరిగిన ప్రమాదంపై ఎస్సై బి.మహేంద్ర కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడిపై

సస్పెన్షన్ వేటు

సింగరాయకొండ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థిని లైంగికంగా వేధించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న మండలంలోని ఊళ్లపాలెం జడ్పీ హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడు పిల్లి హజరత్తయ్యపై ఎట్టకేలకు సస్పెన్షన్ వేటుపడింది. వివరాల్లోకి వెళ్తే.. వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పిల్లి హజరత్తయ్య విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవరిస్తూ, ఒక విద్యార్థిని లైంగికంగా వేధించారని కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు అందింది. దీంతో కలెక్టర్ విచారణ జరిపి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని డీఈవో కిరణ్‌కుమార్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో హజరత్తపై విచారణకు డీఈవో త్రిసభ్య కమిటీని నియమించారు. ఈ కమిటీ వ్యాయామ ఉపాధ్యాయుడిపై వచ్చిన ఆరోపణలు నిజమని నివేదిక ఇచ్చింది. దీంతో డీఈవో అతన్ని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వులను పాఠశాల హెచ్‌ఎం డీఎస్‌కేవీ ప్రసాద్ సోమవారం హజరత్తయ్యకు అందజేసినట్లు ఏంఈవో కత్తి శ్రీనివాసులు తెలిపారు.

ఐటీఐ జాబ్‌మేళాలో

31 మందికి ఉద్యోగాలు

ఒంగోలు విద్య, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు సమీపంలోని త్రోవగుంటల వద్ద ఉన్న శ్రీ శివసాయి ఐటీఐలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 31 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌కు చెందిన ఒక కంపెనీ నిర్వహించిన ఈ మేళాకు 42 మంది అభ్యర్థులు హాజరు కాగా వారికి రాతపరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరిలో 31 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. 23 మంది ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారని ఐటీఐ కరస్పాండెంట్ కారుమూడి శ్రీనివాసరావు తెలిపారు. వీరికి రూ.15వేల నెలసరి జీతం ఇస్తారు. ఉద్యోగాలకు ఎంపికైన బీటెక్, బీఎస్సీ అభ్యర్థులకు నెలకు రూ.20 వేలు జీతం ఇవ్వనున్నట్లు కంపెనీ ప్రతినిధి హరికృష్ణ తెలిపారు.

వర్షాకాలం.. తస్మాత్ జాగ్రత్త..!

● విద్యుత్ శాఖ ఎస్ఈ

ఒంగోలు క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో విద్యుత్‌కు సంబంధించి పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

వర్షాకాలం తీసుకోవల్సిన జాగ్రత్తలు

- వర్షం పడే సమయంలో విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, తీగలు ఉన్నచోట గుమికూడకూడదు.
- తడి చేతులతో విద్యుత్ స్విచ్ ఆన్, ఆఫ్ చేయకూడదు.
- ఇళ్లలో తడి నేలపై ఎలక్ట్రిక్ తీగలు, పరికరాలు పడకుండా చూడాలి.
- విద్యుత్ తీగలు కింద పడి ఉంటే వెంటనే 1912 నంబర్‌కు సమాచారం ఇవ్వాలి.
- వర్షాలు పడే సమయంలో విద్యుత్ తీగలు చెట్ల మీద పడి ఉంటే దగ్గరకు వెళ్లకూడదు.
- విద్యుత్ తీగలు, స్తంభాలు దగ్గర గుడారాలు, షెడ్‌లు, టెంట్లు వేయకూడదు.
- పిల్లలు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర ఆడకూడదు.
- వర్షాకాలం మోటార్ వాడకం తగ్గించాలి.

9.75 మెట్రిక్ టన్నుల ఎరువులకు స్టాప్‌సేల్

ఎర్రగొండపాలెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెంలో లలితా ఎరువుల దుకాణంలో అనుమతి లేని 9.75 మెట్రిక్ టన్నుల ఎరువులకు స్టాప్‌సేల్‌ను విధించారు. సోమవారం స్థానిక లలితా ఎరువుల దుకాణంలో సోదాలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్, ఎరువుల స్టాక్‌ను పరిశీలించిన ఏవో 9.75 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలపై నిషేధం విధించారు. ఆ ఎరువుల విలువ లక్షా తొంబైవేల ఐదు వందలని తెలిపారు.



లలితా ఎరువుల దుకాణంలో స్టాకు రిజిష్టర్లను పరిశీలిస్తున్న ఏవో నీరజ

● పెద్ద దోర్నాల : ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలని లేనిచో చర్యలు తీసుకుంటామని వ్యవసాయధికారి జవహర్‌లాల్ నాయక్ అన్నారు. మండలంలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు.

పింఛన్‌ను పునరుద్ధరించండి

సదరం సర్టిఫికెట్లతో కలెక్టరేట్‌కు పరుగులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పింఛన్‌ను తొలగిస్తున్నట్లు ఇచ్చిన నోటీసులతో బాధితులు కలెక్టరేట్‌కు బారులు తీరారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన దివ్యాంగులతో పాటు వివిధ అనారోగ్య కారణాలతో మంచానికే పరిమితమైన బాధిత కుటుంబ సభ్యులు తమ పింఛన్‌ను తొలగించవద్దంటూ కలెక్టరేట్‌కు తరలివచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దివ్యాంగులు, వీల్‌చైర్, మంచానికి పరిమితమై నెలకు రూ.15వేలు పింఛన్ పొందుతున్న బాధితుల కుటుంబసభ్యులు ఆయా సర్టిఫికెట్లను తీసుకొని కలెక్టరేట్‌కు వచ్చారు. తమకు పింఛన్ తీసుకునేందుకు అర్హత ఉన్నా పింఛన్‌ను తొలగిస్తున్నట్లు తమకు నోటీసులు ఇచ్చారని తమకు న్యాయంచేసి ఆదుకోవాలని అర్జీని అధికారులకు అందజేశారు. మరికొంత మంది తమకు అన్ని అర్హతలూ ఉన్నా తొలగించేందుకు కుట్ర చేస్తున్నారని న్యాయం చేయాలని కోరారు. ఇంకొకవైపు మంచానికే పరిమితమైన పింఛన్‌దారులకు నెలకు



రూ.15వేలు ఇస్తుండటంతో వారి కుటుంబసభ్యులు కూడా తమ సమస్యను చెప్పుకునేందుకు కలెక్టరేట్‌కు పరుగులు తీస్తూ వచ్చారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 30 మందికిపైగా కలెక్టరేట్‌కు వచ్చి తమ సమస్యలను సంబంధిత అధికారులను కలిసి విన్నవించుకున్నారు.



సీడీని ఆవిష్కరిస్తున్న ఎస్పీ దామోదర్

మంచి రచనలు ఉపయోగకరం

● ఎస్పీ దామోదర్

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో మార్పును తీసుకువచ్చే మంచి రచనలు ఉపయోగకరమని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. మార్కాపురం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డోలా శ్యామలాదేవి రచించిన విద్యార్థులారా చెడునడతలు వద్దు అనే పాటకు సంబంధించిన సీడీని ఎస్పీ దామోదర్ సోమవారం ఆవిష్కరించారు. విద్యార్థులు, యువత నేటి సమాజంలో ఎదుర్కొంటున్న దుష్పరిణామాలైన మాదక ద్రవ్యాలు, బెట్టింగ్‌లు, ఆత్మహత్యలు ర్యాగింగ్ వంటి సమాజ వ్యతిరేక కార్యకలాపాలపైన శ్యామలాదేవి రాసిన పాట ఎంతో ఉపయోగకరమని అన్నారు. కార్యక్రమంలో పండిత పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జీఎల్ రమేష్‌బాబు, ఉర్దూ పండితులు సమీవుల్లా పాల్గొన్నారు.



నవోదయ స్కూల్‌లో కళాఉత్సవ్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థులు

కళా ఉత్సవ్‌లో అలరించిన నవోదయ విద్యార్థులు

తర్లుపాడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలుజువ్వలపాడు గ్రామ పరిధిలో జవహర్ నవోదయ విద్యాలయంలో సోమవారం నుంచి కళా ఉత్సవ్ కార్యక్రమం ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. రెండు రోజులపాటు జరిగే కళా ఉత్సవ్‌లో హైదరాబాద్ రీజియన్‌లోని ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 19 నవోదయ పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్నట్లు తెలిపారు. విద్యార్థులు ప్రత్యేక వేషధారణ, నృత్యాలతో ఆకట్టుకున్నారని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మార్కాపురం మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ప్రకృతిని కాపాడుకుంటూ స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కావాలని తెలిపారు. విద్యతో పాటు కళలపై కూడా ఆసక్తి ఉండాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న కళను వెలికితీసేందుకు ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సాధన కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మధుసూదన్‌శర్మ, గుంటూరు ప్రభుత్వ మ్యూజిక్ స్కూల్ అధ్యాపకులు, న్యాయ నిర్ణేతలు సురేష్ బాబు, ప్రభాకర్‌రావు, జయశంకర్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



మీ కోసంలో అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్,ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : వివిధ సమస్యల పరిష్కారం కోసం మీ కోసంలో వచ్చిన అర్జీలను త్వరిత గతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలు పలు సమస్యలను విన్నవించారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో జరిగిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ గ్రీవెన్స్‌సెల్‌లో వచ్చేఅర్జీల విషయంలో అధికారులు ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. ఆయా శాఖల అధికారులు అర్జీలను త్వరితంగా పరిష్కరించాలన్నారు. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా చూసుకోవాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని జేసీ ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేషు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, శ్రీధర్‌రెడ్డి, కుమార్, జాన్సన్‌తో పాటు పలుశాఖల అధికారులు ఉన్నారు.



డీవైఎఫ్ఐ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రామన్న

ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : వివిధ ప్రభుత్వశాఖల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్రకార్యదర్శి జీ రామన్న డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సోమవారం డైఫీ జిల్లా స్థాయి తరగతులకు అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య అధ్యక్షత వహించారు. సమావేశంలో రామన్న మాట్లాడుతూ ఇటీవల ఇచ్చిన డీఎస్సీ పోస్టులు కాకుండా మిగిలి ఉన్న టీచర్ పోస్టులనూ భర్తీచేయాలన్నారు. పోలీస్‌శాఖలో సుమారు 20వేలకు పైగా ఖాళీలు ఉంటే కేవలం 6,100 మాత్రమే భర్తీ చేశారని, మిగిలిన పోస్టులను కూడా భర్తీ చేయాలన్నారు. ఇలా అనేక శాఖల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయని,ఆయాపోస్టులను భర్తీ చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్, పి.నరేంద్ర, జి.కొండయ్య, మోహన్, సురేష్ తదితరులు ఉన్నారు.



స్టేడియాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ రజియా సుల్తానా

ఇండోర్ క్రీడా స్టేడియం ఏర్పాటు అభినందనీయం

నాగులుప్పలపాడు, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గ్రామీణ ప్రాంతంలో ఇండోర్ క్రీడా స్టేడియం ఏర్పాటు చేయడం అభినందనీయమని స్థానిక ఎస్ఐ రజియాసుల్తానా పేర్కొన్నారు. ఉప్పుగుండూరు గ్రామంలోని ఆర్‌వీఆర్ పాఠశాల యాజమాన్యం పాత ఎస్సీ హాస్టల్ వద్ద ఏర్పాటు చేసిన ఇండోర్ స్టేడియంను సోమవారం ఎస్ఐ రజియా సుల్తానా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టేడియం ఏర్పాటుతో ఎంతో మంది క్రీడాకారులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌వీవీ కరస్పాండెంట్ గుమ్మడి నరేష్, సెక్రటరీ గుమ్మడి కిషోర్, విశ్రాంత పీడీ గోపాలరావు, కొంజేటి సురేష్‌బాబు, కనగాల శ్రీనివాసరావు, బెల్లం శ్రీను, నల్లూరి భాస్కరరావు, బాలిశెట్టి నాగేశ్వరావు, ఇమ్మిశెట్టి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా నేతలు

స్ఫూర్తి బహిరంగ సభను విజయవంతం చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు పిలుపు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 30న విజయవాడలో జరగనున్న స్ఫూర్తి బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సంచారజాతుల వారితో జరిగే ఈ సభలో జిల్లాలోని సంచారజాతులకు చెందిన వారందరూ పాల్గొనాలని కోరారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో సోమవారం బహిరంగ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసులు మాట్లాడుతూ సంచారజాతులువారు కొన్ని ప్రాంతాల్లో కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డులు, సామాజికపరమైన టువంటి లబ్ధిని పొందలేకపోతున్నారని తెలిపారు. ఈ సమస్యలన్నింటిని దృష్టిలో పెట్టుకొని ఈనెల 30న విజయవాడలో స్ఫూర్తి పేరుతో నిర్వహిస్తున్న బహిరంగ సభలో సంచారజాతుల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో బీజేపీ మాజీ అధ్యక్షుడు పీవీ కృష్ణారెడ్డి, నాయకులు తానికొండ సురేష్, మాకినేని అమరసింహం, దండు శ్రీనివాసరావు, అశారావు, జిల్లెళ్ళమూడి రమాదేవి, రాధాకృష్ణ, కే సుధాకర్ తదితరులు ఉన్నారు.

వీధులన్నీ చెత్తమయం

వర్షాలతో వెంటాడుతున్న వ్యాధుల భయం
మాటేసి ఉన్న మలేరియా మహమ్మారి
కనిపించని దోమలపై దండయాత్ర
పట్టణవాసుల్లో ఆందోళన

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) :



భాగ్యనగర్ నాల్గో లైను మెయిన్ రోడ్‌లో నిల్వఉన్న చెత్తకుప్పలు

ప్రజారోగ్యంపై నగరపాలక సంస్థ యంత్రాంగం పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. రోజూ పారిశుధ్య పనులు చేపట్టి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో నగరపాలక సంస్థ, నిర్లక్ష్యం అవలంబిస్తోంది. వాతావరణంలో మార్పులతో వర్షాలు కురుస్తుండగా ప్రబలుతున్న వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్న ఆదేశాలను సిబ్బంది విస్మరించారు. కనీస ప్రచార కార్యక్రమలు కూడా నిర్వహించకపోవడంతో పట్టణాలు కంపుకొడుతుండగా విజృంభిస్తున్న దోమల తాకిడితో పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వెంటాడుతున్న వైరల్ జ్వరాలు

వర్షాకాలం అంటేనే వ్యాధుల భయం.. చెరువులోకి కొత్త నీరు రాకతో విజృంభించేందుకు వ్యాధులు పొంచి వున్నాయి. దోమల వ్యాప్తికి అనుకూలమైన వాతావరణం కావడంతో మలేరియా భయం పట్టణ ప్రజలను వేధిస్తోంది. వార్డులో పర్యటించి, నీటి స్విలలు లేకుండా, ఇళ్ల మధ్య మురుగు కనిపించకుండా, ఖాళీ స్థలాల్లో చెత్త చెదారం లేకుండా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాల్సి ఉంది. అంతే కాకుండా నగరంలో ర్యాలీలు, విద్యార్థులకు చైతన్యం కలిగించేలా కరపత్రాల పంపిణీ, వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృష్టి సారించాల్సి ఉండగా పట్టణ ప్రాంతాల్లోనూ, పురపాలక సంఘాల్లో అలాంటి వాతావరణం కనిపించడం లేదు. ప్రజలను చైతన్యం చేస్తూ వారి సహకారతో మరింత మెరుగైన ప్రచారం నిర్వహించి మలేరియా నిర్మూలనకు ఉపక్రమించాలని పురపాలక శాఖ ఆదేశించినా పట్టించుకోకపోవడం నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తోంది.

కంపుకొడుతున్నాయ్...

మలేరియా జ్వరాలను నివారించేందుకు ప్రతి రోజు పారిశుధ్య పనులు నిర్వహించడంతోపాటు వ్యాధులు అధికంగా వ్యాప్తి చెందే ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతంలో శుభ్రత, పరిశుభ్రతపై అ వగాహన కల్పించాలి. ఇంటి వాతావరణం, పరిసరాల పరిశుభత్ర, వ్యాధులపై అవగాహన కల్పించాలి. దాంతోపాటుగా ప్రతి రోజు కాలువల్లో మురుగు తొలగింపు, తడి చెత్త నిల్వ లేకుండా చూడాలి. ఖాళీ ప్రదేశాలలో, కాలువల్లో మురుగునీటిపై వ్యాపించే దోమలను లార్వా దశలోనే అంతం చేసేందుకు తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది. మామూలు రోజుల్లో ఎలా ఉన్నప్పటికీ ఈ కాలంలో నీటి నిల్వలపై, ఖాళీ స్థలాల్లో మురుగునీటిపై గంబూషియా చేపలు విడుదల చేయాలి. వృద్ధి చెందని దోమలను అంతం చేసేందుకు అబెట్, పైరిత్రిమ్, మలాథియన్‌తో స్రే, మలాథ్రియన్ ద్రావణంతో ఫాగింగ్ చేయాలి. వాటితోపాటు ప్రతి వీధిలోనూ చెత్తను తొలగించిన పిదప బ్లీచింగ్ చల్లి, పట్టణాల్లో పరిశుభ్రమైన వాతావరణం కనిపించేలా చూడాలి. కానీ ఇలాంటి పరిస్థితి జిల్లాలోని ఏ పట్టణంలోనూ కనిపించడం లేదు.



దేవుడు చెరువులోని హౌసింగ్ బోర్డులో పేరుకుపోయిన చెత్తాచెదారం

నీటి కాలుష్యంతో ముప్పు

నీటి కాలుష్యం కారణంగా డయేరియా, పచ్చకామెర్లు, వైరల్ జ్వరాలు, చికెన్‌పాక్స్, పిల్లల్లో మీజిల్స్ నీళ్ల విరేచనాలు, గవదబిళ్లలు ఇలా పలు రకాల వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువ. దాంతో ప్రస్తుతం చెరువుల్లో కొత్తగా వస్తున్న నీటిని అధికార యంత్రాంగం కొళాయిల ద్వారా గృహాలకు విడుదల చేయడంతో రోగాలు మరింతగా వచ్చే అవకాశం ఉంది. అయితే కొళాయిల ద్వారా వచ్చే నీటిని ఏ రోజుకారోజు నీటి పరీక్షలతో పాటు శుద్ధి చేసి అందించాల్సిన యంత్రాంగం కొన్ని ప్రాంతాలలో అలాగే వదిలేయడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

స్క్రీనింగ్ టెస్ట్ శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

సంతనూతలపాడు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు గల స్క్రీనింగ్ టెస్టు శిబిరాన్ని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ సంతనూతలపాడు హై స్కూల్లో సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వపరంగా అవసరమైన పరికరాలను అందించాలని, ప్రభుత్వం తరుపున సమకూరేటట్టు కృషిచేస్తానన్నారు. ఈశిబిరంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వచ్చిన 45 మంది పిల్లలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించగా 40 మంది విద్యార్థులను అర్హులుగా గుర్తించారు. కార్యక్రమంలో వైద్యులు జోగేంద్ర, జయరామ్, మండలటీడీపీ అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, టీడీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, ఆర్. అంకారావు, బి.శంకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.



స్క్రీనింగ్ టెస్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఎమ్మెల్యేకు సత్కారం

ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను సోమవారం ఒంగోలులోని ఆయన కార్యాలయంలో నూతనంగా చెన్నకేశవ స్వామి, త్రిపురాంతకస్వామి ఆలయ డైరెక్టర్లుగా నియమితులైన డి.సుబ్బారెడ్డి, ఎస్.ఉమామహేశ్వరరావు, కమిటీ డైరెక్టర్లు దుశ్శాలువాతో సత్కరించారు.

పీఏసీఎస్ చైర్మన్ల బాధ్యతల స్వీకరణ

పొన్నలూరు సొసైటీ అధ్యక్షునిగా కొండలరావు..

పొన్నలూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పొన్నలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా ఇప్పగుంటకు చెందిన ఉన్నం కొండలరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనతోపాటు డైరెక్టర్లుగా చెరువ కొమ్ముపాలెంకు చెందిన భూమిరెడ్డి ఎరుకలరెడ్డి, పొన్నలూరుకు చెందిన లింగంగుంట బ్రహ్మయ్య కూడా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ సహకార సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మాజీ అధ్యక్షుడు మండవ ప్రసాద్, మాజీ సర్పంచ్ పల్లపోతు ప్రసాద్, నాయకులు గుమ్మళ్ల వెంకట్రావు, మండవ మురళీమోహన్, మన్నెం రమణయ్య, రాఘవరెడ్డి, రమణారెడ్డి, కంటు గోపి, ఉన్నం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కొండలరావును అభినందిస్తున్న టీడీపీ నేతలు

కరవదిసొసైటీ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు..

ఒంగోలు(రూరల్),ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం కరవది ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) త్రీమెన్ కమిటీ అధ్యక్షుడిగా ముప్పవరపు శ్రీనివాసరావు సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయనను, కమిటీ సభ్యులు పోలవరపు చెంచు రామయ్య, చిల్లర హనుమంతరావులను మండల టీడీపీ నాయకులు సన్మానించి అభినందించారు.

ఈ కార్యక్రమంలో టీడీపీజిల్లా మాజీ అధ్యక్షుడు చుంచుశేషయ్య, తెలుగు రైతు సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పోలవరపు వెంకట్రామయ్య, టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి నలమోతు బాల గంగాధర్, మండల తెలుగు యువత అధ్యక్షుడు వలేటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కరవది సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసరావు



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

ఎంహెచ్‌వో క్షమాపణ చెప్పాలి

- కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కార్మికుల నిరసన

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ కొద్ది రోజులుగా వివిధ రూపాలలో నిరసన తెలియజేస్తున్న కార్మికుల పట్ల మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వైష్ణవి దురుసుగా మాట్లాడటంపై కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం కార్యాలయం ఆవరణంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కొర్నెపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం, నగర సుందరీకరణ కోసం నిరంతరం పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అయితే తమ నిరసనపై అభ్యంతరం వ్యక్తం చేసిన ఎంహెచ్‌వో కార్మికులను నోటికొచ్చినట్లు దుర్భాషలాడటం అన్యాయమన్నారు. తమ వ్యక్తిత్వాలను కించపరిచేవిధంగా మాట్లాడిన ఎంహెచ్‌వో క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనరు వెంకటేశ్వరరావు, మేయర్ గంగాడ సుజాతలకు వినతి పత్రం అందజేశారు.

డీఆర్‌ఆర్‌ఎం స్కూలు హెచ్‌ఎంపై విచారణకు ఆదేశం

- డీఈవో ఉత్తర్వుల జారీ

ఒంగోలు విద్య, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు డీఆర్‌ఆర్‌ఎం మునిసిపల్ హైస్కూలు ప్రధానోపాధ్యాయులపై వచ్చిన ఆరోపణలపై విచారణకు ఆదేశిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఎ.కిరణ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ఒంగోలు ఉప విద్యాధికారి చంద్రమౌళీశ్వరరావును విచారణాధికారిగా నియమించారు. పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ డి. అప్పారావు హెచ్‌ఎంపై పలు ఆరోపణలతో స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్‌ఎంసీ సమావేశాలు నిర్వహించకుండా నిర్వహించినట్లు బోగస్ తీర్మానాలు, సంతకాలు చేయిస్తున్నదని ఆయన ఫిర్యాదులో ఆరోపించారు. పాఠశాలలో చేరేందుకు విద్యార్థులు వస్తుంటే వారిని చేర్చుకోకుండా ఇతర పాఠశాలల్లో చేరమని వెనక్కు పంపిస్తున్నారని ఆరోపించారు. ఈ అంశాలపై విచారణ చేసి వెంటనే నివేదికను ఇవ్వాలని డీఈవో ఆదేశించారు.

సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగించుకోవాలి

ఒంగోలు విద్య, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత లక్ష్యాలతో ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సహకార శాఖ ఒంగోలు డిప్యూటీ రిజిస్ట్రార్ డి. శ్రీనివాసరావు కోరారు. రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు సోమవారం స్థానిక డీఆర్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమాచార హక్కు చట్టం, వివిధ సెక్షన్ల కింద ఏపీ సమాచారాన్ని ప్రజలకు అందజేయాల్సి ఉందో వివరించారు. పీఐవో, ఏపీఐవోలు స్పందించి సకాలంలో సమాచారం ఇవ్వకపోతే 30 రోజుల్లో పై అధికారికి అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్ కార్యాలయ సిబ్బంది, సొసైటీల సీఈవోలు, సిబ్బంది ఉన్నారు.



సమాచారహక్కు చట్టంపై ర్యాలీ నిర్వహిస్తున్న డీఆర్ కార్యాలయ సిబ్బంది

లైన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు నూతన కమిటీ ఎన్నిక

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : లయన్స్‌క్లబ్ ఆఫ్ ఒంగోలు నూతన కమిటీ ఆదివారం ఎన్నికైంది. స్థానిక కృష్ణప్రియ ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో నూతన అధ్యక్షుడిగా కేకే కంప్యూటర్స్ అధినేత ఒలేటి రవీంద్ర, సెక్రటరీగా అద్దంకి శ్రీనివాసరావు, కోశాధికారిగా ప్రసన్న కుమార్‌లను ఎన్నుకోగా లయన్స్ డిస్ట్రిక్ గవర్నర్ గా ఎంపికైన సీహెచ్. హరిప్రసాద్‌ను నూతన కమిటీ ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో క్లబ్ సీనియర్ ప్రతినిధులు నామినేని మోహన్‌రావు, విజయ్‌కుమార్ రెడ్డి, విజయ్‌చంద్, లక్ష్మీనారాయణ, డాక్టర్ చావా ప్రకాష్, పలువురు పాల్గొని నూతన కమిటీని అభినందించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రవీంద్ర మాట్లాడుతూ సమాజ సేవలో మరింత ముందుకెళ్లి క్లబ్ సేవలను మరింత విస్తృతం చేసి మంచి పేరు తీసుకురానున్నట్లు తెలిపారు.



నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు

దరఖాస్తు గడువు పొడిగింపు

ఒంగోలు విద్య,ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్కూలు గేమ్స్ సెక్రటరిఎంపికకు దరఖాస్తులు సమర్పించేందుకు గడువును ఈనెల 20 వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్కూలు గేమ్స్ సెక్రటరి పదవీ రాలం రెండు సంవత్సరాలు ఉంటుంది. ఈ పోస్టుకు అర్హులైన, ఆసక్తి ఉన్న స్కూలు అసిస్టెంట్ వ్యాయామ విద్య, వ్యాయామ ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

నిందితుడిని అరెస్టు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : దొండపాడు గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్రఅధ్యక్షుడు సుజన్‌మాదిగ డిమాండ్‌చేశారు సోమవారం బాధిత కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోకపోతే ఉద్యమం చేపట్టాల్సి వస్తోందని ఆయన హెచ్చరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు.

కిరాణా షాపులో చోరీ

ఒంగోలు క్రైం,ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): కిరాణా షాపులో చోరీకి పాల్పడి రూ. 2.10లక్షలు అపహరించారు. ఈ సంఘటన స్థానిక పాతకూరగాయల మార్కెట్ వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగింది. కిరాణా షాపు షట్టర్ కోసి లోపలికి చొరబడి క్యాష్ బాక్స్‌లో ఉన్న రూ. 1.40 లక్షలు నగదు, రూ. 70 వేలు విలువ చేసే సిగిరెట్ పెట్టెల బాక్స్‌ను దొంగలు అపహరించుకెళ్లారు. ఈ మేరకు కిరాణా షాపు యజమాని బొమ్మిశెట్టి రఘునాథం ఫిర్యాదు మేరకు ఒంగోలు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు.

ఎల్ఐసీ ఏజెంట్లకు వృత్తి పన్ను రద్దు చేయాలి

ఒంగోలు(రూరల్)ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): వృత్తి పన్ను రద్దు చేయాలని ఎల్ఐసీ ఏజెంట్లు డిమాండ్ చేశారు. ఒంగోలు బ్రాంచ్ కార్యాలయంలో సోమవారం ఏజెంట్లు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజెంట్లు మాట్లాడుతూ టాక్స్ లేదని, ఇటీవలి కాలం నుంచి టాక్స్ వేస్తున్నారని, ఇది ఎంత మాత్రం తగదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్లు బి.వెంకట్రావు, సీహెచ్‌వీ సుబ్బారెడ్డి, పి.ఆంజనేయులు, కె.రమణారెడ్డి, బి. కృష్ణమూర్తి, వెంగళరావు, సుబ్బారావు, శ్రీనివాసరావు, పురుషోత్తం,నారాయణరెడ్డి, మధుబాబు పాల్గొన్నారు.



ఇరుపక్షాలతో మాట్లాడుతున్న ఒంగోలు ఆర్‌డీవో లక్ష్మీప్రసన్న

బీపీసీఎల్ పైపులైన్ నిర్మాణ పనుల అడ్డగింత

సంతనూతలపాడు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాంచారెడ్డి పాలెం సమీపంలో సర్వేనెంబరు 437లో సుమారు 5ఎకరాల ప్రైవేట్ స్థలంలో జరుగుతున్న కృష్ణపట్నం నుంచి హైదరాబాద్ వెళ్లే బీపీసీఎల్ పైపులైన్ నిర్మాణ పనులను సోమవారం స్థల యజమాని చలువాది బదరీనారాయణ, తన మనుషులు కలిసి అడ్డుకున్నారు. దీంతో బీపీసీఎల్ కంపెనీ ప్రతినిధులకు, చలువాది బదరీనారాయణ, ఆయన అనుచరులకు మధ్య ఘర్షణవాతావరణం ఏర్పడింది. సమాచారం అందుకున్న తహసీల్దార్ నారాయణరెడ్డి, ఒంగోలు ఆర్‌డీవో కే.లక్ష్మీ ప్రసన్నలు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. స్థల యజమానులు, బీపీసీఎల్ ప్రతినిధులు మంగళవారం ఉదయం 11 గంటలకు ఒంగోలు ఆర్‌డీవో ఆఫీసులో జరిగే విచారణకు హాజరు కావాలని ఆదేశించారు.

పెండింగ్ బకాయిలను విడుదల చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులకు పేరుకుపోయిన పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, వరకుమార్‌లు కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వైద్యశాఖ కార్యాలయంలో రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నారపుశెట్టి రామ్మోహన్‌రావు, రాంభూపాల్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, మహిళా విభాగం అధ్యక్షురాలు రజిత మానస, రంగారెడ్డి, ఎం. శ్రీనివాసరావు, రవిరాజా, రాజకుమారి, సులేమాన్, శ్రీనివాస్, మోహన్‌రెడ్డి,మనోజ్ తదితరులు ఉన్నారు.

వర్షాకాలంలో విద్యుత్‌తో జాగ్రత్తగా ఉండాలి

పొదిలి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు పడుతుండడంతో విద్యుత్ వినియోగదారులు, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ హరిబాబు తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ వర్షం కురుస్తున్నప్పుడు సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాలను ముట్టుకోకూడదని సూచించారు. విద్యుత్ లైన్‌కు తగులుతున్న చెట్లను ముట్టు కోకుండా సంబంధిత అధికారులకు తెలియజేసి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. అదే విధంగా ఇంట్లో ప్రమాదకరంగా ఉన్న స్విచ్ బోర్డులను తడి చేతులతో వేయకూడదన్నారు. చిన్నపిల్లలను, వృద్ధులను విద్యుత్ వస్తువుల దగ్గరకు వెళ్లకుండా చూసుకోవాలని చెప్పారు. గాలివాన సమయంలో తీగలు తెగినా, స్తంభాలు కూలినా వెంటనే విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలని ఆయన సూచించారు.

బెల్టు దుకాణాలపై దాడులు

- ఏడాది కాలంలో 42 కేసులు, 42 మంది అరెస్టు
- 756 బాటిళ్ల స్వాధీనం
- మద్యం అక్రమంగా అమ్మితే జైలుకే..

ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు


బెల్టు దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన ఎక్సైజ్ శాఖ అధికారులు (ఫైల్)

ఎర్రగొండపాలెం రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఎక్సైజ్ శాఖ నిబంధనలను అతిక్రమించి మద్యం అక్రమ అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. గ్రామాల్లో గొలుసు దుకాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వాటిని నివారించేందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులకు సిద్ధమయ్యారు.

గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు, మద్యం అక్రమ అమ్మకాలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం కచ్చితమైన ఆదేశాలను జారీ చేసింది. ఈ మేరకు ఎక్సైజ్ అధికారులు మద్యం అక్రమ అమ్మకాలు, బెల్టు షాపులపై తరచూ దాడులు చేస్తున్నారు.

ఎర్రగొండపాలెం ప్రొహిబిషన్ పరిధిలో ఎర్రగొండపాలెం, త్రిపురాంతకం, పుల్లలచెరువు మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల పరిధిలో విచ్చలవిడిగా బెల్టు దుకాణాలు తెరిచి మద్యం విక్రయాలు చేస్తున్నారు. దీంతో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది కట్టడి కోసం చర్యలు చేపడుతున్నారు.

దాడులు, కేసుల వివరాలివి

ఏడాది కాలంలో ఎర్రగొండపాలెం మండలంలో 20 కేసులు నమోదు చేసి 20 మందిని అరెస్టు చేసి 180 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ శాఖ సీఐ సీహెచ్ శ్రీనివాసులు తెలిపారు. అలాగే పుల్లలచెరువు మండలంలో 13 కేసులు నమోదు చేసి, 13 మందిని అరెస్టు చేసి సుమారు 151 బాటిళ్లు, త్రిపురాంతకం మండలంలో 16 కేసులు, 16 మందిని అరెస్టు చేసి, 425 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మూడు మండలాల పరిధిలో దాబాలలో మద్యం అమ్మకాలు చేస్తున్న వాటిపై కూడా దాడులు చేసి 5 కేసులు నమోదు చేశామని సీఐ వివరించారు. మద్యం అక్రమంగా అమ్మినా, బెల్టు దుకాణాలు నిర్వహించినా కేసులు తప్పవని, జైలుకు పంపుతామని సీఐ హెచ్చరించారు.


సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా అధికారులు

బాలికల బాగోగులపై నిర్లక్ష్యం వద్దు

డీఎంవో మధుసూదన్‌రావు

రాచర్ల, ఆగస్టు 18 (రాచర్ల) : బాలికల బాగోగుల విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా మలేరియా అధికారి ఎస్.మధుసూదన్‌రావు, గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ డీ జయ అన్నారు. స్థానిక మండల అధికారులతో కలిసి వారు సోమవారం రాచర్ల గురుకుల పాఠశాలను సందర్శించారు. గురుకులంలో 10వ తరగతి చదువుతున్న కె కరుణ అనారోగ్యానికి ఈనెల 16వ తేదీన కంభం ప్రభుత్వ వైద్యశాలలో మృతి చెందింది. విషయాన్ని తెలుసుకున్న వారు పాఠశాలను సందర్శించి పాఠశాలలోని ఆర్వో ప్లాంట్, తరగతి గదులు, కిచెన్ రూం, లెట్రిన్, బాత్‌రూములు, పాఠశాల ఆవరణ, అన్నింటినీ పరిశీలించారు. ముఖ్యంగా పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. బాలికలకు చిన్న వ్యాధి ఉన్నట్లు గుర్తించినా వెంటనే వైద్యం చేయించాలని, వైద్య సిబ్బంది పాఠశాలల్లో క్యాంపు నిర్వహించి అవసరమైన మందులు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి, ఎంఈవోలు షేక్ మొయినుద్దీన్, వీ గిరిధర్ శర్మ, వైద్యాధికారులు ఎస్.భానుకుమార్‌రెడ్డి, కే రమేష్, వైద్య సిబ్బంది, పాఠశాల ప్రిన్సిపాల్ మేరీ మంజుల, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మూడు గ్రామాలకు నిలిచిన కరెంట్ సరఫరా

చీకటి, చినుకులతో అల్లాడిన ప్రజలు

ఎర్రగొండపాలెం రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : అర్ధరాత్రి కురిసిన వర్షాలకు మూడు గ్రామాల ప్రజలు నరకం చూశారు. ఎర్రగొండపాలెం మండలంలోని కొలుకుల, గంజివారిపల్లి, చెన్నరాయునిపల్లి గ్రామాల పరిధిలో ఆదివారం అర్ధరాత్రి 1 గంటకు కరెంట్ సరఫరా నిలిచిపోయింది. దీంతో చీకట్లో గడపల్సాన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. చీకటితోపాటు వర్షం పడుతుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు చెప్పారు. సోమవారం ఉదయం 11 గంటలకు తిరిగి కరెంట్ సరఫరా పునరుద్ధరించడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ ఏఈ అల్లూరయ్యను వివరణ కోరగా.. గడ్డమీదపల్లి వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని డెస్కులు కాలిపోయాయని వాటికి మరమ్మతులు చేసి మూడు గ్రామాలకు సరఫరా ఇచ్చామని తెలిపారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి

బేస్తవారపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని గిద్దలూరు నియోజకవర్గ సీపీఐ నాయకులు డాకాల పుల్లయ్య కోరారు. సోమవారం మండలంలోని మోక్షగుండం గ్రామంలో సీపీఐ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలులో జరిగే మహాసభలకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకుడు కేవీ రమణ, యు.జోసఫ్,జక్కా అంకయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు


కొప్పుకొండ వద్ద ఆక్రమణలను పరిశీలిస్తున్న తహసీల్దార్ మంజునాథరెడ్డి

ఎర్రగొండపాలెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం సమీపంలోని కొప్పుకొండ దిగువన ఉన్న కొండపోరంబోకు భూములను సోమవారం తహసీల్దార్ మంజునాథరెడ్డి వీఆర్వోలతో కలిసి పరిశీలించారు. కొందరు వ్యక్తులు అనుమతులు లేకుండా ఆక్రమణలు చేస్తున్నారని తెలసి సోమవారం పరిశీంచినట్లు చెప్పారు. ఆక్రమణలు చేసే వ్యక్తులను పిలిపించి మాట్లాడారు. ఇళ్లు లేనివారు దరఖాస్తులు ఇస్తే ప్రభుత్వ పరంగా స్థలాలు మంజూరు చేస్తామని తెలిపారు. అంతేగాని ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

ఎస్సీ, ఎస్టీ రిలీఫ్ ఫండ్‌ను ఖాతాల్లోకి జమచేయాలి

మార్కాపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ రిలీఫ్ ఫండ్‌ను కలెక్టర్ వెంటనే బాధితుల ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పరి రక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రకాశం జిల్లాకు మంజూరైన రూ.6కోట్లు బాధితులకు అందజేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాలమహానాడు అధ్యక్ష, కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాని రవి, మాలపోలు శాంతకుమార్, పిల్లి సుబ్బారావు, రెడ్డెపోగు తిమోతి పాల్గొన్నారు.

హత్య కేసు కొట్టివేత

మార్కాపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : సాక్ష్యాధారాలు రుజువు కాకపోవడంతో హత్య కేసును కొట్టివేస్తూ మార్కాపురం ఆరవ అదనపు జిల్లా న్యాయాధికారి ఎం.శుభవాణి సోమవారం తీర్పు చెప్పారు. వివరాల ప్రకారం.. దొనకొండ మండలం మల్లంపేట గ్రామానికి చెందిన నేతుల గోపీకృష్ణ 2016 ఆగస్టు 2న ఇంటి నుంచి తిరిగిరాలేదు. దీంతో అనుమానం వచ్చి తల్లిదండ్రులు పెద్దపోలయ్య, బాలకోటమ్మ అన్ని చోట్లా వెదికారు. అయినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో ఐదు రోజుల తర్వాత ఆగస్టు 7వ తేదీన పొలాల్లో గుర్తు తెలియని మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించారు. గోపీకృష్ణ తల్లిదండ్రులు అక్కడకు వెళ్లి పరిశీలించి తమ కుమారుడిదిగా గుర్తించారు. గ్రామానికి చెందిన వడ్లమూడి చిన్నవెంకటేశ్వర్లు హత్య చేసి ఉంటాడని తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు అతడిపై హత్య కేసు నమోదు చేశారు. ఈ కేసులో 23 మంది సాక్షులను విచారించిన న్యాయమూర్తి నేరం రుజువుకాకపోవడంతో కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. నిందితుడి తరఫున న్యాయవాది మొఘల్ అన్వర్‌బేగ్ వాదించారు.

కరాటేలో ఎంఎస్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ కరాటే స్కూల్ విద్యార్థులు ఆలిండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఎమ్‌ఎస్ కరాటే స్కూల్ చీఫ్ ఎగ్జామినర్ మారంరెడ్డి శ్రీనివాసరెడ్డి సోమవారం ఆ వివరాలను వెల్లడించారు. సిద్ధార్థ అకాడమీ ఆధ్వర్యంలో ఒంగోలులో జరిగిన ఆలిండియా ఓపెన్ కరాటే చాంపియన్స్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారన్నారు. 32 బంగారు, 10 వెండి, 5 కాంస్య పతకాలు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఒంగోలు, సంతనూతలపాడు, గిద్దలూరు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయ్‌కుమార్, ముత్తుముల అశోక్‌రెడ్డి చేతులమీదుగా బహుమతులను అందుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇండియన్ హెడ్ కోచ్ కీర్తన, ఏపీ కరాటే ప్రెసిడెంట్ మిల్టన్‌శాస్త్రి పాల్గొన్నారన్నారు.



కరాటేలో బహుమతులు పొందిన విద్యార్థులు


పూజల్లో పాల్గొన్న కృష్ణకిషోర్‌రెడ్డి, గ్రామస్థులు

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

కొమరోలు, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి) : గత మూడు రోజుల నుంచి వేద పండితుల ఆధ్వర్యంలో మండలంలోని సర్విరెడ్డిపల్లి గ్రామంలో అంకాలమ్మ, పోలేరమ్మ, సీతాలమ్మ, నాభిశిల, గమిడిరాయి, ఆంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు సోమవారంతో ముగిసాయి. బ్రహ్మశ్రీ గౌరిపెద్ది హరిహర కుమార శర్మచే కార్యక్రమాలు నిర్వహించారు. నూతన విగ్రహాలను, గోవు దర్శనానికి భక్తులకు అవకాశం కల్పించారు. మధ్యాహ్నం మారంరెడ్డి రామనారాయణరెడ్డి అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 9 మంది దంపతులతో చండీ హోమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ముత్యాల పెద్ద అంకిరెడ్డి, అంబవరపు రామకృష్ణారెడ్డి, బద్వేలి రామకృష్ణారెడ్డి, వులాపు రామచంద్రుడు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లను చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు, మనోజ్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు కామూరి రమణారెడ్డి, విశ్రాంత ఉద్యోగి నాదెళ్ల వెంగయ్య చౌదరి పాల్గొన్నారు. టీడీపీ నియోజకవర్గ నాయకుడు ముత్తుముల కృష్ణకిషోర్‌రెడ్డి ప్రత్యేక పూజలు జరిపించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ముందుగా కృష్ణకిషోర్‌రెడ్డి, సంజీవరెడ్డిని గ్రామస్థులు డప్పు వాయిద్యాలతో స్వాగతం పలుకగా, వేదపండితులు పూజలు చేయించారు.

ఐదు బార్లకు లైసెన్స్‌ల జారీకి ప్రక్రియ

ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి


వ్యాపారులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి

మార్కాపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలో ఐదు బార్లకు లైసెన్స్‌లు జారీ చేసేందుకు ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభించినట్లు ఎక్సైజ్ సీఐ ఎం.వెంకటరెడ్డి తెలిపారు. ఎక్సైజ్ కార్యాలయంలో సోమవారం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నూతన బార్ పాలసీ సెప్టంబర్ 1వ తేదీ నుంచి మూడేళ్లపాటు అమల్లో ఉంటుందన్నారు. ఈ క్రమంలో మార్కాపురంలో ఐదు బార్ అండ్ రెస్టారెంట్లకు లైసెన్స్‌లు జారీ చేసేందుకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయన్నారు. మూడు విధాలుగా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్, హైబ్రిడ్, డీడీ విధానాల ద్వారా నూతన బార్ లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఒక్కో దరఖాస్తు రూ.5లక్షలు నాన్ రీఫండబుల్ ఫీజు, రూ.10వేల ప్రాసెసింగ్ ఫీజులను చెల్లించాలన్నారు. ఒక్కో బార్‌కు మార్కాపురం మున్సిపాలిటీ జనాభా ప్రాతిపదికన రూ.55వేల లక్షలు సంవత్సరానికి ఎక్సైజ్ శాఖకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తుల స్వీకరణ సోమవారం నుంచి ప్రారంభమైందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు తప్పనిసరి అన్నారు. ఈనెల 28న కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ తీసి లైసెన్స్‌లు మంజూరు చేస్తారన్నారు. సెప్టంబర్ 1వ తేదీ నుంచి బార్‌లను ప్రారంభించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.

పొదిలి : పొదిలి పరిధిలో బార్ ఏర్పాటుకు లైసెన్స్‌లను సోమవారం నుంచి ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ అరుణకుమారి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆమె మాట్లాడారు. ఈనెల 18 నుంచి 26వ తేదీ వరకు దరఖాస్తు చేసేందుకు గడువు ఉందని, ఆసక్తి కలిగిన వారు ఫీజు రూ.5లక్షలు చెల్లించి నమోదు చేసుకోవాలని తెలిపారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా సమక్షంలో 28న డ్రా తీస్తారన్నారు. 2025 సెప్టెంబరు నుంచి 2028 ఆగస్టు 31 వరకు మూడు సంవత్సరాలు పాలసీకాలం ఉంటుందన్నారు. డ్రా తీయాలంటే కనీసం నాలుగు అప్లికేషన్‌లు ఉండాలన్నారు. మొదటి సంవత్సరం రూ.35లక్షలు, రెండవ సంవత్సరం రూ.38.50లక్షలు, మూడవ సంవత్సరం రూ.42.35లక్షలు చెల్లించాలన్నారు. అప్లికేషన్ తీసుకోవాలనుకునే వారు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో చేసుకోవచ్చన్నారు. ఆఫ్‌లైన్ చేసుకునే వారు ఒంగోలు డీపీవో కార్యాలయంలో ఇవ్వాలన్నారు. బార్ ఏర్పాటు చేసుకునేవారు మూడు కిలోమీటర్ల పరిధిలో ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చన్నారు.

మానవత సంస్థ జిల్లా మెడికల్ డైరెక్టర్‌గా గంగిశెట్టి



మార్కాపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రకాశం జిల్లా మెడికల్ విభాగం డైరెక్టర్‌గా పట్టణానికి చెందిన గంగిశెట్టి కిరణ్‌కుమార్‌ను నియమించినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎలమందారెడ్డి తెలిపారు. మార్కాపురం, పొదిలి పట్టణాల్లో మానవత శాఖ నూతన భవనాలు, ఫ్రీజర్ బాక్స్‌ల ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కిరణ్ తెలిపారు. జిల్లాలో సేవా కార్యక్రమాలను విస్తృతం చేయన్నున్నామన్నారు.

వెంగళరెడ్డిపల్లిలో నెమలి సందడి

గిద్దలూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : అడవిలో ఉండాల్సిన నెమలి గ్రామంలోకి వచ్చి సందడి చేసింది. గ్రామంలో స్వేచ్ఛగా తిరిగి అడవిలోకి వెళ్లిపోయింది. మండలంలోని వెంగళరెడ్డిపల్లి గ్రామంలోని జనావాసాల్లోకి సమీప నల్లమల అడవి నుంచి నెమలి వచ్చింది. గ్రామ పరిసరాలలో కొద్దిసేపు స్వేచ్ఛగా అటు ఇటు తిరిగి అడవిలోకి వెళ్లిపోయింది. నెమలి సంచారాన్ని తిలకించేందుకు గ్రామంలోని చిన్నారులు ఆసక్తి కనపరిచారు. అప్పుడప్పుడూ గ్రామంలోకి నెమలివచ్చి వెళ్తుందని గ్రామస్థులు తెలిపారు.

నల్లమలలో భారీ వర్షం


గంటవానిపల్లె చప్టాపై వరద ప్రవాహం


ఉధృతంగా ప్రవహిస్తున్న జంపలేరు

ఎగువ చెర్లోపల్లి, గంటవానిపల్లె బ్రిడ్జిలపై ప్రవహించిన వరద నీరు

పెద్ద దోర్నాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా రెండు రోజులుగా నల్లమల అటవీ ప్రాంతంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి సోమవారం వరద నీరు పోటెత్తింది. ఈ కారణంగా అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉన్న ఎగువ చెర్లోపల్లి చెరువుకు పూర్తి స్థాయిలో నీరు చేరి జలకళను సంతరించుకోగా, దొంగలవాగు, తీగలేరు వాగు ఉధృతంగా ప్రవహించింది. ఈ నేపథ్యంలో ఎగువ చెర్లోపల్లి గ్రామానికి ముందున్న బ్రిడ్జి మీదుగా నీరు ప్రవహించడంతో చెర్లోపల్లితో పాటు చిలకచెర్ల, బందం బావి, చెరువు గూడెం మూడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిధంగా గంటవానిపల్లె గ్రామానికి ముందున్న చప్టాపై వరదనీటి ప్రవాహానికి రాకపోకలు స్తంభించాయి. దశాబ్దాలుగా ఆ యా గ్రామాల ప్రజలు ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం వచ్చిందంటే విద్యార్థులు పాఠశాలలకు సమయానికి వెళ్లలేక పోతున్నారు. రైతులు ఎరువులు, పంట ఉత్పత్తిని మార్కెట్‌కు తరలించలేక ఇబ్బందులు పడాల్సిందేనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ స్పందించి బ్రిడ్జిల నిర్మాణాలను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలో నేటికీ సాగుకు సరిపడా వర్షం కురవలేదని రైతులు చెప్తున్నారు.

ఉధృతంగా జంపలేరు

కంభం : రెండు రోజుల నుంచి నల్లమల అడవుల్లో కురుస్తున్న భారీ వర్షాలకు అర్ధవీడు మండలం జంపలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దాదాపు నాలుగు సంవత్సరాల తర్వాత జంపలేరు వాగు జల కళ సంతరించుకోవడంతో స్థానికులు వాగును చూసేందుకు ఆసక్తి కనబరిచారు. జంపలేరు వాగు ఇలా ప్రవహిస్తే ఈ నీరు చారిత్రాత్మక కంభం చెరువుకు చేరుతాయని స్థానిక రైతులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. జంపలేరు వాగుతోపాటు నల్లమల ఫారెస్ట్ నుంచి వచ్చే మరో వాగు గుండ్లకమ్మ కూడా ప్రవహిస్తుండడంతో కంభం చెరువుకు నీరు వచ్చే అవకాశం ఉంది. చెక్ డ్యాములు, చెరువులు నిండి అలుగులు పారుతున్నా కంభం చెరువుకు చుక్క నీరు రాకపోవడంతో ఈ ప్రాంత రైతులు, ప్రజలు ఆం దోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఉన్న గుండ్లకమ్మ, జంపలేరు వాగులు ప్రవహిస్తుండడంతో కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట మండలాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

43.8 శాతం వర్షపాతం

రాచర్ల : మండలంలో 43.8మి.మి వర్షపాతం నమోదయిందని ఏఎస్‌ఓ మున్వర్ తెలిపారు. ఇది 18వ తేదీ సోమవారం వర్షపాతం అని ఆయన తెలిపారు. వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్నాయని, వర్షపాతం ఇంకా పెరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

షకీలకు తెలుగుతేజం అవార్డ్



గిద్దలూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరులోని రైల్వే శాఖలో చీఫ్ కమర్షియల్ క్లర్క్‌గా పని చేస్తున్న షేక్ షకీలకు తెలుగు తేజం అవార్డు లభించింది. షకీల రాసిన కవితలకు గుర్తింపుగా నర్సరావుపేటలో ఈనెలలో జరుగనున్న తెలుగు భాషా దినోత్సవ సంబరాల కార్యక్రమంలో షకీలకు ఈ అవార్డు అందచేయనున్నట్లు కళా వేదిక సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కె.ప్రతాప్ తెలిపారు.

నేతాజీకి నివాళి

గిద్దలూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా ప్రజా సంకల్ప వేదిక అధ్యక్షుడు మదిరె రంగసాయిరెడ్డి నివాళులర్పించారు. తన కార్యాలయంలో నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతదేశ స్వాతంత్ర్య సమరంలో నేతాజీ చూపిన తెగువను కొనియాడారు.



రైతులతో మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ రవీంద్రబాబు

సస్యరక్షణ పద్ధతులపై రైతులకు శిక్షణ

కంభం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రావిపాడు గ్రామంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మల్లె సాగులో సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై దర్శికి చెందిన సీనియర్ శాస్త్రవేత్త, హార్టికల్చర్ రిసోర్స్ పర్సన్ ఎం.రవీంద్రబాబు సోమవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రవీంద్రబాబు మాట్లాడుతూ మొక్కలలో మొగ్గ తొలచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని పురుగుల లార్వా, పువ్వు మొగ్గలోకి చొచ్చుకుపోయి మొగ్గ గులాబి రంగులోకి మారి తర్వాత ఎండిపోవడం జరుగుతుందని తెలిపారు. దీని నివారణకు రైతులు వ్యవసాయ అధికారులు సూచించిన మందులను పిచికారీ చేసుకోవాలని సూచించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి డీ శ్వేత, వీఏఏ మల్లికార్జున్, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలోకి నీరు

ఇబ్బందులకు గురైన సిబ్బంది, చిన్నారులు


గదిలోకి నీరు చేరడంతో నిల్చొన్న సిబ్బంది


బురదమయంగా ఉన్న అంగన్‌వాడీ ఆవరణ

రాచర్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆకవీడు గ్రామంలోని 122వ అంగన్‌వాడీ క్రేందం వర్షపు నీటితో నిండిపోయింది. అంగన్‌వాడీ కేంద్రంలోని గదుల్లో నీరు ప్రవేశించడంతో అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు కూర్చోవడానికి వీలులేని పరిస్థితి ఏర్పడింది. అంగన్‌వాడీ కేంద్రం ముందు ఆవరణ అంతా బురదమయంగా మారి అస్తవ్యస్తంగా తయారైంది. లోనికి వెళ్లాలంటే వీలులేని పరిస్థితి ఏర్పడి చిన్నారులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆకవీడు చెరువుకు భారీగా వర్షపునీరు చేరి చెరువు కాలువ ద్వారా నీరు ప్రవహిస్తుంది. కాలువ ప్రక్కనే అంగన్‌వాడీ కేంద్రం ఉండడంతో నీరంతా భూమి అడుగు భాగం నుంచి ఊటలా ప్రవేశించింది. కార్యకర్త డీ సుజాత సోమవారం ఉదయం కేంద్రం ఓపెన్ చేయగా కేంద్రంలోని గదులన్నీ నీటితో నిండి ఉన్నాయి. గదిలో ఉన్న పౌష్టికాహారాన్ని ముందు జాగ్రత్తగా టేబుల్ బేంచీలపై పెట్టడంతో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. ఈ కేంద్రంలో నూతన సచివాలయానికి సంబంధించిన కంకర, ఇసుక కేంద్రం ఆవరణలో నిల్వ ఉండడం, కంపచెట్లు పెరగడంతో ఆ ప్రాంతమంతా పాచి పట్టి ఇబ్బందికరంగా తయారైంది. దీంతో అక్కడికి వెళ్లేందుకు చిన్నారులు, వారి తల్లులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

పామూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం జిల్లా విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టినట్లు జిల్లా విద్యుత్ పర్యవేక్షణ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.హైమావతి తెలిపారు. మండలంలో 29 బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో 993 విద్యుత్ సర్వీసులను ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. వాటిల్లో వివిధ రకాలుగా అక్రమంగా విద్యుత్ ను వాడుతున్న వారిని గుర్తించి రూ.రెండు లక్షల 60 వేల అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. అనధికారికంగా విద్యుత్ వాడినా, చౌర్యానికి పాల్పడినా అపరాధ రుసుంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో కనిగిరి ఆపరేషన్ ఈఈ ఉమాకాంత్, విజిలెన్స్ డీఈలు యుగంధర్, ఏ.శ్రీనివాసరావు, పామూరు ఏడీఈ డి.కృష్ణారెడ్డి, ఏఈ షేక్ జిలానిబాషా తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.లక్షా 87వేలు

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానం ఆదివారం హుండీ ఆదాయం రూ.1,87,514 వచ్చినట్లు ఈవో నరసింహబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.78520, లడ్డు అమ్మకం ద్వారా రూ.29,730, అన్నదానం విరాళాల ద్వారా రూ.41,232, ఇతర విరాళాల ద్వారా రూ.38,032. ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అన్నదానానికి ముతుముల పీరారెడ్డి, లక్ష్మీదేవి దంపతులు రూ.10.116 విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

కనిగిరి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో జరగనున్న సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆపార్టీ మండల కార్యదర్శి రామారావు అన్నారు. సోమవారం పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేళ్ళు పూర్తి చేసుకున్న సీపీఐ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించిందని గుర్తు చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం, బడుగు, బలహీన వర్గాల క్షేమం కోసం నిరంతరం పోరాటాలు చేస్తుంది సీపీఐ ఒక్కటేనని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి పి.మోహన్, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఇఫ్రాజ్, పవన్‌కల్యాణ్, నాసర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

తాళ్లూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): లివర్ వ్యాధితో బాధపడుతూ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన కొర్రపాటివారిపాలెం గ్రామస్థుడు యానం శ్రీనుకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.లక్షా పదివేల చెక్కును సోమవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అందజేశారు. ఆరోగ్య సమస్యను వివరించి తగున్యాయం చేయాలని డాక్టర్ లక్ష్మికి విన్నవించటంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు సిఫార్సు చేసి మంజూరు చేయించారు. దర్శిలో జరిగిన ఈకార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, గొల్లపూడి వేణుబాబు, కాశీం సైదా, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నియమాలు, నిబంధనలను ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తానని ఎస్‌ఐ ఎం.వెంకటేశ్వరనాయక్ హెచ్చరించారు. సోమవారం సీఎస్‌పురం మండల కేంద్రంలో వాహనాలను తనిఖీ చేశారు. పత్రాలు సక్రమంగాలేని వాహనదారులకు జరిమానాలు విధించారు. హెల్మెట్ లేకుండా వాహనాలను నడుపుతున్నవారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్‌లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే తల్లిదండ్రులే బాధ్యత వహించాలన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్టు

ముండ్లమూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకరవారిపాలెంకు చెందిన నల్లబోతుల వెంకటేశ్వర్లును ఈనెల 8వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన నల్లబోతుల వీరాంజనేయలు కత్తితో వెంకటేశ్వర్లును పొడవగా తీవ్రగాయాలై ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈకేసులో నిందితుడైన వీరాంజనేయులును ఎస్‌ఐ కె.కమలాకర్ సోమవారం అరెస్టు చేసి దర్శి కోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తి 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కన్వర్షన్ భూములను పరిశీలించిన ఆర్డీవో

ముండ్లమూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని సర్వే నెంబరు 107, 108లో ఉన్న 12.54 ఎకరాల భూమికి సంబంధించి కన్వర్షన్ చేయాల్సి ఉండగా ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న సోమవారం సాయంత్రం ఆభూములను పరిశీలించారు. ఈభూమిలో ఏమైనా భవన, కట్టడ నిర్మాణాలు ఉన్నాయో, లేదో పరిశీలించారు. ఎటువంటి కట్టడాలు లేకపోవటంతో కన్వర్షన్ చేయాలని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణను ఆదేశించారు.

ఆమె వెంట వీఆర్‌వో కావూరి దయానందం తదితరులు ఉన్నారు.

త్వరితగతిన మోపాడు ఆధునికీకరణ పనులు పూర్తిచేయాలి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జైకా నిధులతో చేపట్టిన మోపాడు ఆధునికీకరణ పనులను వేగవంతం గా పూర్తి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో సోమవారం ఇరిగేషన్ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోపాడు ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు పూర్తిచేసి ఆయకట్టు రైతులకు నిరంతరాయంగా నీటి సరఫరా జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం వర్షాకాలం మొదలవుతున్నందున రైతులకు సాగు నీరు అందించటం ఎంతో అవసరమన్నారు. జైకా నిధుల సహకారంతో చేపట్టిన పనులు కూడా ఇంకా పూర్తి చేయకపోవటంపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. పనులు పూర్తి కాకపోవటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. అలాంటి పరిస్థితి రాకుండా అధికారులు తమవంతు కృషి చేయాలని కోరారు. పెండింగ్ పనులన్నింటినీ వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బంది, అధికారులపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్ళి శాఖాపరమైన చర్యలకు ఉపక్రమించవలసి వస్తుందని హెచ్చరించారు. ప్రధానంగా రైతులకు వ్యవసాయమే జీవనాధారమన్నారు. మోపాడు ఆయకట్టు రైతులకు సరిపడ నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

సమావేశంలో ఇరిగేషన్ డీఈ ఈ కె.విజయభాస్కర్ రెడ్డి, ఏఈఈలు సీహెచ్ ప్రసాద్, వినయ్‌కుమార్, రామకృష్ణ, మోపాడు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ సి.కొండయ్య, వైస్‌చైర్మన్ నరసింహారావు, వెంకటనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం ఎగువపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం జరిగిన విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయ శిఖర కలిశ ప్రతిష్ఠలో పాల్గొన్నారు. అలాగే, బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి ఆలయ నిర్వాహకుల ఆహ్వానం మేరకు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రామాలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఉగ్ర

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షప్రధాన కార్యదర్శి బొమ్మనబోయిన వెంగయ్య, మన్నేపల్లి శ్రీనివాసులు, సర్పంచ్ శ్రీరాం పద్మావతి, బొబ్బూరి రమేష్, మన్నేపల్లి కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

» సీఐ భీమానాయక్

పామూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతులను తప్పని సరిగా సీఐ ఎం.భీమానాయక్ సూచించారు. సోమవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో కనిగిరి డీఎస్పీ సూచనలు మేరకు గణేష్ ఉత్సవాల కమిటీ నిర్వాహకులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మండపాల ఏర్పాటుకు గణేష్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పోలీసు, విద్యుత్ శాఖ అనుమతులు తప్పనిసరి అన్నారు. మండపాల వద్ద తాత్కాలికంగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి కాపలగా ఉండాలన్నారు. పోలీసు సూచనలు పాటించాలని, ఎవరైనా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రోన్ కెమెరాలతో పోలీసుల పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. నిర్వాహకులు సమయపాలన పాటించాలన్నారు.



మాట్లాడుతున్న సీఐ భీమానాయక్

డీజే, బాణసంచాకు అనుమతులు తీసుకోవాలని సీఐ భీమానాయక్ తెలిపారు. త్వరలో శాంతి కమిటీ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ టి.కిశోర్‌బాబు పాల్గొన్నారు.

ముమ్మరంగా పొగనాట్లు

» రైతులకు అనుకూలించిన వాతావరణం

కురిచేడు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా వర్షాలు సమృద్ధిగా కురవడంతో రైతులు పొలం పనుల్లో బిజీగా ఉన్నారు. వైట్‌బర్లీ పొగాకు సాగుకు సిద్ధమైన రైతులు నాట్లు వేస్తున్నారు. ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురవడంతో పొలాల కౌలు రేట్లు పెరిగాయి. ఎకరాకు రూ.15 వేల వరకు కౌలు ధర పలుకుతున్నది. నీటి వసతిని బట్టి కౌలు ధర ఉన్నట్లు రైతులు తెలిపారు. పొగనారు వెయ్యి మొక్కలు రూ.400 పలుకుతుంది.



పొగనారు పీకుతున్న కూలీలు

ఎకరాకు 8 వేల మొక్కలు అవసరమవుతాయి. సేద్యం, కూలీల ఖర్చు ఎక్కువవుతుందని రైతులు తెలిపారు.

కాగా, నారు దిబ్బలు సాగు చేసిన రైతులు ఒకింత నష్టానికి గురవుతున్నారు. నారు ఏపుగా పెరిగి పీకడానికి సిద్ధం అయినా వర్షాలు సకాలంలో కురవకపోవడంతో డిమాండ్ తగ్గింది. దీంతో నారు ముదిరిపోతుండటంతో రైతులు నష్టాల పాలయ్యే పరిస్థితి కనపడుతున్నది. మండలంలో ఇటీవల కురిసిన వర్షాలు కొన్ని గ్రామాలకే పరిమితమైంది. వారు మాత్రమే నాట్లు వేస్తున్నారు. చాలా గ్రామాల్లో పొగనాట్లు ఇంకా ప్రారంభం కాలేదు.

అర్హులందరికీ దివ్యాంగ పింఛన్‌లు

» టీడీపీ నేత అడుసుమిల్లి ప్రభాకర్

కనిగిరి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన ఏ ఒక్కరి దివ్యాంగుని పింఛన్‌ను ప్రజాప్రభుత్వం తొలగించదని టీడీపీ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల ప్రధాన కార్యదర్శి అడుసుమిల్లి ప్రభాకర్ చౌదరి అన్నారు. సోమవారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో దివ్యాంగుల పెన్షన్లు తొలగిస్తున్నట్లు వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. గత వైసీపీ పాలనలో ఎంతోమంది అనర్హులు దొంగ సర్టిఫికెట్‌లతో పింఛన్‌లు పొందారన్నారు. వాటిపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా 2025 జనవరి నుంచి జూలై వరకు ప్రభుత్వం పరిశీలన చేపట్టినట్లు వివరించారు. ఆపరిశీలనలో 85శాతం కంటే తక్కువ అంగవైకల్యం ఉన్నవారికి రూ.15 వేల పింఛన్ స్థానంలో రూ.6 వేలు చెల్లిస్తున్నట్లు చెప్పారు. 40శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్న వారికి దివ్యాంగుల పింఛన్‌ను నిలిపివేసి 60ఏళ్ళు దాటిన వారికి రూ.4 వేల వృద్ధాప్య పింఛన్ కేటాయిస్తున్నట్లు చెప్పారు. తిరిగి చేపట్టిన పరిశీలనలో అర్హత ఉన్నట్లు నిర్ధారణ జరిగితే పింఛన్‌ను పునరుద్ధరించటం జరుగుతుందన్నారు.



మాట్లాడుతున్న అడుసుమిల్లి ప్రభాకర్

రాష్ట్రంలో అర్హులైన ఏఒక్కరికి అన్యాయం జరగదని అడుసుమిల్లి ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రజల్లో ప్రజాప్రభుత్వంపై పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక వైసీపీ లేనిపోని దుష్ప్రచారాలకు పూనుకుంటుందన్నారు. ప్రజలు వాటిని నమ్మవద్దన్నారు. సమావేశంలో విభిన్న ప్రతిభావంతుల సంఘం నాయకులు యలమంద, జాలపాటి తిరుపతయ్య, చీర్ల మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

మహిళా ప్రయాణికులతో మర్యాదగా మెలగాలి

» ఆర్టీసీ డీఎం షయనాబేగం

కనిగిరి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సిబ్బంది, అధికారులు మహిళా ప్రయాణికులతో మర్యాదగా మెలగాలని డిపో మేనేజర్ షయనాబేగం అన్నారు. కనిగిరి ఆర్టీసీ డిపో పరిధిలోని బస్సులలో నిర్వహిస్తున్న స్త్రీశక్తి పథకాన్ని సోమవారం ఆమె పర్యవేక్షించారు. కనిగిరి నుంచి కందుకూరు, సీఎస్‌పురం, పొదిలి వెళ్ళే రూట్ బస్సులలో ప్రయాణికులతో మాట్లాడారు. స్త్రీశక్తి పథకం ఉపయోగాన్ని మహిళలకు వివరించారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలని సూచించారు. ప్రయాణికులకు అవగాహన కల్పించే సమయంలో వారితో మర్యాదగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.



ప్రయాణికులతో మాట్లాడుతున్న డీఎం షయనాబేగం

గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలి

పీసీపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మహిళలు బస్సులో ప్రయాణించేటప్పుడు ఏదైనా గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలని ఆర్టీసీ డీఎం మహమ్మద్ షయానాబేగం అన్నారు. సోమవారం కనిగిరి-కందుకూరు రూట్‌లో ప్రయాణిస్తున్న బస్సులో మహిళలతో మాట్లాడారు. స్త్రీశక్తి పథకంలో ప్రయాణించే మహిళలు గుర్తింపు కార్డు చూపించి కండక్టర్‌కు సహకరించాలన్నారు. ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే సంబంధిత కండక్టర్, డ్రైవర్‌కు తెలియజేయాలని సూచించారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రజాప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని 85మంది లబ్ధిదారులకు రూ.50లక్షల 42వేల 669 చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల అనారోగ్యానికి గురై సరైన వైద్యం చేయించుకునే శక్తిలేక ఇబ్బందిపడుతున్న తరుణంలో సీఎం చంద్రబాబునాయుడు దయాగల హృదయంతో ఆర్థిక సహాయం అందజేస్తున్నారని చెప్పారు. దీంతో ప్రజలందరికి ఆరోగ్య భరోసా కలుగుతుందన్నారు. కార్యక్రమంలో దర్శి, తాళ్ళూరు, ముండ్లమూరు, దొనకొండ మండలాల టీడీపీ అధ్యక్షులు మారెళ్ళ వెంకటేశ్వర్లు, మేడగం వెంకటేశ్వరరెడ్డి, కూరపాటి శ్రీనివాసరావు, మోడి అంజనేయులు, దర్శి పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న మహిళలు

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలభిషేకం

తాళ్లూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రజాప్రభుత్వం ఆర్‌టీసీల్లో ఉచిత ప్రయాణం కల్పించటం పట్ల మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు సోమవారం స్థానిక వెల్లంపల్లి బస్టాండ్ సెంటర్‌లో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవణ్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల మహిళాసమాఖ్య అధ్యక్షురాలు ఎం.సుజాత, పాల్వాది విజయలక్ష్మి, కోట అంజమ్మ, ఏసమ్మ, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో అన్నిరకాల ఎరువులు

తాళ్లూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు అన్నిరకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. తాళ్లూరులోని వెంకటరమణ ట్రేడర్స్‌ను సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని డీలర్లకు సూచించారు. మండలంలోని ఎరువుల, దుకాణాల వద్ద 552.375 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతు సేవా కేంద్రాల వద్ద 59 మెట్రిక్ టన్నుల యూరియాను అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. ఎరువుల సరఫరాలో రైతాంగానికి అసౌకర్యం కలుగ కుండా తగు చర్యలు చేపట్టినట్టు చెప్పారు.

ముండ్లమూరు మండలాన్ని 'ప్రకాశం'లోనే కొనసాగించాలి

ముండ్లమూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ముండ్లమూరు మండలాన్ని ప్రకాశం జిల్లాలోనే ఉంచాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి సోమవారం దర్శిలో ముండ్లమూరుకు చెందిన టీడీపీ నాయకుడు బేతపూడి రామారావు, తదితరులు ఆమెకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ముండ్లమూరు నుంచి జిల్లా కానున్న మార్కాపురంకు వెళ్ళాలంటే చాలా భార మవుతుందన్నారు. ఎప్పటిలాగా ఒంగోలులు ఉంటే ప్రజలకు రాకపోకలకు సులువుగా ఉం టుందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని మార్కాపురం జిల్లాలో కలపకుండా చూడాలని కోరారు. దీనిపై స్పందిస్తూ డాక్టర్ లక్ష్మి మాట్లా డుతూ ముండ్లమూరు మండల పరిస్థితిని రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకు వెళ్ళి తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.

అధికారుల గైర్హాజరుపట్ల సభ్యుల ఆగ్రహం

దర్శి ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశానికి అనేక శాఖల అధికారులు గైర్హాజరుపట్ల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుధారాణి అధ్యక్షతన సోమవారం సర్వసభ్యసమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సభ్యులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. గ్రామాల అభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సోము దుర్గారెడ్డి మాట్లాడుతూ సమావేశానికి అనేకశాఖల అధికారులు రాకపోవడంపట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళాలని సూచించారు. ఎంపీడీవో వసంతరావు నాయక్ మాట్లాడుతూ సభకు హాజరుకాని అధికారుల వివరాలను సభ్యుల సూచనల మేరకు ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. కార్యక్రమంలో అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతన్న ఎంపీపీ సుధారాణి

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

పామూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అరెస్టులతో ప్రజాఉద్యమాలను అడ్డుకోలేరని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ హనీఫ్ అన్నారు. కరేడు గ్రామాంలో ఇండోసోల్ కంపెనీ కోసం చేపడుతున్న బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా చేపట్టిన చలో కరేడు కార్యక్రమానికి హాజరైన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తదితరులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ అరెస్టులను నిరసిస్తూ స్థానిక మమ్మిడాడి సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో షేక్ ఖాదర్‌బాషా, సీహెచ్ వెంకటేశ్వర్లు, బి.నాగేశ్వరరావు, సయ్యద్ గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఎడ్యుకేషన్ గవర్నమెంట్ న్యాయవాదిగా లింగమూర్తి

ముండ్లమూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్ర దేశ్ హైకోర్టు ఎడ్యుకేషన్ గవర్నమెంట్ న్యాయవాదిగా మండలంలోని వేంపాడు గ్రామానికి చెందిన గంగినేని లింగమూర్తిని నియమించారు. ఒంగోలు ప్రియదర్శిని లా కళాశాలలో చదివిన ఆయన గత 26 సంవత్సరాలుగా న్యాయవాది వృత్తిలో కొనసాగుతున్నారు. ఆయన సతీమణి కూడా హైకోర్టులో పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా లింగమూర్తికి గ్రామస్థులు శుభాకాంక్షలు తెలిపారు.



గంగినేని లింగమూర్తి

బాధితుడికి ఆర్థికసాయం

ముండ్లమూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరంలోని ఎస్సీ కాలనీకి చెందిన నంబూరి జార్జ్ ఇల్లు ఇటీవల అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి సోమవారం సాయంత్రం పోలవరం వెళ్ళి బాధితుడి జార్జిని పరామర్శించారు. రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట వైసీపీ మండల కన్వీనర్ చింతా శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ నంబూరి ఏసు, శ్రీనివాసరావు ఉన్నారు.

రైతు సంక్షేమానికి కృషి

ముండ్లమూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి కృషి చేస్తానని మారెళ్ల సొసైటీ అధ్యక్షుడు బుర్రి అంజయ్య అన్నారు. గురువారం స్థానిక సొసైటీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం తరుపున సొసైటీలకు ఇస్తున్న ఎరువులు, పురుగు మందులు రైతులకు అందిస్తామన్నారు. తనకు పదవి రావటానికి సహకరించిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతుల సహకారంతో సొసైటీని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈసందర్భంగా పలువురు టీడీపీ నాయకులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో మట్టా సుబ్బారెడ్డి, రాఘవరెడ్డి, పాలపర్తి సుబ్బారావు, గాలం శ్రీనివాసరావు, కోనంకి నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

తాళ్లూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలుగువారిపాలెం ఎంపీపీ(ఏ) పాఠశాలలో సోమవారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి చూపు మందగించిన వారికి అద్దాలు పంపిణీ చేస్తామని వైద్య సిబ్బంది తెలిపారు. శస్త్ర చికిత్స అవసరమైన వారికి జిల్లా వైద్యశాలకు పంపి చికిత్సలు చేయించటం జరుగుతుందని వైద్యసిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పోలంరెడ్డి సుబ్బారెడ్డి, సీహెచ్‌ఐ ప్రభావతి, ఏఎన్ఎం సీహెచ్ సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'సొసైటీని ఆర్థికంగా బలోపేతం చేస్తాం'

కనిగిరి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగారెడ్డిపల్లి సొసైటీ చైర్మన్‌గా కమతం వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సొసైటీ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రైతులకు అండగా ఉంటూ సొసైటీ ద్వారా వారి ఆర్థిక పురోగతికి బాటలు వేస్తామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ రమేష్, నరేష్, గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.



● బాపట్ల : పాతురాజుకొత్తపాలెం పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

ముంపులోనే వరిపైరు

● అన్నదాతల వెతలు
● ఈ-క్రాప్ నమోదుకు ముందే తుడిచిపెట్టుకు పోయిన పైరు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఎడతెరిపి లేకుండా గడచిన వారం కురిసిన కుండ పోత వర్షం.. రైతుకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. దీంతో వేల ఎకరాల్లో వరిపైరు ముంపుబారిన పడి కుళ్ల దశకు చేరుకుంది. దాదాపు మూడు రోజుల పాటు నీళ్లల్లోనే ఉన్న పైరు కొంత తేరుకునే సమయానికి మళ్లీ ఆదివారం రాత్రి నుంచి వాన కురుస్తోంది. దీంతో మళ్లీ పొలాలను వర్షపు నీరు ముంచెత్తింది. గడచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా రెండు సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదయినట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం, రేపల్లె, నగరం మండలాల్లో భారీ వర్షం కురవగా, మిగిలిన మండలాల్లో ఓ మోస్తరు వర్షపాతం నమోదైంది. ఇప్పటి వరకు దాదాపు లక్ష ఎకరాల్లో ఖరీఫ్ సాగు కాగా ఇందులో 80 శాతం పనికిరాకుండా పోయినట్లేనని అన్నదాతలు వాపోతున్నారు. వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాల ప్రకారమే 16,325 హెక్టార్లలో వరి ముంపు బారిన పడినట్లు తేల్చారు. ప్రస్తుతం కురిసిన వర్షాల ధాటికి ఈ సంఖ్య 20,000 హెక్టార్ల వరకు చేరొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఈ-క్రాప్.. 20 శాతమే

ఇప్పుడు ముంపు బారిన పడిన పైరులో ఈ క్రాప్ నమోదు అయింది 20 శాతం మాత్రమేనని సమాచారం. ఈ-పంటలో పైరు వివరాలు సమగ్రంగా నమోదు చేయాలంటే కనీసం నాట్లకు మూడు వారాల వ్యవధి ఉండాలని, కానీ ప్రస్తుతం మునకకు గురైన వరిపైరు అత్యధిక శాతం వారం క్రితం నాట్లు వేసినవేనని తెలుస్తోంది. ఇప్పుడు అదంతా నీటిపాలేనని రైతులు చెబుతున్నారు. కానీ ప్రభుత్వ పరంగా నష్టపరిహారం రావాలంటే పైరు ఈ క్రాప్ నమోదు తప్పనిసరని నిబంధనలు చెబుతున్నాయి.



గట్టుకు పడిన గండికి ఇసుక బస్తా అడ్డం వేస్తున్న కంకటపాలెం రైతు

పీ-4.. పితలాటకం!



పట్టని ప్రజాప్రతినిధులు

ప్రభుత్వం చెబుతున్నట్లుగా పీ-4 అమలు కావడం లేదని జిల్లాల వారీగా గణాంకాలను పరిశీలిస్తే అర్థమవుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానస పుత్రికపై.. ప్రజా ప్రతినిధులు అంతగా దృష్టి సారిస్తున్న దాఖలాలు లేవు. ఒకరిద్దరు మినహా బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించలేదంటే వారికి ఈ పథకం అమలు పట్ల ఉన్న చిత్తశుద్ధి తెలియజేస్తుంది.

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ-4 కార్యక్రమం అమలులో అధికార యంత్రాంగం మల్లగుల్లాలు పడుతోంది. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంను ప్రభుత్వం తీసు కొచ్చింది. వడపోతల అనంతరం పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో 1,85,223 బంగారు కుటుంబాలను నిర్ధారించారు. తొలి విడతలో మూడు జిల్లాల్లో 52,489 బంగారు కుటుంబాల దత్తత కార్యక్రమం నిర్వహించాలని అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. కానీ, మార్గదర్శ కుల ఎంపికలో మాత్రం.. జిల్లాకు 4 వేల మందిని మాత్రమే ఎంపిక చేసి.. దత్తత కార్యక్రమంలో పీ-4 సార్థకత ఇదేనంటూ అధికారులు నిట్టూరుస్తున్నారు.

మూడు జిల్లాల్లో 1,85,223 బంగారు కుటుంబాలు

- తొలి విడతలో 52,489 కుటుంబాల దత్తత
- జిల్లాకు 4 వేల మంది మార్గదర్శకుల గుర్తింపు
- స్వచ్ఛందంగా దత్తతకు ముందుకు రాని వైనం
- అసలు పట్టనట్లు ప్రజాప్రతినిధుల వ్యవహారం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాల మేర పీ-4 ముందుకు సాగుతున్న పరిస్థితి కానరావడం లేదు. ఎంపిక గడువు ముగిసినా అవసరం మేర మార్గదర్శకులు దొరకని పరిస్థితి నెలకొంది. మూడు జిల్లాల్లో అతి కష్టం మీద 12,695 మార్గదర్శకులను గుర్తించడంలో.. అధికార యంత్రాంగం నానా యాతన పడినట్లు తెలుస్తోంది. వీరందరూ బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటారా లేదా అన్న చర్చ జరుగుతోంది. కొన్ని చోట్ల బలవంతంగా మార్గదర్శకులుగా మారుస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్వచ్ఛందంగా మార్గదర్శకులుగా నమోదు చేసుకుంటున్న వారి సంఖ్య నామ మాత్రమేనని సమాచారం. అధికారులు కొందరిని బలవంతంగా మార్గదర్శకులుగా నమోదు చేశారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అధికారులపై ఒత్తిడి

ఒక్కో అధికారి ఒక బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని ఉన్నతాధికారులు ఒత్తిడి తెస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఆగస్టు 15 కల్లా మార్గదర్శకుల ఎంపిక పూర్తి చేయాలని ప్రభుత్వం జిల్లా ఉన్నతాధికారులకు లక్ష్యాలను నిర్దేశించిన సంగతి తెలిసిందే.

జిల్లాల వారీగా పథకం తీరు ఇలా..

పల్నాడు జిల్లాలో 79,068 బంగారు కుటుంబాల ఎంపిక జరిగింది. ఇందులో 2,14,225 మంది కుటుంబ సభ్యులు ఉన్నారు. 52,308 కుటుంబాలను (మిగతా 6వ పేజీలో)

ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : రైతులకు యూరియా కష్టాలపై ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ఆదివారం వెలువడిన కథనానికి కలెక్టర్ జె.వెంకటమురళి స్పందించారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారుల సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు చేశారు. షాపుల్లో డీఏపీ, యూరియా తగినంత అందుబాటులో లేదని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై కలెక్టర్ మార్క్‌ఫెడ్, వ్యవసాయాధికారులను ప్రశ్నించారు. అయితే జిల్లాలో డీఏపీ, యూరియా తగినంత అందుబాటులో ఉందని , కొరత ఏర్పడుతుందనే ఉద్దేశంతో.. రైతులు ముందుగానే అధిక మొత్తంలో నిల్వ చేస్తున్నారని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అధిక ధరలకు ఎరువులు విక్రయి స్తే.. ఫిర్యాదు చేయాలని రైతులకు తెలిపారు. యూరియాను అన్ని సొసైటీలకు అందజేయాలని కలెక్టర్ డీఎం మార్క్‌ఫెడ్‌కు సూచించారు. బుధవారం నుంచి అన్ని రైతు సహాయ కేంద్రాల్లో యూరియా పంపిణీ చేస్తారని తెలిపారు. గ్రామాలలో విలేజ్ అసిస్టెంట్‌లు ఇంటింటికెళ్లి రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతు సహాయ కేంద్రాల నుంచి ఎరువులు పంపిణీకి మ్యాపింగ్ పూర్తిచేసి పంపిణీ చేయాలన్నారు.

రాబోవు మూడు రోజుల్లో భారీ వర్షాలు..


జిల్లాలో రాబోవు మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దార్‌లు లోతట్టు ప్రాంతాలపై దృష్టి పెట్టి తగు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. కృష్ణానది పరీవాహక ప్రాంతాల్లో ఉన్న మండల రెవెన్యూ అధికారులు వాచ్‌గార్డులను ఏర్పాటు చేయాలన్నారు. అధిక వర్షాలు వచ్చినప్పుడు గ్రామ, మండల, జిల్లాస్థాయిలో కంట్రోలు రూమ్‌లు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. అధికారులు సెలవుపై వెళ్ళే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సంయుక్త కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్, జిల్లా వ్యవసాయశాఖాధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు, జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్యామసన్, డీఎం మార్క్‌ఫెడ్ కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కొలువుల ఎర.. నిరుద్యోగులు విలవిల



- కలెక్టరేట్, వర్సిటీలో ఉద్యోగాలంటూ రూ.లక్షల్లో వసూళ్లు
- గుంటూరు నుంచి విశాఖ వరకు విస్తరించిన మాఫియా
- కీలకంగా డ్వామా మాజీ ఉద్యోగి..

'కలెక్టర్ ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం కేవలం రూ. 2 లక్షలు.. ఆచార్య ఎన్‌జీ రంగా వర్సిటీలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం రూ.లక్షన్నరే.. నోటి మాటతో నమ్మాల్సిన పని లేదండీ.. ఇదిగో జాయింట్ కలెక్టర్ ఇచ్చిన అపాయింట్మెంట్ ఆర్డర్. మీకు ఇదే నేరుగా పోస్టులో వస్తుంది.' ఇదీ.. నిరుద్యోగులకు ఎరవేస్తున్న ఓ ముఠా తీరు.



ఫోన్ పే ద్వారా నగదు బదిలీ చేసినట్లు ఉన్న ఆధారం

మా నాన్న ఇంటికి రావొద్దంటున్నాడు..



మా నాన్న దివ్యాంగుడు. నాకు ఉద్యోగం వస్తుందన్న ఆశతో అప్పు తెచ్చి రూ. 2 లక్షలు ఇచ్చాను. నన్ను మోసం చేశారు. అప్పు ఇచ్చిన వాళ్లు మా నాన్న ఇం ట్లో అన్నం తింటుంటే బయటకు లాక్కొచ్చి కొట్టారు. మా నాన్న డబ్బులు తీసుకోకుండా ఇంటికి రావద్దు అంటున్నాడు. మొదట్లో ఎస్పీ చెప్పారని నగరంపాలెం పోలీసులు బాగానే స్పందించారు. మోసం చేసిన వ్యక్తిని పిలిపించి విచారించారు. ఈ నెల 10న డబ్బులు కడతానని ఒప్పుకున్న వ్యక్తి మళ్లీ స్పందించడం లేదు. చచ్చిపోవాలని ఉంది.

- ఎ.చిరంజీవి, నర్సీపట్నం

గుంటూరు సిటీ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, ఒంగోలు, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లోని కొందరు ఒక ముఠాగా ఏర్పడి.. నిరుద్యోగులకు కుచ్చు టోపీ పెడుతున్నారు. గుంటూరు డ్వామా కార్యాలయంలో పనిచేసిన ఓ మాజీ ఉద్యోగి ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువతను మోసం చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

వలలో చిక్కిన నర్సీపట్నం యువకులు..

అనకాపల్లి జిల్లా నర్సీపట్నంకు చెందిన ఇద్దరు యువకులు చిరంజీవి, పూర్ణ ఉద్యోగం కోసం (మిగతా 6వ పేజీలో)

ఓలేరు కరకట్టను బలపరుస్తున్న ఆర్‌సీ అధికారులు

రేపల్లె, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : పలు ప్రాంతాల్లో కరకట్ట బలహీనంగా ఉండటంతో సోమవారం 'ఆంధ్రజ్యోతి' ఎడిషన్‌లో 'ఎవరికి పట్టని కరకట్ట... వరదల సమయంలో హడావుడితో సరి' అనే శీర్షిక న కథనం ప్రచురించటంతో ఆర్‌సీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అధికారులు స్పందించారు. భట్టిప్రోలు మండలం నుంచి రేపల్లె మండలం వరకు కరకట్టను పరిశీలించి ప్రమాదభరితంగా ఉన్న వాటిని గుర్తించారు. ఓలేరు సమీపంలో కరకట్ట బాగా బలహీనంగా ఉండటంతో ఇసుకబస్తాలతో బలపరిచినట్టు ఆర్‌సీ ఏఈ నాగేశ్వర్‌నాయక్ తెలిపారు. వర్షాలు, కృష్ణానదికి వరదనీరు పోటెత్తటంతో ఆర్‌సీ అధికారులు కనిపించకపోవటంతో కృష్ణాకరకట్ట వెంట ఉన్న గ్రామాల్లోని ప్రజలు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవటం లేదని, ఇప్పటికైనా అధికారులు వచ్చి కట్టని బలపరచాలని కోరారు.



ఓలేరుపల్లెపాలెం వద్ద కరకట్టను బలపరుస్తున్న ఆర్‌సీ అధికారులు

ఎన్ని బార్లకైనా దరఖాస్తు చేసుకోవచ్చు..

గుంటూరు, పల్నాడులో 159 బార్ల లైసెన్స్‌లకు ఆహ్వానం

- గీత కార్మికులకు మరో 15 కేటాయింపు
- మూడేళ్ల కాలపరిమితి
- గుంటూరు ఎక్సైజ్ శాఖ డీసీ డాక్టర్ కె.శ్రీనివాసులు



ప్రసంగిస్తున్న గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు, అరుణ కుమారి, లత

గుంటూరుకార్పొరేషన్ / నరసరావుపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, పల్నాడు జిల్లాలలో మొత్తం 159 బార్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. సోమవారం గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లాలో 110, పల్నాడు జిల్లాలో 49 బార్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్, హైబ్రిడ్ మోడల్ మూడు విధానాల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. సెప్టెంబర్ 1 నుంచి 2028 ఆగస్టు 31 వరకు మూడేళ్ల కాల పరిమితికి.. ఒక వ్యక్తి ఎన్ని బార్ లైసెన్స్‌లకు అయినా.. దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. బార్‌కి కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తామని స్పష్టం చేశారు. 50వేల లోపు జనాభా ఉంటే.. రూ.35 లక్షలు, 5 లక్షల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.55 లక్షలు, అంతకు పైన జనాభా ఉంటే రూ.75 లక్షలు లైసెన్స్ ఫీజు ఉంటుందన్నారు. ఏడాదిలోగా ఆరు వాయిదాల్లో చెల్లించుకోవచ్చు అన్నారు. ప్రతి దరఖాస్తు, ప్రాసెసింగ్ ఫీజు రూ.5.10 లక్షలు (మిగతా 6వ పేజీలో)



పోతార్లంక వరద నీటిని పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్ డూడి

ప్రాణ నష్టం లేకుండా భద్రతా చర్యలు

ఎస్పీ తుషార్ డూడి

భట్టిప్రోలు, కొల్లూరు ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : వరద ప్రవాహం వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని.. ఎస్పీ తుషార్ డూడి పోలీసు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కొల్లూరు మండలంలోని దోనేపూడి వద్ద పోతార్లంక చప్టా, భట్టిప్రోలు మండలం పెదపులివర్రు చినరేవు వంతెనలపై ప్రవహిస్తున్న వరద నీటిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్ఐలు అమరవర్ధన్, శివయ్యకు పలు సూచనలు చేశారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని కృష్ణానది పరివాహక గ్రామాల్లో, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. నీట మునిగిన కల్వర్టుల వద్ద భద్రతా చర్యలు తీసుకుని.. 12 చోట్ల పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

అప్రమత్తంగా ఉండాలి: ఆర్డీవో రామలక్ష్మి

కొల్లూరు: కృష్ణానది వరద పోటెత్తడంతో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో రామలక్ష్మి సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో బాలింతలు, వృద్ధులు, రోగులు, చిన్నారులను పునరావాస కేంద్రాలు,సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

శింగరకొండకు మరింత శోభ

- రాజగోపురాలు, ప్రాకారం పునఃనిర్మాణానికి సన్నాహాలు
- రూ.11 కోట్లతో అంచనాలు- ముందుకొచ్చిన దాతలు

అద్దంకి, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాజగోపురాలు, ప్రాకారం పునఃనిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇప్పటికే సుమారు రూ.7 కోట్లతో రాతి ముఖ మండపం నిర్మాణం పూర్తయింది. రాజగోపురాలు, ప్రాకారం నిర్మాణం చేపట్టాలని దేవదాయ శాఖ అధికారులు సిద్ధం కావడంతో దాతలు ముందుకు వచ్చారు. దక్షిణం వైపు ఉన్న ప్రధాన రాజగోపురం సుమారు రూ.5 కోట్ల వ్యయం అవుతుండగా, మిగిలిన మూడు రాజగోపురాలు రూ.2 కోట్ల చొప్పున రూ.6 కోట్ల ఖర్చు అవుతుందని దేవదాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. దక్షిణ రాజగోపురంతో పాటు మరో రెండు రాజగోపురాల నిర్మాణంకు ముగ్గురు దాతలు ముందుకు వచ్చారు. మరో దాత కూడా సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఇటీవల ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు రాజగోపురాలు, ప్రాకారం నిర్మాణ పనులు గురించి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో చర్చించారు. వెంటనే అంచనాలు సిద్ధం చేయించాలని మంత్రి చెప్పడంతో.. అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. దేవదాయశాఖ ఉన్నతాధికారుల నుంచి అనుమతులు తీసుకొని సంవత్సర కాలంలో పనులు పూర్తి అయ్యే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

ప్రస్తుతం దక్షిణ రాజగోపురం ఎత్తు లో ఉన్నందున.. కొత్తగా నిర్మాణం చేసే రాజగోపురాలు అన్ని ఒకే ఎత్తులో ఉండే విధంగా చూస్తున్నారు. దక్షిణ రాజగోపురం ముందు ఉన్న రోడ్డు కూడా ఎత్తు తగ్గించనున్నారు. కమ్మ సత్రం నుంచి రోడ్డు ఎత్తు తగ్గించుకుంటూ వచ్చి భవనాసి చెరువు వద్దకు వచ్చేసరికి రోడ్డు, దేవాలయం ఒకే ఎత్తులో ఉండే విధంగా రూపకల్పన చేయనున్నారు. రాజగోపురాలు, ప్రాకారం పూర్తి అయితే శింగరకొండ దేవాలయం రూపురేఖలు పూర్తిగా మారిపోనుంది.

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం



మార్జిన్‌లోకి దూసుకెళ్లిన కారు

ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదం


మార్జిన్‌లోకి దూసుకు వెళ్లిన కారును బయటకు నెడుతున్న యువకులు

బల్లికురవ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొమ్మాలపాడు రోడ్డులో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయిన కారు వేగంగా మార్జిన్‌ల ఉన్న పొలాల్లోకి దూసుకు వెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. కొమ్మాలపాడు నుంచి బల్లికురవ వస్తున్న కారు చెన్నుపల్లి సమీపంలోకి వచ్చే సరికి ఎదురుగా వస్తున్న వాహనం పైకి రావటంతో వెంటనే రోడ్డు పక్కన ఉన్న పొలాల్లోకి డ్రైవర్ పోనివ్వటంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో ముగ్గురు ఉన్నారు. వారు సుక్షితంగా బయటపడ్డారు. వెంటనేయువకులు కారును బయటకు తీశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

- గుంటూరులో వైద్యం అందిస్తున్న కుటుంబ సభ్యులు

వాకావారిపాలెం(చీరాల), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు సమీపంలోని వాకావారి పాలెంకు చెందిన యొహాను రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం రాత్రి ఇంటి నుండి బయటకు వెళ్లిన బాధితుడు తీవ్ర రక్త గాయాలతో 167 ఏ జాతీయ రహదారిలో పడి ఉన్నాడు. అర్ధరాత్రి గ్రహించిన గ్రామస్థులు కుటుంబ సభ్యులకు సమాచారం చేర వేశారు. వెంటనే చీరాల్లోని ఓ ప్రయివేట్ వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అందించి పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరుకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే ప్రమాదం ఎలా జరిగిందో ఎవ్వరికీ తెలియని పరిస్థితి నెలకొంది.

వైట్, బ్లాక్ బర్లీ పొగాకు సాగు నిషేధం

చినగంజాం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : మండలంలో వైట్, బ్లాక్ బర్లీ పొగాకు సాగును నిషేధించినట్లు మండల వ్యవసాయాధికారి ఆర్.చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోనే వైట్, బ్లాక్ బర్లీ పొగాకు పంటను నిషేధిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. పొగాకు పంటను నిషేధించినందున రైతులందరూ ప్రత్యామ్నాయ పంటలు మొక్కజొన్న, జొన్న పంటలతో పాటు ఇతర పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ఇతర జిల్లాల నుంచి పొగాకు నారు తెచ్చి సాగు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రైవేటు కంపెనీల అగ్రిమెంట్లు, ప్రలోభాలను నమ్మవద్దని తెలిపారు. జిల్లాలో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు తమ పంటను కాపాడుకోవాలని సూచించారు. మండలంలోని రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఎవరూ ఎరువుల గురించి ఆందోళన చెందొద్దని, రైతు సేవా కేంద్రాల వద్ద కూడా మీరు కోరిన ఎరువులు అందుబాటులో ఉంచుతామని ఏవో తెలిపారు.

పరిశుభ్రమైన వాతావరణం ఉండాలి

యద్దనపూడి/మార్టూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి గురుకుల బాలికల విద్యాలయాన్ని సోమవారం ఎంపీడీవో జావెద్ పరిశీలించారు. బాలికలకు పరిశుభ్రమైన వాతావరణం ఉండాలని, అధికారులకు సూచించారు. మురికి కుంటలు ఉండరాదని, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని చెప్పారు.

పీ-4.. పితలాటకం!

(5వ పేజీ తరువాయి)

తొలి విడతలో దత్తత తీసుకునేలా నిర్ణయించారు. ఇందులో 27,760 కుటుంబాలను దత్తతకు 4,202 మంది మార్గదర్శకులను గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

- బాపట్ల జిల్లాలో 57,388 బంగారు కుటుంబాలను గుర్తించారు. 1,44,569 మంది కుటుంబ సభ్యులున్నారు. 49,151 బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియ చేపట్టనున్నారు. వీటిలో 8,179 కుటుంబాల కు 4,212 మార్గదర్శకులను గుర్తించారు.

- గుంటూరు జిల్లాలో 1,00,314 బంగారు కుటుంబాలను గుర్తించగా వీటిలో 2,77,330 మంది కుటుంబ సభ్యులు ఉన్నారు. 83,764 కుటుంబాల దత్తతకు ఏర్పాటు చేస్తున్నారు. ముందుగా 16,550 కుటుంబాల దత్తత ప్రక్రియ ప్రారంభించాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. 4,281 మార్గదర్శకులను ఎంపిక చేశారు.

ఎమ్మెల్యే ఏలూరి కృషితో డీడీఎన్ఎస్ మంజూరు

ఉత్తర్వులు జారీచేసిన దేవదాయ శాఖ కమిషనర్

దేవాలయాల నిర్వహణకు నెలకు రూ.10వేలు


ఎమ్మెల్యే సాంబశివరావు

పర్చూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ వ్యాప్తంగా 11 దేవాలయాలకు ధూప దీప నైవేద్యం పథకం మంజూరు చేస్తూ సోమవారం దేవదాయ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ ఉత్తర్వులు జారీచేశారు. శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు ప్రత్యేక కృషితో దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో పలు దేవాలయాలకు ఈ పథకం వర్తించనుంది. ఆయా దేవాలయాలకు నెలకు రూ.10వేల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేయనుంది. అందులో అర్చకుల వేతనం రూ.7వేలు, నైవేద్యానికి రూ.3వేలు వెచ్చించనున్నారు.

ఎంపికైన ఆలయాలు ఇవే...

మండలం తన్నీరువారిపాలెంలోని శ్రీ కోదండ రామాలయం, పోలేరమ్మ అమ్మవారి ఆలయం, నూతలపాడు శ్రీ పద్మాలంకమ్మ అమ్మవారు దేవస్థానం, కారంచేడు మండలం ఎర్రంవారిపాలెంలోని విజయ గణపతి స్వామి ఆలయం, మార్టూరు మండలం బొల్లాపల్లిలోని సీతారామ స్వామి దేవస్థానం, గోవిందాంబ సమేత బ్రహ్మేంద్ర స్వామి ఆలయం, ఇంకొల్లు మండలం వంకాయలపాడు పోలేరమ్మ దేవస్థానం, సిద్ధి వినాయక ఆలయం, శ్రీపుట్టల కామేశ్వరి అమ్మవారి ఆలయం, సుబ్బారెడ్డిపాలెంలో కోదండరామ స్వామి ఆలయానికి ఆ పథకం వర్తించనుంది.

కొలువుల ఎర.. నిరుద్యోగులు విలవిల

(5వ పేజీ తరువాయి)

అక్కడ ఉన్న ఒక వ్యక్తిని కలిశారు. అతని సూచన మేరకు గుంటూరులోని ఓ వ్యక్తి దగ్గరకు వారు వచ్చారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని చిరంజీవి వద్ద రూ. 2 లక్షలు, పూర్ణ వద్ద రూ. 1.70 లక్షలు అతను తీసుకున్నాడు. ఇదంతా ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో జరిగింది. ఫోన్ పే ద్వారా నగదును బదిలీ చేశారు. గుంటూరు వ్యక్తి నగదు బదిలీ సమయంలోనే జాగ్రత్త వహించాడు. ఆ సొమ్మును బంగారం వ్యాపారికి బదిలీ చేయించాడు. కొంత మాత్రం తన ఖాతాతోపాటు, వాళ్ల సోదరి అకౌంట్‌కు బదిలీ చేయించుకున్నారు. నగదు తీసుకునే సమయంలో పది రోజుల్లోనే నియామకపు ఉత్తర్వులు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.

నకిలీ నియామక ఉత్తర్వులు

నిరుద్యోగులను నమ్మించడం కోసం ఈ ముఠా నకిలీ నియామక ఉత్తర్వులను తయారు చేసింది. అందులో గుంటూరు జాయింట్ కలెక్టర్ పేరు నిరుద్యోగులకు చూపించారు. అయితే జేసీ సంతకం దగ్గర మహిళా అధికారి పేరు ఉండడంతో.. అనుమానం వచ్చిన బాధితుడు ఇదేమిటి అని అడగగా.. మరొకరు కూడా అదే పోస్టులో ఉన్నట్లు నమ్మించే ప్రయత్నం చేశారు. పది రోజుల్లో చిరునామాకు నియామకపు ఉత్తర్వులు వస్తాయని చెప్పినట్లు బాధితులు చెబుతున్నారు. ఏ విధమైన ఉత్తర్వులు రాకపోవడంతో బాధితులు గుంటూరుకు చెందిన వ్యక్తికి ఫోన్ కాల్ చేయగా స్పందన లేదు. మోసపోయమని తెలుసుకున్న బాధితులు న్యాయం కోసం జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు.

వర్సిటీలో పరీక్ష కూడా పెట్టారు..

ఉద్యోగాల పేరుతో గుంటూరుకు చెందిన వ్యక్తి చాలా మందిని మోసం చేసినట్లు తెలుస్తోంది. మరొక మహిళ కూడా అదే వ్యక్తిపై ఈ మధ్య కాలంలో జిల్లా కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఎన్‌జీ రంగా వర్సిటీలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని ఆమెను ఏకంగా యూనివర్సిటీకి తీసుకెళ్లారు. కంప్యూటర్ పరీక్ష కూడా నిర్వహించినట్లు బాధితురాలు చెబుతోంది. దీంతో ఉద్యోగం సంగతి వాస్తవమేనని నమ్మి.. నగదు ముట్టజెప్పినట్లు తెలుస్తోంది. ఈ ముఠా గుంటూరు, ఒంగోలు, విశాఖపట్నం జిల్లాల్లో ఇటువంటి మోసాలకు పాల్పడినట్లు సమాచారం.

ఆరేళ్ల తర్వాత ఊరట

ఉపాధి పెండింగ్ బిల్లుల మంజూరుకు చర్యలు

నాటి టీడీపీ హయాంలో పెద్దఎత్తున పనులు

చెల్లింపులను నిలిపివేసిన వైసీపీ ప్రభుత్వం

భారీగా బకాయిలతో అవస్థలు పడ్డ శ్రేణులు

ప్రస్తుతం వాటి చెల్లింపులకు చర్యలు

ఆరు మాసాల క్రితం రూ.11 కోట్లు జమ

తాజాగా మరో రూ.16.17 కోట్లు చెల్లింపునకు చర్యలు

ఆధారాలతో అప్‌లోడ్ చేస్తున్న అధికారులు

నమోదు చేయకుండా నిలిపివేసిన వాటిపైనా దృష్టి

నియోజకవర్గాల వారీ సమావేశాలు


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

ఒంగోలు ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ప్రభుత్వం (2014-19)లో ఉపాధి హామీ పథకం పనుల బిల్లులకు ఇప్పుడు మోక్షం లభిస్తోంది. ఉపాధి పథకం మెటీరియల్ కోటా నిధుల ద్వారా అప్పట్లో పెద్దఎత్తున పనులు చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో సీసీరోడ్లు, డ్రైన్లు, శ్మశానాల అభివృద్ధి, పాఠశాలలకు ప్రహరీలు, మొక్కల పెంపకం, చెత్త నుంచి సంపద తయారీ (డబ్ల్యూపీసీ) కేంద్రాలు, అంగన్‌వాడీ, పంచాయతీ భవన నిర్మాణాలు భారీగా చేపట్టారు. జిల్లాలో సుమారు రూ.వెయ్యి కోట్ల పనులు నాటి టీడీపీ ప్రభుత్వంలో జరిగాయి.

బిల్లులు చెల్లించకుండా వేధించిన వైసీపీ ప్రభుత్వం

2019 ఎన్నికలకు ముందు చేసిన పనులకు సంబంధించిన బిల్లులను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. అలా రూ.100 కోట్ల వరకు బిల్లులు ఆగిపోయాయి. వీటిలో అత్యధిక భాగం టీడీపీ శ్రేణులు చేసి ఉండటంతో వారిని ఆర్థికంగా దెబ్బతీసేందుకు వైసీపీ ప్రభుత్వం అలా వ్యవహరించింది. కొంతకాలం తర్వాత పనులు చేసిన పలువురు కోర్టును ఆశ్రయించారు. దీంతో వైసీపీ ప్రభుత్వం విజిలెన్స్, ఇతర శాఖల ఇంజనీరింగ్ సిబ్బందితో తనిఖీలు చేయించింది. పూర్తిచేసిన పనుల్లో భారీగా బిల్లులు తగ్గించి వేధింపులకు గురిచేసింది. ఎక్కువమంది కోర్టుకు వెళ్లలేక, వేధింపులను తట్టుకోలేక బిల్లులు అడగడం మానేశారు. చివరకు కోర్టు ఆదేశాలతో కొందరికి చెల్లించిన నాటి వైసీపీ ప్రభుత్వం భారీగా బిల్లులను అసలు ప్రభుత్వ రికార్డుల్లో (ఆన్‌లైన్‌లో) నమోదు కూడా కాకుండా వర్క్ క్లోజర్ డేటా కింద చూపింది. దీంతో కేంద్రానికి రాష్ట్రప్రభుత్వం నివేదించే బిల్లుల జాబితాలో అసలు ఆ పనులు నమోదు కాకుండా నిలిచిపోయాయి. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లా బిల్లులు రాకపోవడంతో పనులు చేసిన టీడీపీ శ్రేణులు తీవ్రంగా నష్టపోయారు.

కేంద్ర వెబ్‌సైట్‌ను తిరిగి తెరిపించిన మంత్రి పెమ్మసాని

తిరిగి అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వం దృష్టికి ఉపాధి పథకం బిల్లుల వ్యవహారం వచ్చింది. తొలివిడత అన్ని రికార్డుల్లో నమోదై వివరాలు సక్రమంగా ఉన్న పనులకు చెల్లింపులు చేసింది. అలా ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలలో జిల్లాలో రూ.11కోట్ల పెండింగ్ బిల్లులు జవ ౦ యాయి. రెండో దశలో పనులు చేసినట్లు రికార్డుల్లో ఉన్న వాటిపై దృష్టి సారించారు. వైసీపీ ప్రభుత్వ కాలంలో వర్క్ క్లోజర్ కింద చూపడంతో అలాంటి పనులను తిరిగి ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు కేంద్రం అనుమతి అవసరమై జాప్యం నెలకొంది. దీనిపై సీఎం ఆదేశాలతో రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ చూపడంతో కేంద్రం నిలిపివేసిన ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను ఇటీవల తిరిగి ఓపెన్ చేసింది. దీంతో ప్రస్తుతం ఆ వివరాలను అధికారులు నమోదు చేస్తున్నారు. జిల్లాలో చిన్నాపెద్దవి కలిపి సుమారు రూ.16.17 కోట్లకు సంబంధించిన 19,393 పనులు ఉన్నట్లు గుర్తించారు. వాటిని ప్రస్తుతం నమోదు చేస్తుండగా నగదు జమవుతున్నదని సమాచారం.

ఆధారాలు ఉంటే చెల్లింపు!

ఇక వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్పటికి టీడీపీ శ్రేణులు చేసిన పనుల్లో పూర్తయిన వాటికి చెల్లింపులు నిలిపివేయడమే కాక అసలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, ఎంబుక్‌లో రికార్డు చేయడం వంటివి కూడా ఆపివేసినవి భారీగా ఉన్నాయి. అలాంటి వాటికి కూడా ఆధారాలు ఉంటే తిరిగి నమోదు ప్రక్రియ పూర్తిచేసి చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని సీఎం కార్యాలయం నుంచి అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో అలాంటి వాటిని గుర్తింపుపై ప్రస్తుతం డ్వామా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

డ్వామా అధికారుల సమావేశాలు

మూడు రోజులుగా జిల్లాలో నియోజకవర్గాల వారీ ప్రజాప్రతినిధుల సమక్షంలో డ్వామా అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. పనులు చేయించడంలో కీలకమైన డ్వామా సిబ్బంది, ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ సిబ్బందితో సంయుక్తంగా ఈ సమావేశాలను నిర్వహించి అప్పట్లో పనులు చేసిన వారిని కూడా పిలిపిస్తున్నారు. వారి వద్ద ఉన్న ఆదారాలను పరిశీలిస్తున్నారు. ఈ తరహావి కూడా భారీగానే ఉన్నట్లు తెలుస్తోంది. కొద్దిపాటి ఆధారాలున్నా అలాంటి వాటిని నమోదు చేసి బిల్లులు అందేలా చర్యలు తీసుకొనే ఆలోచనలో అధికారులు ఉన్నారు. ఈక్రమంలో గత గురువారం కొండపి నియోజకవర్గ సమావేశం తూర్పునాయుడుపాలెంలో మంత్రి డాక్టర్ స్వామి క్యాంపు కార్యాలయంలో జరిగింది. డ్వామా పీడీ జోసఫ్‌కుమార్‌తోపాటు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులు చేసి వైసీపీ ప్రభుత్వ కక్షసాధింపు చర్యతో ఆ బిల్లులు అందక ఆర్థికంగా నష్టపోయిన వారికి ఊరట కలిగించేలా ప్రజా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అలాంటివి జిల్లాలో రూ.60నుంచి 70 కోట్ల వరకు ఉన్నట్లు అంచనా. అందులో చెల్లించకుండా ఆగిపోయినట్లు అధికారిక లెక్కల్లో చూపిన రూ.11కోట్లను ఆరు మాసాల క్రితం ప్రభుత్వం చెల్లించింది. నమోదు కాకపోయినా పనులు పూర్తి చేసినట్లు అధికారుల వద్ద రికార్డుల్లో ఆధారాలు ఉన్న వాటికి రూ.16.17 కోట్లను ప్రస్తుతం విడుదల చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మరో రూ.30కోట్లకు పైగా అసలు లెక్కాపత్రం లేకుండా నాటి వైసీపీ ప్రభుత్వం ఇబ్బందిపెట్టినవి ఉన్నట్లు అంచనా వేశారు. వాటికి అవసరమైన ఆధారాల సేకరణపై దృష్టిసారించారు. ప్రభుత్వ ఆదేశాలతో డ్వామా జిల్లా అధికారులు నియోజకవర్గాల వారీ కీలక సమావేశాలను ప్రజాప్రతినిధుల సమక్షంలో నిర్వహిస్తున్నారు.

అర్ధరాత్రి వరకు తాగుడే!

జిల్లాలో 29 బార్లకు నోటిఫికేషన్

గీత కార్మికులకు 3 కేటాయింపు

లాటరీ ద్వారా ఎంపిక

ఒంగోలు క్రైం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ నూతన విధానంలో 2025-28కి జిల్లాలో 29 బార్ల ఏర్పాటుకు నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. వీటిలో మూడు బార్లు గీత కార్మికులకు కేటాయించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు బార్లు నిర్వహించుకోవచ్చు. ఈ మేరకు స్థానిక జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్(డీసీ) హేమంత్ నాగరాజు, జిల్లా ఎక్సైజ్ అధికారి(ఈఎస్) ఎస్.ఆయేషాబేగంలు నిర్వహించిన మీడియా సమావేశంలో నూతన బార్లకు నోటిఫికేషన్ విడుదల చేశారు. మొత్తం జిల్లాలో 29 బార్లు కాగా వీటిలో 3 గీత కార్మికులకు కేటాయించినట్లు తెలిపారు. 26 బార్లలో ఒంగోలులో 16 కేటాయించగా, మార్కాపురం 5 బార్లకు రూ.55లక్షలు లైసెన్స్ ఫీజుగా నిర్ణయించారు. పొదిలి, కనిగిరి, దర్శి, చీమకుర్తి, గిద్దలూరులలో ఒక్కో బార్‌ను కేటాయించారు. ఆ ప్రాంతాల్లో రూ.35 లక్షలు లైసెన్స్ ఫీజుగా నిర్ణయించారు. ఈనెల 18 నుంచి 26 వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చు అన్నారు. 28న ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతిన బార్ల కేటాయిస్తామన్నారు. అప్లికేషన్ ధర రూ.5లక్షలుగా నిర్ణయించారని ఆ ఫీజు తిరిగి ఇస్తారన్నారు. దరఖాస్తుదారుడు ప్రాసెసింగ్ ఫీజు రూ.10వేలు అని తెలిపారు. ఒక్కో బార్‌కు తప్పనిసరిగా 4 దరఖాస్తులు వస్తేనే లాటరీ వేస్తామన్నారు.

గీత కార్మికులకు సగం ధరకే బార్ కేటాయింపు

గీత కార్మికులకు లైసెన్స్ ఫీజులో 50శాతం రాయితీ ఇస్తారన్నారు. మూడు బార్‌లు కేటాయించినట్లు తెలిపారు. ఒంగోలులో ఒక బార్ గౌడ్‌కు, మార్కాపురంలో ఒక బార్ గౌడా, మరొక బార్ గౌండ్లకు కేటాయించారు. వీరు అప్లికేషన్లు ఈనెల 20 నుంచి 29 వరకు జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రీడ్ మోడ్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వీరికి కేటాయించే బార్‌లకు లైసెన్స్ ఫీజు ఒంగోలు మార్కాపురంలలో రూ.27.50 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈనెల 30న దరఖాస్తులు పరిశీలించి లాటరీ తీసి కేటాయింపు చేస్తారన్నారు.

కళా ఉత్సవ్‌లో అలరించిన నవోదయ విద్యార్థులు

తర్లుపాడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలుజువ్వలపాడు గ్రామ పరిధిలో జవహర్ నవోదయ విద్యాలయంలో సోమవారం నుంచి కళా ఉత్సవ్ కార్యక్రమం ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. రెండు రోజులపాటు జరిగే కళా ఉత్సవ్‌లో హైదరాబాద్ రీజియన్‌లోని ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 19 నవోదయ పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్నట్లు తెలిపారు. విద్యార్థులు ప్రత్యేక వేషధారణ, నృత్యాలతో ఆకట్టుకున్నారని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మార్కాపురం మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ప్రకృతిని కాపాడుకుంటూ స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కావాలని తెలిపారు. విద్యతోపాటు కళలపై కూడా ఆసక్తి ఉండాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న కళను వెలికితీసేందుకు ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సాధన కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మధుసూదన్‌శర్మ, గుంటూరు ప్రభుత్వ మ్యూజిక్ స్కూల్ అధ్యాపకులు, న్యాయ నిర్ణేతలు సురేష్ బాబు, ప్రభాకర్‌రావు, జయశంకర్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

అవీఇవీ

ఆధునిక వ్యవసాయ యాంత్రీకరణతో అధిక ఆదాయం


మాట్లాడుతున్న ఏడీఏ ఎఫ్రాయిమ్

అద్దంకిటౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఆధునిక వ్యవసాయ యాంత్రీకరణతోనే అధిక ఆదాయం పొందవచ్చని అద్దంకి సహాయ వ్యవసాయ సహాయకులు బి.ఎఫ్రాయిమ్ చెప్పారు. సోమవారం మండలంలోని బొమ్మనంపాడు రైతు సేవా కేంద్రం వద్ద ఆత్మ సౌజన్యంతో డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా మందుల పిచికారీలో కిసాన్ డ్రోన్‌లు విప్లవాత్మక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లడుతూ మండలంలో 5 కిసాన్ డ్రోన్‌లు 39.20 లక్షల రాయితీపై అందించినట్లు తెలిపారు. డ్రోగో కంపెనీ ప్రతినిధి లీ లాకుమార్ డ్రోన్ పని చేసే విధానాలను రైతులకు వివరించారు. ఆత్మ బ్లాక్ టెక్నాలజి మేనేజర్ శేషారావు, నాగులపాడు సొసైటి అధ్యక్షుడు ఏనుగంటి వెంకటరామయ్య, కామేపల్లి హనుమంతరావు, ఆత్మ ఏటీఎం రామిరెడ్డి, ఏఈవో కోటేశ్వరరావు వీఏఏ దినేష్ సాయి పాల్గొన్నారు.

ఎన్ని బార్లకైనా దరఖాస్తు చేసుకోవచ్చు..

(5వ పేజీ తరువాయి)

చెల్లించాలన్నారు. దరఖాస్తుదారుడికి వయసు కనీసం 21 ఏళ్లు ఉండాలి అన్నారు. జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి అరుణకుమారి, సీఐ లత పాల్గొన్నారు.

గౌడ కార్మికులకు 15 బార్లు

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో గౌడ, గౌడ సంఘీలకు మొత్తం 15 షాపులు కేటాయించడం జరిగిందని గుంటూరు ఎక్సైజ్ శాఖ డీసీ శ్రీనివాసులు తెలిపారు. గుంటూరు కలెక్టరేట్‌లో జిల్లా జేసీ భార్గవ్ తేజ, పల్నాడు కలెక్టరేట్లో అధికారులు గౌడ సామాజిక వర్గాలకు సంబంధించిన ప్రాంతాలను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. గుంటూరులో 10 బార్లను కేటాయించగా.. గౌడకు 7, గౌడ్‌కు ముడు షాపులు కేటాయించామన్నారు. పల్నాడు జిల్లాలో కేటాయించిన 5 షాపుల్లో గౌడకు 3, గౌడ్‌కు 2 షాపులు నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ సామాజిక వర్గాలకు బార్ లైసెన్సు ఫీజు రూ.27.50 లక్షలుగా నిర్ణయించారు. సాధారణ బార్లకు ఏడాదికి లైసెన్సు ఫీజు రూ.55 లక్షలుగా ఉంది. ఏటా లైసెన్సు ఫీజును పెంచనున్నారు. రెండో ఏడాది రూ 60.50 లక్షలు, మూడవ ఏడాది రూ.66.55 లక్షలుగా లైసెన్సు ఫీజును ప్రభుత్వం నిర్ణయించింది. పల్నాడు జిల్లాలో బార్ లైసెన్సులకు బుధవారం కలెక్టర్ పి.అరుణ్‌బాబు గెజిట్ విడుదల చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లపై ఆయన కలెక్టరేట్‌లో ఎక్సైజ్ అధికారులతో సమీక్షించారు. ఈ నెల 29 సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని, 30న బార్లకు లాటరీ తీయనున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి


ప్రకృతి కషాయాల తయారీని పరిశీలిస్తున్న డీపీఎం మోహన్

బల్లికురవ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి పద్ధతి ద్వారా చేపట్టే వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని డీపీఎం మెహన్ చెప్పారు. సోమవారం మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో ప్రకృతి పద్ధతిలో తయారు చేస్తున్న కషాయాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన కషాయాలను అందుబాటులో ఉంచాలన్నారు. అలానే తక్కువ ఖర్చుతో పురుగు మందుల స్థానంలో కషాయాలను తయారు చేసుకొనేలా రైతులను సిద్ధం చేయాలని చెప్పారు. వంటింట్లో దొరికే వస్తువులతో తెగుళ్ల నివారణకు మందులను తయారు చేసుకోవచ్చన్నారు. అనంతరం అజ్ఞాస్త్రం, వెల్లుల్లి కషాయం తయారీ చేసి రైతులకు చూపించారు. ఈ కార్యక్రమంలో ఎంటీ అప్పారావు, యూనిట్ ఇన్‌చార్జి సీహెచ్ కల్పన పాల్గొన్నారు.

స్త్రీ శక్తి పథకంతో మహిళలకు మేలు


చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మండల సమాఖ్య సభ్యులు, టీడీపీ నేతలు

చినగంజాం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : స్త్రీశక్తి పథకంతో మహిళలకు మేలు చేకూరుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు కావూరి శారదలు చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించినందుకు వెలుగు డీఆర్డీఏ ఆధ్వర్యంలో స్థానిక పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి మండల సమాఖ్య సభ్యులు సోమవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్‌లు రాయని ఆత్మారావు, చెరుకూరి రాఘవయ్య, టీడీపీ నాయకులు నందు శ్రీనివాసరావు, బెల్లంకొండ రమేష్‌బాబు, నరహరి శ్రీనివాసరావు, గుండ్రెడ్డి నరసింహారావు, పల్లపోలు శ్రీనివాసరావు, టీ.చిన్నా, ఏపీఎం గద్దె పెదసుబ్బారావు, సీసీలు కే వెంకటస్వామి, మాధవి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

రైలు పట్టాలపై వ్యక్తి మృతదేహం

- మృతుడు ఒంగోలు వాసిగా గుర్తింపు


రాంకుమార్ (ఫైల్)

చీరగుంట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): చీరగుంట రైల్వేసెక్షన్ పరిధిలోని తలమంచి-కొడవలూరు రైల్వేస్టేషన్ల మధ్య ఎగువ మార్గంలో సుమారు(54) ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని సోమవారం జీఆర్పీ పోలీసులు గుర్తించారు. అతని వద్ద లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా విచారించగా ఒంగోలుకు చెందిన నక్కా రాంకుమార్‌గా గుర్తించారు. ఆయన బోగోలు మండలం కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్ (విలేజ్ హెల్త్ క్లీనిక్, విశ్వనాథరావుపేట1)లో పనిచేస్తున్నట్లు బంధువుల సమాచారంతో నిర్ధారించారు. విధులకు హాజరయ్యేందుకు వెళుతూ ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారిపడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. రైల్లో నుంచి పడటం వలన మృతదేహం గుర్తుపట్టలేని రీతిలో ఉంది. రాంకుమార్‌కు భార్య ప్రసన్న, కుమార్తె, కుమారుడు ఉన్నారు.ఈ మేరకు జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు మేదరమెట్లలో విద్యుత్ వినియోగదారుల అదాలత్

అద్దంకి, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి డివిజన్ స్థాయి విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ మేదరమెట్లలో విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. మేదరమెట్లలోని అద్దంకి రోడ్డులో ఉన్న వెంకటేశ్వర ఫంక్షన్ హాలులో ఉదయం 10-30 గంటలకు అదాలత్ జరుగుతుందని తెలిపారు. విశ్రాంత జిల్లా జడ్జి, సీజీఆర్ఎఫ్ ఛైర్‌పర్సన్ విక్టర్ ఇమ్మానియేలు అధ్యక్షతన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. డివిజన్ పరిధిలో విద్యుత్ బిల్లుల్లో తేడాలు, లోఓల్టేజ్ సమస్యలు, ఇతరాలకు సంబంధించి దీర్ఘకాల సమస్యలపై వినతిపత్రాలు తీసుకుంటామని పేర్కొన్నారు. బాపట్ల జిల్లా ఎస్ఈ ఆంజనేయులు, ఇతర అధికారులు హాజరవుతారని తెలిపారు. ఈ అవకాశాన్ని అద్దంకి డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు.

అర్హుల పింఛన్లు రద్దు అయితే సంప్రదించాలి

బల్లికురవ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఎవరైనా అర్హత ఉండి పింఛన్లు రద్దు అయితే వెంటనే వారు మరో మారు చీరాల ఏరియా వైద్యశాలను సంప్రదించి తమ వద్ద ఉన్న సదరం సర్టిఫికెట్లను అందజేయాలని జిల్లా దివ్యాంగుల విభాగం ప్రధాన కార్యదర్శి దమ్ము అంజయ్య కోరారు. ఇప్పటికే కొందరు దివ్యాంగులకు పింఛన్లు రద్దు చేశామని అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారని తెలిపారు. వెంటనే తమ సర్టిఫికెట్లను పునఃపరిశీలన చేసుకొని వెంటనే ఎంపీడీవో కార్యాలయంలో అందజేస్తే తిరిగి పింఛన్లు మంజూరు చేస్తారని తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగింపు

మార్టూరు, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు యాజమాన్య పాఠశాలలోని 25 శాతం సీట్ల ప్రవేశాలకు దరఖాస్తుల తుదిగడువును ఈ నెల 20వతేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించిందని ఎంఈవో వస్రాం నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతేగాకుండా గతంలో ఒక పాఠశాల నుంచి ఒక కిలోమీటరు లోపల ఉన్న వారి దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకునేవారమని, ప్రస్తుతం 3 కిలోమీటర్లు లోపల వారికి కూడా ప్రవేశ అవకాశం కల్పించారని వివరించారు. అందుకు సంబంధించి సీఎస్ఈ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హులైన పేద, మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంప్‌లు

అద్దంకిటౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలలోని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల బయోమెట్రిక్ కోసం మంగళవారం నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో బత్తిన సింగయ్య ఒక ప్రకటన ద్వారా తెలిపారు. 19నుంచి 21వ తేదీ వరకు బొమ్మనంపాడు, తిమ్మాయపాలెం గ్రామాల్లో, 22న శంఖవరప్పాడు, చక్రాయపాలెం గ్రామాల్లో, 28 నుంచి 30వ తేదీ వరకు ధర్మవరం, మైలవరం గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు జరుగుతాయని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా రేణుకమ్మ వారి వార్షిక వేడుక

పంగులూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : పంగులూరులో బాచిన వారి వంశదేవర రేణుకమ్మ వారి 14వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రధానకూడలిలోని రేణుకమ్మతల్లి ఆలయం నుంచి మేళతాళాలతో పుట్టవద్దకు చేరుకుని శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం ఆలయంలో కొలువుదీరిన రేణుకమ్మ వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి పొంగళ్ళు, దద్దోజనం నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు డాక్టర్ బాక్టర్ బాచిన చెంచుగరటయ్య, చెంచుప్రసాద్‌తో పాటు బాచినవంశస్థులు, మహిళలు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న మహిళలు

ఒకచోట కళకళ.. మరోచోట విలవిల

ముంపు గ్రామమైన ధేనువకొండకు శాపం.. ఉమ్మనేనివారిపాలెంకు వరం...

గుండ్లకమ్మ ప్రాజెక్ట్ ముంపు గ్రామం కావడంతో మౌలిక వసతుల కల్పనకు అడ్డంకిగా నిబంధనలు

ధేనువకొండ పంచాయతీ పరిధిలోని ఉమ్మనేనివారిపాలేనికి దండిగా నిధులు ఖర్చు

సమస్యలతో విలవిల్లాడుతున్న నిర్వాసితులు

పునరావాస కాలనీలకు కొద్దిమందే తరలి వెళ్లిన వైనం


ఉమ్మనేనివారిపాలెంలో వేసిన అంతర్గత సీసీ రోడ్డు


తుమ్మ చెట్లతో మూసుకుపోయిన ధేనువకొండ రోడ్డు

అద్దంకి, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి) : ధేనువకొండ.. అద్దంకి మండలంలో అతి పెద్ద గ్రామం. ఆ గ్రామం పరిస్థితి ముందు నుయ్యి.. వెనక గొయ్యి అన్న చందంగా మారింది. ఆ గ్రామంలో గత 15 ఏళ్లుగా కనీస మౌలిక వసతుల కల్పన కూడా చేయలేని దుస్థితి. ఆ వివరాలేంటో చూద్దాం... గుండ్లకమ్మ రిజర్వాయర్ నిర్మాణంలో ధేనువకొండ ముంపు గ్రామంగా ఉండటంతో మౌలిక వసతుల కల్పనకు నిబంధనలు పెద్ద సమస్యగా మారాయి. ముంపు గ్రామమైనప్పటికీ పంట భూములు చాలా వరకు ముంపునకు గురికాలేదు. జీవనాధారమైన భూములను నమ్ముకునే వ్యవసాయం చేస్తున్నారు. గ్రామానికి సుమారు 25 కి.మీ దూరంలో మూడు పునరావాస కాలనీలను ప్రభుత్వం నిర్మించినా అక్కడకు రైతులు వెళ్లేందుకు ఇష్టపడటం లేదు.

మూలుగుతున్న కోటి రూపాయలు

గత 15ఏళ్లుగా ధేనువకొండ గ్రామ పంచాయతీకి వివిధ సందర్భాలలో 2 కోట్ల రూపాయల వరకు నిధులు మంజూరు కాగా, అందులో సుమారు కోటి రూపాయలతో ధేనువకొండ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఉమ్మనేనివారిపాలెంలో వెచ్చించి సీసీ రోడ్లు వేశారు. నివాస గృహాలు లేని రోడ్లను సైతం సీసీ రోడ్లుగా మార్చారు. సుమారు 150 మంది జనాభా ఉన్న ఉమ్మనేనివారిపాలెంలో పెద్ద ఎత్తున సీసీ రోడ్ల నిర్మాణం జరిగింది. ఇంకా కోటి రూపాయల నిధులు పంచాయతీలో మూలుగుతున్నాయి.

దక్షిణ ధేనువకొండ పునరావాస కాలనీలోనూ సమస్యలు

ఇంకొందరికి సమీపంలోని దక్షిణ ధేనువకొండ వద్ద పునరావాస కాలనీ ఏర్పాటు చేసినా కొద్దిమందికి మాత్రమే స్థలాలు కేటాయించారు. ఇంకా మౌలిక వసతుల కల్పన జరగలేదు. దీంతో ఆ పునరావాసకాలనీలో కూడా ఇళ్ల నిర్మాణం జరగలేదు. ముంపు గ్రామం పరిధిలో మొత్తం 4 వేల మంది జనాభా ఉండగా సుమారు వెయ్యి మంది మాత్రం అద్దంకి పట్టణానికి సమీపంలో ఉన్న రెండు పునరావాస కాలనీలకు వెళ్లారు.మిగిలిన మూడు వేల మంది జనాభా ధేనువకొండలోనే నివాసం ఉంటున్నారు.

ప్రస్తుతం ఉన్న గ్రామానికి సమీపంలో దక్షిణ ధేనువకొండ పునరావాస కాలనీ ఉండటం, భవిష్యత్‌లో ఆ ప్రాంతంలోనే ఎక్కువ మంది రైతులు నివాసాలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉండటంతో ఆ నిధులతో కనీసం పేరాయపాలెం నుంచి ధేనువకొండకు, ఉమ్మనేనివారిపాలెం నుండి ధేనువకొండలకు గ్రావెల్ లేదా తారు రోడ్లు నిర్మాణం చేసుకునే అవకాశం ఉంది.

మురుగుతో విలవిల

గ్రామంలో కనీసం సైడ్ డ్రైన్‌లు లేకపోవటం, మురుగు ఎక్కడికక్కడే నిలిచి ఉండటంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. కనీసం పారిశుధ్య పనులు, బ్లీచింగ్ చల్లటం లాంటి పనులైనా చేయాలని కోరుతున్నారు. అయినప్పటికి నేతలు, అధికారులు అటు వైపు దృష్టి సారించకుండా మిన్నకుండటం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధేనువకొండ పంచాయతీలో మూలుగుతున్న నిధులను అభివృద్ధి పనులకు వెచ్చించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. ముంపు గ్రామంగా ఉండటం ధేనువకొండకు శాపం కాగా అదే పంచాయతీలో ఉన్న అతి చిన్న గ్రామమైన ఉమ్మనేనివారిపాలేనికి మాత్రం వరంగా మారిందని గ్రామస్థులు చెబుతున్నారు.


ఉమ్మనేనివారిపాలెంలో వేసిన ప్రధాన సీసీ రోడ్డు

సీజనల్ వ్యాధులపై దృష్టి సారించాలి

బాపట్ల జిల్లా డీఎంహెచ్‌వో విజయమ్మ

పర్చూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వీటిపై ప్రత్యేక దృష్టిసారించాలని బాపట్ల జిల్లా డీఎంహెచ్‌వో విజయమ్మ చెప్పారు. సోమవారం కారంచేడు మండలం దగ్గుబాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. చెత్తా చెదారం పారిశుధ్యం లోపిస్తున్న తరుణంలో జిల్లా వ్యాప్తంగా సాధారణ జ్వరాలతోపాటు, టైఫాయిడ్, డెంగ్యూ వంటి వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శరత్, హెచ్ఎస్ సాయిప్రియ, టి.సుధాకర్ పాల్గొన్నారు.

గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలి

బల్లికురవ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో రెండు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయని అధికారులు వెంటనే పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీవో పాండురంగస్వామి చెప్పారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామాలలో దోమల సంచారం లేకుండా ముందస్తు జాగ్రత్తగా మురుగు నీరు లేకుండా చర్యలు చేపట్టాలని, అలానే సున్నం బ్లీచింగ్ చల్లించాలని చెప్పారు. కాలువల్లో వ్యర్థాలను తొలగించాలన్నారు.


సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌వో విజయమ్మ

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు రావినూతల విద్యార్థులు

మేదరమెట్ల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు రావినూతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 17వ తేదీన యోగాసన అసోసియేషన్, ప్రకాశం జిల్లా ఆధ్వర్యంలో ఆంధ్రకేసరి కళాశాలలో నిర్వహించిన యోగా పోటీలలో సబ్ జూనియర్ విభాగంలో రావినూతల జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థులు పి.అనుస్మిత, కే.శ్రీవల్లి, సీహెచ్ గీతాంజలి, పీ మౌనిష్, బీ జాహ్నవి ప్రథమ స్థానంలో నిలిచారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయురాలు కందే కళ్యాణిలను హెచ్ఎం రాఘవరెడ్డి, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ బుజ్జి, ఉపాధ్యాయులు అభినందించారు. వీరు ఈ నెల 21వ తేదీన తాడేపల్లిగూడెంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని హెచ్ఎం తెలిపారు. ఈ సందర్భంగా విజేతలకు పాఠశాల పూర్వ విద్యార్థులు తమ్మన హనుమంతరావు, పల్లపోతు రామాంజనేయులు రెండు వేలు నగదు బహుమతులను అందజేశారు.


ప్రథమ స్థానం సాధించిన రావినూతల హైస్కూల్ విద్యార్థులు

రైతులకు మెరుగైన సేవలు అందించటమే లక్ష్యం

సహకార సంఘం ఛైర్మన్ పోపూరి శ్రీనివాసరావు

పర్చూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అనునిత్యం అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించటమే లక్ష్యంగా కృషిచేస్తామని అడుసుమల్లి సహకార సంఘం(ఎల్ఎస్‌సీఎస్) ఛైర్మన్ పోపూరి శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం పర్చూరు మండల పరిధిలోని అడుసుమల్లి లార్జ్ సైజ్డ్ కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి కృష్ణ, మండలపార్టీ అధ్యక్షులు షేక్ షంషుద్దీన్, కొరిటాల సురేష్, టీడీపీ లీగల్ సెల్ ప్రతినిధి అడ్డగడ వేణు, మక్కెన శేఖర్‌బాబు పాల్గొన్నారు. నూతన పాలక మండలికి ఎల్ఎస్‌సీఎస్ (సీఈవో) దొప్పలపూడి రమాదేవి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఛైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో సొసైటీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అడ్డగడ్డ వెంకటేశ్వర్లు, కారుమంచి పాపారావు. సొసైటీ డైరెక్టర్లుగా మూకిరి సుబ్బయ్య, అన్నవరపు శ్రీనివాసరావు(వాసు) పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న సొసైటీ ఛైర్మన్, డైరెక్టర్లు

కనక నాగవరపమ్మ దేవస్థానం కమిటీ ఛైర్మన్‌గా ఆంజనేయులు

చినగంజాం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం రావూరిపేట గ్రామంలో వేంచేసి యున్న కనక నాగవరపమ్మ అమ్మవారి దేవస్థానం ధర్మకర్తల మండలి నూతన కమిటీ ప్రమాణ స్వీకారం సోమవారం ఘనంగా జరిగింది. నూతన ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా వలేటి ఆంజనేయులు, ధర్మకర్తలుగా గోవిందు సుబ్బారావు, గుత్తి వీరప్రసాదరావు, చప్పటి వెంకటరావు, ఆతిన రమేష్, యర్రా శివ నాగమల్లేశ్వరి, చుండి శ్రీలక్ష్మి, ద్రోణాదుల సుబ్బాయమ్మ, కంచర్ల భిక్షాలు ఎంపికచేసిన విషయం తెలిసిందే. కనక నాగవరపమ్మ దేవస్థాన ప్రాంగణంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వేణుగోపాల్‌రావు నియమితులైన నూతన ధర్మకర్తలతో ప్రమాణ స్వీకారం చేయించారు.

నూతనంగా ఎంపికైన ధర్మకర్తల మండలి ఛైర్మన్, సభ్యులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో చీరాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కౌతవరపు జనార్దన్, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు యార్లగడ్డ లక్ష్మి, టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షులు దేవతోటి సుందరయ్య, ఈవో పోతిన శ్రీనివాసరావులు పాల్గొన్నారు.


అమ్మవారి దేవస్థానం కమిటీ సభ్యులు

రూపురేఖలు మారుతున్న లంబాడీడొంక రోడ్డు


రోడ్డును చదును చేస్తున్న వాహనం

సంతమాగులూరు ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మక్కెనవారిపాలెంలోని లంబాడీ డొంక అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తవుతున్నాయి. రూ.25 లక్షలతో చేపట్టిన ఈ నిర్మాణం పనులు సోమవారం నాటికి 50శాతానికి పైగా పూర్తయ్యాయి. సుమారు రెండున్నర కిలోమీటర్లు వరకు ఈ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. వర్షం సైతం లెక్కచేయకుండా పనులు చేస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో నిర్మాణం పూర్తిచేసి రైతులకు అందుబాటులో తీసుకొస్తామని అధికారులు తెలిపారు.

అవీఇవీ

బాపట్ల జిల్లాకు దుగ్గిరాల పేరును చేర్చాలి

ఆర్డీవోను కలిసిన వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు


వాకర్స్‌తో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లాకు స్వాతంత్ర్య సమర యోధులు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పేరును చేర్చాలని చీరాల వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. చీరాల - పేరాల ఉద్యమ సమయంలో గోపాలకృష్ణయ్య కష్టాన్ని, పోరాట పటిమను వివరించారు. మహనీయులకు గౌరవం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, తదితర ప్రతినిధులు ఉన్నారు.

కోలలపూడి స్కూలుకు దాత రూ.10 లక్షలు విరాళం

మార్టూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలలపూడి గ్రామంలో జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేయడానికి గది నిర్మాణానికి పూర్వ విద్యార్థి, ఎన్ఆర్ఐ కందిమళ్ల వేణుబాబు 10 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. కోలలపూడి గ్రామానికి చెందిన ఆయన అమెరికాలో డాక్టరుగా వైద్య సేవలను అందిస్తున్నారు. ఈ మేరకు సోమవారం జడ్పీ హైస్కూల్‌లో గది నిర్మాణానికి గ్రామస్థులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ సతీష్‌కుమార్, ఎంఈవో వస్రాంనాయక్ లు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో బెజవాడ రామకృష్ణయ్య, సాదినేని హనుమంతరావు, కందిమళ్ల ఆంజనేయులు, కందిమళ్ల రామకోటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బ్రహ్మయ్య, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, ఉపాధ్యాయులు రవి, కరిముల్లా, వీరాస్వామి పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థికి రోటరీ క్లబ్ ఆర్థిక సాయం


విద్యార్థికి ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థికి ఆర్థికసాయం అందించారు. పట్టణంలోని గానుగపాలెంకు చెందిన పఠాన్ అఫ్రిదిఖాన్‌కు రోటరీ మాజీ అధ్యక్షుడు ఊటుకూరి రామకోటేశ్వరరావు సౌజన్యంతో 20 వేల రూపాయలు ఆర్థికసాయం అందించినట్లు క్లబ్ అధ్యక్షుడు బాచిన శివధర పూర్ణచంద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి ఆళహరి హరిప్రసాద్, ట్రెజరర్ తమ్మన శ్రీనివాసరావు, లేవి ప్రసాద్, వీరయ్య, పి. రామకోటేశ్వరరావు, అంజాద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జమియత్ ఉలామా ఎన్నికలు



ఎన్నికలు నిర్వహిస్తున్న పెద్దలు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం జమియత్ ఉలామా మండల ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. మత పెద్దలు ముఫ్తీఅబ్దుల్లా ఎన్నికలు పర్యవేక్షించారు. అనంతరం నూతన కమిటీ ముస్లిం సమాజ సంక్షేమం, విద్యాభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం పాటు పడాలని సూచించారు. ఉపాధి అవకాశాలు మెరుగు పరిచి ఆర్థిక భరోసా కల్పించాలని సూచించారు.

తహసీల్దార్‌ని సన్మానించిన కమిటీ సభ్యులు


తహసీల్దార్ ప్రభాకరరావుని సన్మానిస్తున్న సభ్యులు

చినగంజాం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావుని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీస్ ఐక్య వేదిక కమిటీ సభ్యులు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు జ్యోతి రమేష్‌బాబు మాట్లాడుతూ తహసీల్దార్ ప్రభాకరరావు గతంలో పొదిలి, అద్దంకి, మర్రిపూడి, చీరాల, పర్చూరు తదితర ప్రాంతాల్లో పని చేసి ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. ఈ నెల 15న జరిగిన స్వాతంత్ర వేడుకలలో తహసీల్దార్ ప్రభాకరరావు అవార్డు అందుకోవడంతో వేదిక ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో నేతలు తెలగతోటి రాధాకృష్ణమూర్తి, జ్యోతి డేవిడ్, జైభీమ్ చంటిబాబు, కొమ్మాలపాటి బుజ్జి, ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా కాంతారావు, మదర్సా ప్రిన్సిపాల్ సయ్యద్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న టీడీపీ నేతలు

అద్దంకి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చక్రాయపాలెంలో ఎన్‌టీఆర్ విగ్రహం ఏర్పాటుకు టీడీపీ నాయకులు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు రాయుడు నరేంద్రబాబు, గోగులమూడి రాజశేఖర్, మలిపెద్ది రవీంద్రబాబు, వంకాయలపాటి కోటేశ్వరరావు, మేడిద హనుమంతరావు, గొల్ల వెంకటరావు, గొట్టిపాటి సత్యనారాయణ, గుమ్మడి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



పైపులే నివాసాలు

● వర్షంలో వలస వాసుల కష్టాలు

ఎడతెరపిలేని వర్షంతో వలస వాసులు కష్టాలు పడుతున్నారు. నూజివీడు ప్రాంతానికి చెందిన ఐదు కుటుంబాలు చంటి బిడ్డలతో కలిసి ఇనుప మంచాలు, కుర్చీలు ఊరూరా విక్రయించేందుకు వారం రోజుల క్రితం ఉదయగిరి పట్టణానికి వచ్చారు. స్థానిక వైఎస్ఆర్ సర్కిల్ వద్ద చెట్లను నివాసాలు చేసుకుని వ్యాపారం సాగిస్తున్నారు. అయితే గత నాలుగు రోజులుగా ఎడతెరిపిలేని చిరుజల్లులు పడుతుండడంతో వారి కష్టాలు వర్ణనాతీతంగా మారుతున్నాయి. వర్షం కారణంగా వ్యాపారం లేకపోవడంతో పూట గడవడమే కూడా కష్టమైందని, చంటిబిడ్డలతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వర్షానికి అక్కడే ఉన్న నీటి పైపులే నివాసాలుగా మార్చుకుని సేదతీరుతున్నారు. చెట్ల కింద గాలికి, వర్షానికి పొయ్యి మీద వంట చేసుకుంటూ అరకొరగా ఆకలి తీర్చుకుంటున్నారు. దాతలు ఎవరైనా స్పందించి తమకు బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని వేడుకుంటున్నారు.

- ఉదయగిరి (ఆంధ్రజ్యోతి)

నాడు విధ్వంసం.. నేడు పర్యాటక సుమం

ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు 2010లో పట్టణంలోని ఆనకట్ట సమీపం లో సుమారు రూ.10 లక్షల వ్యయంతో అతిథిగృహం, హోటల్ నిర్వహణకు భవనాలు నిర్మించారు. నాటి నుంచి ఆ భవనాలు ప్రారంభోత్సవానికి నోచుకోకుండానే అద్దాలు ధ్వంసమై చిల్లచెట్లు పెరిగి మూగజీవాలకు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వం ఆ భవనా లను పూర్తిగా గాలికొదిలేయడంతో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక భవనాలను వాడుకలోకి తీసుకు రావాలని అధికారులను ఆదేశించింది. అందులో భాగంగా పర్యాటక శాఖ అధికారులు ఆ భవనాలను అద్దె ప్రాతిపదికన ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చేందుకు ప్రకటన ఇవ్వడంతో ఓ వ్యక్తి వాటిని దక్కించుకు న్నాడు. ఈ క్రమంలో అతను చిల్లచెట్లను తొలగించి భవనాలకు రంగులుదిద్ది, పగలిన అద్దాల స్థానం లో కొత్త అద్దాలు ఏర్పాటుచేసి హోటల్ నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ చర్యల తో శిథిలావస్థకు చేరిన భవనాలు వాడుకలోకి వస్తున్నాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఉదయగిరి (ఆంధ్రజ్యోతి)



నాడు



నేడు

నేతాజీని మరిచారు!



ఉదయగిరి రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): దేశం స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన మహోన్నత వ్యక్తి నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని విస్మరించడం బాధాకరమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం నేతాజీ వర్ధంతి కాగా మండలంలోని గండిపాళెం గ్రామ ప్రధాన వీధిలో రహదారికి ఆనుకొని ఉన్న విగ్రహం వైపు ఏఒక్కరూ కన్నెత్తి చూడకపోవడం, కనీసం ఆయన చేసిన పోరాటాలను స్మరించుకుంటూ పూలదండ కూడా వేసిన పాపాన పోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పీతలు పెంచుదాం!

ఆక్వా రైతులకు రొయ్యల పెంపకంలో ఎదురయ్యే సమస్యలకు ప్రత్యామ్నాయంగా పీతల పెంపకాన్ని నిపుణులు సూచిస్తున్నారు. రొయ్యల సాగులో మన జిల్లా ఇప్పటికే ప్రత్యేక గుర్తింపు పొంది ఉంది. అదేవిధంగా పీతల సాగుకు కూడా ఇది అనుకూలమైన ప్రాంతంగా అధికారులు చెబుతున్నారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో ఇప్పటికే పీతల పెంపకం సాగుతోంది. థాయిలాండ్, తైవాన్, ఫిలిప్పైన్స్, ఇండోనేషియా, మలేషియా, సింగపూర్ దేశాల్లో పీతల పెంపక వ్యాపారం ఎప్పటి నుంచో ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలోనూ పీతల పెంపకాన్ని అధికారులు ప్రోత్సహిస్తున్నారు. మన ప్రాంతంలో సిల్లా సెర్రేటా, సిల్లా ఒలివేషియా అనే రెండు రకాల బురద పీతలను పెంపకానికి అందుబాటులో ఉంచారు. వాటి వివరాలు తెలుసుకుందాం....

- ● లాభదాయకంగా సాగు ● రెండు రకాలు అనుకూలం
- ● రొయ్యల సాగుకు ప్రత్యామ్నాయం
- ● ఆశాజనకంగా ధరలు
- ● దేశవిదేశాలకు ఎగుమతి అవకాశం

దాణా ఇలా..

పీతల పెరుగుదల మెరుగయ్యే ఆహారాన్ని దాణాగా అందించాల్సి ఉంటుంది. పీతలు ప్రధానంగా మాంసాహారులు కాబట్టి చిన్న చిన్న నత్తలు, రొయ్యపిల్లలు, చిన్న చేపలు తదితరాలను ఆహారంగా తీసుకుంటాయి. ఈ క్రమంలో ఎండు చేపలు, నత్తమాంసాన్ని ఆహారంగా అందించాలి. పీత సైజును బట్టి 5 నుంచి 10 శాతం ఆహార పరిమాణం ఉండేలా చూసుకోవాల్సి ఉంటుంది. ట్రేల ద్వారా నీటిలో ఉంచడం, తాళ్లతో వేలాడదీయటం, చల్లడం ద్వారా ఆహారాన్ని అందించవచ్చు.

ధరలు భళా..

కిలో బరువున్న పీతల ధర మార్కెట్లో రూ1200 వరకు ధర పలుకుతోంది. కిలో కన్నా ఎక్కువ బరువుంటే రూ.1500 నుండి రూ.2 వేల వరకు ధర పలుకుతాయి. ఇలా ఆశాజనకమైన ధరకుతోడు స్థానికంగా, ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి చేసుకునే అవకాశమూ ఉంది.



సిల్లా సెర్రేటా

ఈ రకం పీతలను గుర్తించాలంటే వాటి లక్షణాలు తెలుసుకోవాలి. వాటి కాళ్ళమీద పాలిగోనల్ గుర్తులు, మణికట్టు మీద రెండు పదునైన ముళ్ళు, పీత పైడొప్ప భాగం లేత ఆకుపచ్చ నుండి ముదురు ఆకుపచ్చ రంగు కలిగి ఉంటుంది. వీటిని మన వాడుక భాషలో ఆకుపచ్చ పీతలు అంటారు. ఇవి దాదాపు 2.5 కిలోల వరకు బరువు పెరుగు తాయి. అత్యధికంగా వీటినే పెంచుతారు. 80 నుంచి 100 గ్రాముల బరువు గల పీతల పెంపకం చేపడితే నాలుగు నెలల్లో 400 నుండి 500 గ్రాముల వరకు బరువు పెరుగు తాయి. ఏడు నెలల్లో 800 నుండి 1000 గ్రాముల బరువు పెరుగుతాయి.

నీటి యాజమాన్యం

పీతల పెంపకంలో నీటి యాజమాన్యం అత్యంత కీలకం. తరచూ నీటిని మార్చడం మంచిది. తద్వారా నీటిలోని కాలుష్యం తగ్గి పీతల ఎదుగుదలకు దోహదపడుతుంది. నీటి గాఢత 10 నుండి 35, ఉదజని 7.5 నుంచి 8.5 వరకు ఉండేలా చూసుకోవాలి. ఉష్ణోగ్రత 25 నుంచి 30 డిగ్రీలు, ప్రాణవాయువు 4 పీపీఎం కంటే ఎక్కువ ఉండేలా గమనించుకోవాలి. అప్పుడప్పుడు పీతల బరువును తూచి పెరుగుదలను పరిశీలించాలి.

జాగ్రత్తలు అవసరం

పీతలు పెంచే చేరువు గట్టు మీద 10 నుండి 20 ఎంఎం గల వలను ఏర్పాటు చేసుకోవాలి. తద్వారా పీతలు బయటకు వెళ్లకుండా నివారించవచ్చు. ఇవి స్వయం భక్షక లక్షణం కలిగి ఉన్నందున అప్పుడే గుల్ల విడిచిన పీతలకు ఇతర పీతల నుంచి ప్రమాదం పొంచి ఉంటుంది. దీనిని అధిగమించడానికి హైడౌట్లు ఏర్పాటు చేసుకోవాలి. పీవీసీ పైపులు, సిమెంట్ పైపులు, పెంకులు వంటివి చెరువుల్లో ఏర్పాటు చేసుకోవాలి. పీతలు పట్టే సమయంలో వాటి కాళ్లు విరిగిపోకుండా జాగ్రత్త వహించాలి, లేకపోతే బరువు, ధర తగ్గే అవకాశం ఉంటుంది.



సిల్లా ఒలివేషియా



ఈ జాతి పీతలు ఒకే ఒక్క ముల్లు కలిగి ఉండడం, డొప్ప పైరంగు ఆకుపచ్చ రంగుతో కూడిన ముక్కుపొడి రంగులో ఉంటుంది. కింది భాగంలో ఉన్న కాళ్లు ముదురు ఎరుపు రంగుగానీ, గులాబీ రంగుతో కూడిన ఎరుపు రంగులోగానీ ఉంటాయి. దాదాపు 700 గ్రాముల వరకు బరువు పెరుగుతాయి.

- అల్లూరు,(ఆంధ్రజ్యోతి)

శిక్షణ, ప్రోత్సాహం అందిస్తాం : షేక్ చాంద్‌బాషా , మత్స్య శాఖ ఏడీ



రొయ్యల పెంపకంలో నష్టపోతున్న రైతులు పీతల పెంపకంపై దృష్టిపెట్టాలి. దీనిపై సంపూర్ణ అవగాహనతో పెంపకం చేపడితే అత్యంత ఆదాయం పొందే అవకాశం ఉంటుంది. తెల్లమచ్చ సమస్య తప్ప ఇతర సమస్యలు లేకపోవడంతో పెంపకం సులభం. మార్కెట్లో డిమాండ్, ఆశాజనకంగా ధరలు ఉన్నారు. ఆక్వా రైతులకు ఇది ఒక ఆర్థిక వనరుగా ఉపయోగపడుతుంది. మత్స్యశాఖ తరపున పీత పిల్లలను తమిళనాడు తెప్పించి సాగుదారులకు అందిస్తాం. పిల్లల ధర కిలో రూ.700 వరకు ఉంటుంది. ఒక కిలోకు 200 నుంచి 300 వరకు పిల్లలు వస్తాయి. వీటికి ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ ఇస్తోంది. ఒక హెక్టారులో సాగుకు సుమారు రూ.6లక్షల వరకు పెట్టుబడి అవసరం. 8 నెలల్లో మూడింతల ఆదాయం పొందవచ్చు. పీతల సాగుకు రైతులు ముందుకు వస్తే వారికి అవసరమైన శిక్షణ, సలహాలు, సూచనలు అందిస్తాం.

పెంపకం విధానాలు

● **బాహ్య పెంపకం :** ఈ విధానంలో తీరప్రాంతంలోని ఇసుక నేలల్లోగానీ, మట్టినేలల్లోగానీ ఏర్పాటు చేసిన చెరువుల్లో పీతలు పెంచుతారు. 0.5 హెక్టార్ల చిన్న చెరువులను పెంపకానికి ఎంపిక చేసుకోవచ్చు. వీటిలో పీతలను 4 నుంచి 6 నెలలు పెంచి 500 గ్రాములు పైబడిన వాటిని విక్రయించుకోవచ్చు.

● **చెరువు తయారీ..:** మంచి పీతల పంట తీయటానికి చెరువు తయారీ చాలా ముఖ్యమైన అంశం. చెరువును ఎండబెట్టిన తరువాత దున్ని నేల ఉదజని సూచికను బట్టి సున్నం వినియోగించాలి. తద్వారా చెరువులో ఉన్న పరభక్షకాలు, హాని చేసే సూక్ష్మజీవులు, ఇతర మేత పోటీదారులు నశిస్తాయి. అంతే కాకుండా నేలలోని విష ప్రభావం తగ్గుతుంది. ఒక ఎకరం చెరువులో క్రాబ్‌లెట్స్ అయితే 700 నుంచి 1000 వరకు, 70 నుంచి 100 గ్రాముల బరువున్న పీతలైతే 300 నుండి 350 వరకు పెంపకం చేపట్టవచ్చు.

● **ఫేటనింగ్ :** ఈ విధానంలో పెంపకం అంటే పీతలు గుల్ల విడిచిన తరువాత వాటిని చెరువుల నుంచి సేకరించి వేరొక చోట బాక్సుల్లోగానీ చెరువుల్లోగానీ ఉంచి మేతను అందిస్తారు. వాటి పెంకు గట్టిపడేంతవరకు 3 నుంచి 4 వారాలు పెంచుతారు. 150 గ్రాముల నుంచి 500 గ్రాముల బరువు కలిగిన గుల్ల విడిచిన పీతలు 3 నుంచి 4 వారాల్లో 250 నుంచి 650 గ్రాముల బరువు పెరుగుతాయి. ఈ ఫేటనింగ్ పద్ధతికి 0.1 నుంచి 0.2 హెక్టార్ల విస్తీర్ణం కలిగిన చెరువులనుగానీ హెచ్‌డీపీపీ బాక్సులను వినియోగిస్తారు. ఒక్కొక్క పీతకు ఒక్కొక్క బాక్సును ఏర్పాటు చేస్తారు. చెరువుల్లో అయితే ఒక చదరపు మీటరుకు ఒకటి, రెండు పీతలు పెరిగేలా వదులుకోవలసి ఉంటుంది. ఈ విధానాన్ని తక్కువ ఖర్చుతో లాభదాయకమైనదిగా పరిగణిస్తారు.

ఎస్పీ పీజీఆర్ఎస్‌కి 78 వినతులు



ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన ఎస్పీ పీజీఆర్ఎస్‌కి జిల్లావ్యాప్తంగా 78 మంది బాధితులు తరలి వచ్చి వారి సమస్యలపై వినతులు సమర్పించారు. ఎస్పీ జీ. కృష్ణకాంత్ ఫిర్యాదులను స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఫిర్యాదులను ఎస్పీతోపాటు నగర డీఎస్పీ సింధుప్రియ, వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు స్వీకరించారు. అందిన ఫిర్యాదుల్లో కొన్ని..

● తన కుమారులు ఇంటి నుంచి తరిమేశారని, రాత్రిపూట బస్టాండ్‌లో పడుకుంటున్నానని, తినడానికి తిండి కూడా లేదని కావలికి చెందిన ఓ వృద్ధురాలు కన్నీరు పెట్టుకుంది. కొడుకు, కోడలు పట్టించుకోవడం లేదని, విచారించి న్యాయం చేయాలని ఆమె ఎస్పీని కోరింది.

● ఉన్న ఆస్తిని మొత్తం రాయించుకొని తన చిన్న కుమారుడు ఇంటి నుంచి గెంటివేశాడని, కొట్టి వేధిస్తున్నాడని, విచారించి న్యాయం చేయాలని నగరంలోని సంతపేటకు చెందిన ఓ వృద్ధురాలు వేడుకొంది.

● తన భర్త చెడు వ్యసనాలకు బానిసై ఇంట్లో ఉన్న వస్తువులు, బంగారు నగలు అమ్మేశాడని, పిల్లల పోషణ కూడా కష్టంగా ఉందని నెల్లూరుకి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేసింది. విచారణ చేసి న్యాయం చేయాలని కోరింది.

● ముత్తుకూరుకి చెందిన ఓ వ్యక్తి కుమారుడు అనుమానాస్పదంగా మరణించాడని, కేసు నమోదు చేశారని సమగ్రంగా విచారణ జరిపి తన కుమారుడు మరణానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని తండ్రి కోరారు.

● ఉదయగిరికి చెందిన మహిళను అదే ప్రాంతానికి చెందిన వెంకట్‌కుమార్ ప్రేమపేరుతో పరిచయం పెంచుకొని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఇప్పుడు పెళ్లికి నిరాకరిస్తున్నాడని బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. సోషల్ మీడియాలో ఫొటోలు అప్లోడ్ చేసి ఇబ్బంది పెడుతున్నాడని, విచారించి న్యాయం చేయాలని ఆ మహిళ కోరింది.

● నెల్లూరు వేదాయపాలెంకు చెందిన ఓ మహిళకు 15 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. ఆత్మకూరుకి చెందిన దుర్గాభవానీ అనే మహిళ ఇన్స్టాగ్రామ్‌లో తన కుమారుడితో పరిచయం పెంచుకొని బలవంతంగా పెళ్లి చేసుకున్నదని ఆమె ఫిర్యాదు చేసింది. ఆ మహిళపై చర్యలు తీసుకొని తన కుమారుడిని తనకు అప్పగించాలని ఆ మహిళ కోరింది.

పీజీఆర్ఎస్ అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం); ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : పీజీఆర్ఎస్‌కి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవా రం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానంగా భూ సమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు. వాటిని పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, ప్రజలు సంతృప్తి చెందేలా మెరుగైన పరిష్కారం చూపాలన్నారు. అర్జీల స్వీకరణలో డీఆర్వో హుస్సేన్ సాహెబ్, జడ్పీ సీఈవో మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్

● **అందిన వినతులు 426**

పీజీఆర్ఎస్‌కు సోమవారం 426 వినతులు వచ్చాయి. వీటిలో రెవెన్యూశాఖవి 129, సర్వేశాఖవి 34, మున్సిపల్‌శాఖవి 31, మిగిలినవి వివిధ శాఖలకు సంబంధించినవి.

● **గోడపత్రిక ఆవిష్కరణ**

దేశసేవ నుంచి పల్లె సేవలో భాగంగా కేంద్రీయ సైనిక్ బోర్డు, రాష్ట్ర సైనిక్ బోర్డు కలిసి జిల్లా సైనిక బోర్డుద్వారా జిల్లాలోని సైనికులకు కోరమండల్ కంపెనీ ద్వారా డ్రోన్స్‌పై ప్రత్యేక శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను కలెక్టర్ ఆనంద్ తిక్కనభవన్‌లో ఆవిష్కరించారు. ఈ అవకాశాన్ని మాజీ సైనికులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ రంగానికి ప్రాధాన్యం

● ఇతోధికంగా రుణాలిస్తాం : బీవోఐ జీఎం ఉన్నికృష్ణన్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : ఎంఎస్ఎంఈ రంగానికి ప్రథమప్రాధాన్యతను ఇచ్చి ఇతోధికంగా రుణాలు అందచేస్తున్నామని బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీవోఐ) జనరల్ మేనేజర్ జీ. ఉన్నికృష్ణన్ తెలిపారు. సోమవారం నగరంలోని ఒక హోటల్ సమావేశ మందిరంలో ఆ బ్యాంకు ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ రంగాన్ని ప్రోత్సాహిస్తోందన్నారు. తమ బ్యాంకు ద్వారా ఎంఎస్ఎంఈ రంగంతోపాటు ఇతర అన్నిరకాల రుణాలు అందచేస్తున్నదన్నారు. తమ బ్యాంకు రూ.15లక్షల కోట్ల వ్యాపారం చేస్తున్నదని వివరించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి రూ.16లక్షల కోట్ల వ్యాపారాన్ని అధిగమించనున్నదని చెప్పారు. అత్యధిక వడ్డీని అందించే అనేక పథకాలు తమ బ్యాంకులో ఉన్నాయని ఆయన వివరించారు. సులభంగా తమ బ్యాంకు ద్వారా రుణాలు పొందవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఖాతాదారుల సందేహాలకు ఆయన సమాధానం ఇచ్చారు. విజయవాడ జోనల్ మేనేజర్ ఎంవీవీ బంగార్రాజు బ్యాంకు ఆఫ్ ఇండియా సేవలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎస్ఎంఈసీఎల్ సమీరన్, నెల్లూరు మెయిన్ బ్రాంచి చీఫ్ మేనేజర్ సందీప్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీవోఐ జనరల్ మేనేజర్ ఉన్నికృష్ణన్

జీజీహెచ్‌లో బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి

● గుండెనొప్పి అనడంతో జైలు నుంచి వైద్యశాలకు..



నెల్లూరు(క్రైం) ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రుస్తుం మైనింగ్ కేసులో నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి సోమవారం సాయంత్రం నెల్లూరు జీజీహెచ్‌లో చేరారు. గుండె నొప్పిగా ఉందని ఆయన చెప్పడంతో జైలు అధికారులు పోలీసు బందోబస్తు మధ్య ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు 2డీ ఎకో పరీక్షలు నిర్వహించి హార్ట్‌బీట్ తక్కువగా ఉందని చెప్పినట్లు సమాచారం. ప్రస్తుతానికి శ్రీకాంత్‌రెడ్డి ఆరోగ్యం నిలకడగానే ఉందని, గుండె వైద్య నిపుణుల పర్యవేక్షణలో క్యాథ్‌లాబ్ పరీక్ష నిర్వహించాల్సి ఉందని జైలు అధికారులకు వైద్యులు వివరించారు. దీంతో శ్రీకాంత్‌రెడ్డిని తిరిగి జైలుకు తీసుకువచ్చారు. రెండు రోజుల్లో తిరుపతి రుయాకు తరలించి, వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు.

50శాతం రిజర్వేషన్ల అమలు కోసం ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీఎస్పీ నాయకులు

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బహుజన సమాజ్ పార్టీ నాయకులు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జానకీప్రసాద్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు 2012లో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీప్రకారం, 2014 ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరచిన విధంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ధర్నాలో నాయకులు ఆర్. పురు షోత్తం, శ్రీరామ్, కే. అశోక్, శివభాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమాధికారి బదిలీ


నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా గిరిజన సంక్షేమాధికారిగా పనిచేస్తున్న పీటీకే పరిమళను అల్లూరు సీతా రామరాజు జిల్లా పాడేరు గిరిజన సంక్షేమ శాఖ డీడీగా నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

విద్యుదాఘాతానికి యువ రైతు బలి



సురేష్‌రెడ్డి (ఫైల్)

జలదంకి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పొలంలో దుక్కి చేసేందుకు ట్రాక్టర్ తీసుకెళ్లిన యువరైతు విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తపాలెంలో సోమవారం జరిగింది. వివరాల మేరకు.. కొత్తపాలెంకు చెందిన యువరైతు గునుపాటి సురేష్‌రెడ్డి(35) పొలంలో దుక్కి దున్నేందుకు ట్రాక్టర్ తీసుకుని వెళ్లాడు. ముందుగా కూరగాయల తోటకు సాగునీరు పెట్టేందుకు విద్యుత్ మోటారు వేసి పక్కన పొలంలో దుక్కి దున్నడం ప్రారంభించాడు. మధ్యలో మోటారు పంపు ద్వారా నీరు రావడం నిలిచి పోవడాన్ని గమనించిన ఆయన ఏమైందో చూడడానికి ట్రాక్టర్‌ను నిలిపివేసి మోటారు వద్దకు వెళ్లేందుకు పంటకాలువ దాటుతుం డగా అదుపుతప్పి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మ ర్‌పై పడ్డాడు. దీంతో విద్యుత్‌షాక్‌కు గురై ట్రాన్స్‌ఫార్మర్‌కు అతుక్కుపోయాడు. ఈ ఘటనను గమనించిన చుట్టుపక్కల పొలాల్లో రైతులు అక్కడకు చేరుకుని పరిశీలించగా అప్పటికే సురేష్‌రెడ్డి మృతి చెందాడు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలియజేసి మృతదేహాన్ని ఆయన ఇంటికి చేర్చారు. ఉదయాన్నే పొలానికి వెళ్లి శవమై ఇంటికి వచ్చిన సురేష్‌రెడ్డిని చూసి తల్లిదండ్రులు, భార్యతో పాటు బంధువులు శోకసముద్రంలో మునిగిపోయారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు.



1 నుంచి ఎస్టీల కోసం ప్రత్యేక ఆధార్ శిబిరాలు

● వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్టీల కోసం సెప్టెంబరు 1 నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ చెప్పారు. కలెక్టరేట్‌లోని శంకరన్‌హాల్ నుంచి ఆయన వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో ఇప్పటి వరకు నిర్వహించిన ఆధార్ శిబిరాల ద్వారా, ఆరు వేలమందికి ఆధార్‌కార్డులను మంజూరు చేశామని తెలిపారు.

స్వామీ నువ్వే దిక్కు!

● శివుడికి, పోలేరమ్మకు కరేడు వాసుల వేడుకోలు

● ఉద్రిక్తతల నడుమ 'చలో కరేడు' ● రైతు, ప్రజాసంఘాల నాయకుల అరెస్ట్



శివాలయంలో పూజలు చేస్తున్న కరేడు వాసులు



వలేటివారిపాళెం పోలీస్‌స్టేషన్‌లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు కేశవరావు తదితరులు

ఉలవపాడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : 'శివయ్యా.. మా గ్రామం చల్లగా ఉండాలి. ఇండో సోల్ సోలార్ కంపెనీ ఇక్కడ నుంచి వెళ్లిపోవాలి. పోలీస్ 30 యాక్ట్ ఎత్తివేయాలి.' అంటూ కరేడు రైతులు, గ్రామస్థులు ముక్కంటీశ్వరుడు, పోలేరమ్మకు మొరపెట్టుకున్నారు. గ్రామంలో భూసేకరణను వ్యతిరేకిస్తూ రైతు సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నేతలు సోమవారం తలపెట్టిన 'చలో కరేడు' ఉద్రిక్తతల మధ్య ముగిసింది. సోమవారం ఉదయం స్థానిక రైతులు, గ్రామస్థులతో కలిసి కరేడు శివాలయంలో ప్రదక్షిణలు చేశారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఓ వినతిపత్రాన్ని స్వామివారి వద్ద ఉంచి వేడుకున్నారు. అనంతరం ర్యాలీగా పోలేరమ్మ రాళ్ల వద్దకు చేరుకుని పూజలు చేసి, తమను కాపాడాలని మొక్కుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో ఉద్యమ నేతలు మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో విలువైన భూములు దోచుకునే కంటే పడమర ప్రాంతంలో భూములు అందుబాటులో ఉన్నాయని వాటిలో కంపెనీలను పెట్టి అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కే ప్రభాకర్‌రెడ్డి, రైతుకూలి సంఘం రాష్ట్ర నాయకుడు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు శివనాగరాణి, సామాజిక కార్యకర్త వసుంధర, హైకోర్టు న్యాయవాది శ్రీదేవి, ఇతర సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


● ఉద్యమ నేతల అరెస్టు

కరేడులోకి వెళ్లేందుకు ప్రయత్నించిన ప్రజా సంఘాలు, రైతు కూలీ సంఘం నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని కందుకూరు, వలేటివారిపాలెం, లింగసముద్రం పోలీస్‌స్టేషన్లకు తరలించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, రాజమోహన్, ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కేశవరావులతోపాటు సుమారు 80 మంది కరేడు ర్యాంపు వద్ద పోలీసుల వలయం నుంచి గ్రామంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు. వలేటివారిపాళెంలో కేశవరావు, శ్రీనివాసరావు తదితరులు పోలీస్‌స్టేషన్ నుంచి బస్టాండు సెంటరు వరకు ర్యాలీ చేశారు.



నేడు, రేపు వర్షాలు

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సోమవారం చిరుజల్లులు కురిశాయి. మంగళ, బుధవారాల్లో కూడా వర్షం కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణశాఖ తెలిపింది. ఆంధ్రప్రదేశ్-దక్షిణ ఒడిస్సా తీరంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం, దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని తెలిపింది. ఇది రాబోయే 12 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో దక్షిణ కోస్తాలో తేలికపాటి నుంచి భారీవర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది.



'సోమశిల'లో నీటి నిల్వ

అనంతసాగరం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి 24,961 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. డ్యాంలో 49.066 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1,820, ఉత్తర కాలువకు 340, కండలేరుకు 8,350 క్యూసెక్కుల చొప్పున సరఫరా చేస్తున్నారు.

● కండలేరులో..

రాపూరు : కండలేరు డ్యాం నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా ప్రస్తుతం 28.59 క్యూసెక్కుల నీరు ఉన్నట్టు ఏఈ అనీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 7,160 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 1,985 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో ఉంది.



సర్వభూపాల వాహనంపై ఊరేగుతున్న వెంకయ్యస్వామి

గొలగమూడిలో ఉత్సవ సంబరం

వెంకయ్య స్వామి ఆరాధనోత్సవాల ప్రారంభం

తొలిరోజు సర్వభూపాల, కల్పవృక్ష వాహనసేవలు



వెంకటాచలం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : గొలగమూడి వెంకయ్యస్వామి 43వ ఆరాధనోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరగనున్నాయి. వేకువజామున సుప్రభాత సేవ, అభిషేకం, స్వామివారి పూజ, హారతి, ప్రసాద వినియోగం జరిగింది. అనంతరం ఉత్సవ మూర్తికి అభిషేకం, దత్తసంప్రదాయ షోడసోపచార పూజలు చేశారు. స్వామి సమాధి మందిరాన్ని పూలతో విశేషంగా అలంకరించారు. ఉదయం 10 గంటలకు గొలగమూడి వాసుల ఆధ్వర్యంలో సర్వభూపాల వాహన సేవ జరిగింది. భక్తుల కోలాటాలు, పండరి భజన, మేళతాళలు, మంగళ వాయిదాల నడుమ వెంకయ్యస్వామిని ఊరేగించారు. గ్రామంలో విహరిస్తున్న స్వామివారికి గ్రామస్థులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

● కల్పవృక్ష వాహనంపై..

రాత్రి వెంకయ్యస్వామి వారు కల్పవృక్షవాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఎన్ని రకాల పూలు ఉన్నా కలిపి కడితే అన్నీ ఒకే మాలగా ఉన్నట్లు మనుషులంతా ఒక్కటేనన్న భావనను కలిగించేలా స్వామిని వివిధ రకాల పూలతో అలంకరించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల అలరించాయి.

● ఉత్సవాల్లో నేడు

మంగళవారం ఉదయం 10 గంటలకు సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనసేవలు ఉంటాయిన ఆశ్రమ ఈవో బాల సుబ్రహ్మణ్యం తెలిపారు.

బార్‌లకు నోటిఫికేషన్ విడుదల

● జిల్లాకు 50 మంజూరు, దరఖాస్తుల స్వీకరణ

● నేటి నుంచి 26 వరకు గడువు

● జనాభా ప్రాతిపదికన లైసెన్స్ ఫీజులు

● ఇక అర్ధరాత్రి 12 గంటల వరకు 'బార్'లా..!

నెల్లూరు(క్రైం) ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 31వ తేదీ నాటికి గత ప్రభుత్వం అమలులోకి తెచ్చిన బార్‌ల పాలసీ గడువు ముగియనుంది. దీంతో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కొత్త పాలసీని అమల్లోకి తెచ్చింది. కొత్త పాలసీలో భాగంగా జిల్లాలో 50 బార్లకు కలెక్టర్ ఆనంద్ గజిట్‌తో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ పాలసీ వివరాలను జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ కమిషనర్ శంకరయ్య విలేకరులకు వెల్లడించారు. జనాభా ప్రాతిపదికన బార్‌లకు లైసెన్స్ ఫీజులను కేటాయించారు. బార్ల సమయవేళలను ఉదయం 10 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు పెంచారు. ఈ ఏడాది సెప్టెంబరు 1 నుంచి 2028, ఆగస్టు 31వ తేదీ వరకు మూడేళ్లపాటు కొత్త పాలసీ అమల్లో ఉంటుంది.

● జిల్లాకు 50..

కొత్త పాలసీ ప్రకారం జిల్లాకు 50 బార్‌లను కేటాయించారు. నెల్లూరు నగరంలో 38, కావలిలో 7, కందుకూరులో 3, ఆత్మకూరులో ఒకటి, బుచ్చిరెడ్డిపాలెంలో ఒకటి కేటాయించారు. జనాభా ప్రాతిపదికన నెల్లూరు కార్పోరేషన్ పరిధిలో రూ.75 లక్షలు, కావలి మున్సిపాలిటీ పరిధిలో రూ.55 లక్షలు, కందుకూరులో రూ.55 లక్షలు, ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాలెంలలో రూ.35 లక్షలు లైసెన్స్ ఫీజుగా నిర్ధారించారు. మూడేళ్ల ఈ పాలసీలో ప్రతి సంవత్సరం లైసెన్స్ ఫీజులో పది శాతం అదనంగా చెల్లించాల్సి ఉంఉంది.

● దరఖాస్తుల స్వీకరణ ఇలా

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో బార్‌ల దరఖాస్తులను స్వీకరిస్తారు. దరఖాస్తు వేసుకునే వారు రూ.5 లక్షల నాన్‌రీఫం డ్‌బుల్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తుదారుడు ఆన్‌లైన్‌లో https://oc.hpfsproject.com ద్వారా ఎక్కడ నుంచైనా ఫారం-బీ (ఆర్)లో వివరాలు నింపి ఎన్‌రోల్ చేసుకుని దరఖాస్తు సమర్పించవచ్చు. దరఖాస్తు రుసుము, ప్రాసెసింగ్ ఫీజును డెబిట్‌కార్డు, క్రెడిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వారు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తును సమర్పించాలి. దరఖాస్తు రుసుము, ప్రాసెసింగ్ ఫీజును డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో రూ.5 లక్షలను డిస్ట్రిక్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీస్ పేరు మీద, ప్రాసెసింగ్ ఫీజు రూ.10 వేలను కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పేరు మీద సమర్పించి దరఖాస్తును పూర్తి చేసి ఎక్సైజ్ కార్యాలయంలో అందించాలి.



గీత కులాలకు బార్‌ల కేటాయింపుపై లాటరీ తీయిస్తున్న కలెక్టర్ ఆనంద్

● గీత కులాలకు 5 కేటాయింపు

జిల్లాలో గీత కులాల కోసం ఐదు బార్లను కేటాయించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్ లాటరీ విధానంలో గీత కులాల ప్రాతిపదికన బార్‌లను కేటాయించారు. ఆ ప్రకారం కావలిలో గమళ్ల, కందుకూరులో గౌడ కులస్థులకు కేటాయించి లైసెన్స్ ఫీజు రూ.27.50 లక్షలుగా నిర్ణయించారు. అల్లూరు నగర పంచాయితీలో గౌడ కులస్థులకు ఒక బార్‌ను కేటాయించి రూ.17.50 లక్షల లైసెన్స్ ఫీజు ఉంటుంది. ఈ నెల 20 నుంచి 29వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. నెల్లూరులో గౌడ్ కులస్థులకు 2 కేటాయించగా, రూ.37.50 లక్షల లైసెన్స్ ఫీజుగా నిర్ణయించారు. 30వ తేదీన లాటరీ విధానంలో బార్‌లు కేటాయిస్తారు.



బార్ పాలసీ వివరాలు వెల్లడిస్తున్న డీసీ శంకరయ్య

● 28న లాటరీ

మంగళవారం నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో దరఖాస్తులను స్వీకరిస్తారు. 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంటుంది. ఆ తర్వాత 28వ తేదీన నగరంలోని జడ్పీ కార్యాలయం సమావేశ మందిరంలో లాటరీ విధానంలో బార్‌లను వ్యాపారులకు కేటాయిస్తారు.

నిబంధనలు ఇవే

- ఒక వ్యక్తి ఎన్ని బార్లకైనా, ఎన్ని దరఖాస్తులైనా సమర్పించవచ్చు. ఎన్ని బార్ లైసెన్సులైనా పొందవచ్చు.
- 21 ఏళ్లు దాటిన వారు మాత్రమే దరఖాస్తు చేయాలి.
- ఒక్కో దరఖాస్తు నాన్‌రీఫండబుల్ రుసుము రూ.5 లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు రూ.10 వేలు చెల్లించాలి.
- దరఖాస్తు విధానం పూర్తయ్యాక, దరఖాస్తుదారుడు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఎంట్రీ పాస్‌లను డౌన్లోడ్ చేసుకొని లాటరీ జరిగే ప్రదేశానికి చేరుకోవాలి.
- ప్రతి దరఖాస్తుతోపాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, గుర్తింపు కార్డు, బ్యాంకు పాస్‌బుక్, ఆధార్ కార్డును జత చేయాలి.
- దరఖాస్తుదారుడితోపాటు మరొకరికి మాత్రమే లాటరీ జరిగే ప్రదేశానికి అనుమతి ఉంటుంది.
- బార్ కేటాయించిన వెంటనే సంవత్సరం లైసెన్స్ ఫీజులోని ఆరవ వంతు మొత్తాన్ని అదే రోజు చలానా రూపంలో చెల్లించాలి.
- ప్రతి బార్‌కు కనీసం 4 దరఖాస్తులు వచ్చిన తర్వాత మాత్రమే లాటరీ తీస్తారు. ఒకవేళ రాకుంటే కమిషనర్ దరఖాస్తు సమయాన్ని పొడిగిస్తారు. అయినా రాకుంటే ఆ బార్‌కు రీ నోటిఫికేషన్ ఇస్తారని డీసీ తెలిపారు. ఈ సమవేశంలో ఈఎస్ శ్రీనివాసులు నాయుడు, ఇన్‌స్పెక్టర్లు రమేష్‌బాబు, కిషోర్, ఎస్‌ఐ ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

సేవకులకు దక్కిన న్యాయం

● మాజీ సైనికులకు భూ పంపిణీ ● 20 ఏళ్ల తర్వాత అందుకున్న దేశభక్తులు

దేశభక్తిని ఒంటినిండా నింపుకొని సరిహద్దుల్లో వీరోచిత పోరాటాలు చేసి పదవీ విరమణ పొందిన మాజీ సైనికులకు ఎట్టకేలకు న్యాయం దక్కింది. దాదాపు ఇరవై ఏళ్ల నుంచి భూమి కోసం కాళ్లరిగేలా తిరుగుతున్న మాజీ సైనికుల కల నెరవేరింది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటికి ఒకేసారి మోక్షం కలిగింది. జిల్లా అధికార యంత్రాంగం కృషితో 55 మంది మాజీ సైనికులు, వారి కుటుంబాలకు 188 ఎకరాల భూమిని అధికారులు ఒకేసారి పంపిణీ చేయడం విశేషం.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : దేశం కోసం ఆర్మీలో పనిచేసి పదవీ విరమణ పొందిన మాజీ సైనికులకు వారి జీవనార్థం భూమిని రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయిస్తుంటాయి. అయితే గడిచిన రెండు దశాబ్దాలుగా భూ పంపిణీ అనేది ఒక ప్రహసనంగా మారింది. మాజీ సైనికులు, వారి కుటుంబాలు దరఖాస్తు చేసుకోవడమే తప్ప ఆ తర్వాత ఫలితం ఉండడం లేదు. ప్రస్తుతం వంద మంది వరకూ మాజీ సైనికులు భూమి కోసం దరఖాస్తు చేసుకొని ఉన్నారు. వీరు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతూనే ఉన్నారు. కొంతమంది కోర్టులకు కూడా వెళ్లి ఆర్డర్లు తెచ్చుకున్నా భూమిని మాత్రం పొందలేకపోయారు. ఇంకొంత మంది మాజీ సైనికులు భూమిని పొందకుండానే మరణించారు. ఇటువంటి పరిస్థితుల్లో మాజీ సైనిక కుటుంబాల అవస్థలను అనేక కథనాల రూపంలో 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. ఆ క్రమంలో కలెక్టర్‌గా ఓ ఆనంద్, జిల్లా సైనిక సంక్షేమ అధికారిగా జీ హరికృష్ణలు బాధ్యతలు తీసుకున్నారు. మాజీ సైనికులకు భూమి ఇచ్చే విషయంలో వీరు ప్రత్యేక దృష్టి పెట్టడంతో ఫలితాలు వచ్చాయి. దరఖాస్తులను సైనిక సంక్షేమ కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు పంపగానే, రెవెన్యూ యంత్రాంగాన్ని కలెక్టర్ పరుగులు పెట్టించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి, మాజీ సైనికుల కోరిక మేరకు భూమిని వారికి కేటాయించారు. కొన్నిచోట్ల ఒక్కొక్కరికి ఐదెకరాలు ఇవ్వగా, మరికొన్ని చోట్ల రెండెకరాలు కేటాయించారు. 55 మందికి 188 ఎకరాల భూమిని స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఒకేసారి పంపిణీ చేశారు. మరో 40 మందికి భూములిచ్చే ప్రక్రియ కూడా చివరి దశకు చేరుకుంది. ఒకటి, రెండు నెలల్లోనే అర్హులందరికీ భూ కేటాయింపులు పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో మాజీ సైనికుల కుటుంబాలకు ఎట్టకేలకు న్యాయం దక్కింది.



వరికుంటపాడులో మాజీ సైనికులకు కేటాయించిన భూమి



టిప్పర్‌ను ఢీకొన్న వాహనం, కింద పడి ఉన్న డ్రైవర్ హుస్సేన్ మృతదేహం

ఇద్దర్ని మింగిన నిద్రమత్తు

● టిప్పర్‌ను ఢీకొన్న టాటా మ్యాజిక్ ● ఇద్దరు దుర్మరణం

● పలువురికి గాయాలు ● బాధితులంతా చెన్నై వాసులు

కొడవలూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : బంధువుల పెళ్లికి వెళ్లామన్న ఆనందం వారిలో ఎంతోసేపు నిలవలేదు. నిద్రమత్తు డ్రైవర్‌తోపాటు ఆ ఇంటి పెద్ద దిక్కును పొట్టన పెట్టుకుంది. కొడవలూరు మండలం నాయుడుపాలెం వద్ద జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున ఆగి ఉన్న టిప్పర్‌ను టాటా మ్యాజిక్ వాహనం ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు చెన్నైకు చెందిన మాధవ్ కావలిలో ఉంటున్న బంధువుల పెళ్లిలో పాల్గొనేందుకు ఐదుగురు కుటుంబసభ్యులతో కలిసి టాటా మ్యాజిక్ వాహనంలో ఆదివారం వచ్చారు. రాత్రి పెళ్లి ముగించుకుని సోమవారం తెల్లవారుజామున 2.30 గంటలకు తిరిగి చెన్నైకు బయలుదేరారు. మార్గమధ్యంలోని నాయుడుపాలెం వద్ద 3.30 గంటల సమయంలో చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై డ్రైవర్ కునుకు తీయడంతో ఆగి ఉన్న టిప్పర్‌ను టాటా మ్యాజిక్ ఢీ కొట్టింది. డ్రైవర్ హుస్సేన్ (42), మాధవ్‌రావు (45) అక్కడికక్కడే మృతి చెందారు. వెనుక ఉన్న కుటుంబ సభ్యులు స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ కోటిరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు వ్యాధి నిరోధక టీకాలు

● 23వ తేదీ వరకు వ్యాక్సినేషన్

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాధి నిరోధక టీకాలు వేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ కసరత్తు చేస్తోంది. కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు టీకాలు వేసేలా కార్యాచరణ రూపొందించారు. 5 నుంచి ఏడేళ్ల విద్యార్థులకు కంఠసర్పి నివారణకు డీపీటీ రెండవ డోసు, పది నుంచి 16 సంవత్సరాలలోపు పిల్లలకు టీడీ (టెటనస్, డీఫ్తిరియా) టీకా వేస్తున్నారు. శ్వాసకోశ, గుండె, పక్షవాతం వంటి వ్యాధుల నివారణకు డీఫ్తిరియా వ్యాక్సిన్, కండరాల ద్రుఢత్వాన్ని, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ ధనుర్వాతం నివారణకు వాక్సిన్ వేస్తున్నారు. ఉపాధ్యాయుల సహకారంతో తొలిరోజు 2,371 మంది పిల్లలకు వ్యాక్సిన్ వేశారు.

100 శాతం ఫలితాలే లక్ష్యం

ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతుంది. 100 శాతం లక్ష్యాలు సాధించేలా కృషి చేస్తున్నాం. బుధ, శనివారాలు తప్ప మిగిలిన రోజులలో తల్లిదండ్రుల అంగీకారంతో ఈ టీకాలు వేసే కార్యక్రమం జరుగుతుంది. తొలి రోజు కంఠసర్పి, కోరింతదగ్గు, ధనుర్వాతం నివారణకు టీకాలు వేశాము.

- ఉమామహేశ్వరరావు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి

ఎంఎస్‌ఎంఈలకు రుణాలందిస్తాం : బీవోఐ 8లో..

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	123
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100) : 520

రైతు, ప్రజా సంఘాల నాయకుల అరెస్టు దారుణం

ఉలవపాడు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ కమిటీ పిలుపు మేరకు సోమవారం తలపెట్టిన చలో కరేడు కార్యక్రమానికి తరలివస్తున్న రైతు, ప్రజాసంఘాల నేతలను పోలీసులు కరేడు ర్యాంపు వద్ద అక్రమంగా అరెస్టు దారుణమని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సీఎస్ సాగర్, అఖిలభారత రైతుకూలి సంఘం జిల్లా అధ్యక్షుడు నాంచార్లు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఆర్ మోహన్‌లు ఖండించారు. అక్రమంగా అరెస్టు చేసిన ప్రజా సంఘాల నేతలను వెంటనే విడుదల చేయాలని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అరెస్టు చేసి పక్క మండలాల పోలీస్ స్టేషన్‌కు తరలించినవారిలో పీడీఎస్‌యూ నాయకులు రాజశేఖర్, సీపీఎం నాయకులు శ్రీనివాసరావు, నల్లమడ రైతు సంఘం నాయకులు కొల్లా రాజమోమన్, రైతుకూలి సంఘం నాయకులు కేశవరావులు ఉన్నారని తెలిపారు.

భూమ్.. ఫట్!

- యథేచ్ఛగా వేలాది ఎకరాల ప్రభుత్వ భూముల కబ్జా
- ఏళ్ల తరబడి జామాయిల్, పొగాకు సాగు
- పలుచోట్ల కౌలుకు ఇస్తూ లబ్ధి ..
- విద్యుత్ కనెక్షన్లు తీసుకుని దర్జాగా బోర్ల ఏర్పాటు


తిమ్మారెడ్డిపాలెంలో దుక్కులు దున్ని సాగుకు సిద్ధం చేసిన పంచాయతీ గ్రేజింగ్ భూములు

లింగసముద్రం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు దురాక్రమణలకు గురవుతున్నాయి. ఈ భూములలో జామాయిలు, పొగాకు, పొగనారు, వరి, మిరప పంటలు దర్జాగా సాగు చేస్తూ లక్షలాది రూపాయలు అక్రమంగా ఆర్జిస్తున్నారు. ఇంత తతంగం జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తుండడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కొన్ని గ్రామాల్లో పశువుల మేత, పంచాయతీ పోరంబోకు భూములు, అసైన్‌మెంటు, గయాలు, వాగు, రోడ్డు పోరంబోకు భూములు ఆక్రమించి కొందరు పైర్లు సాగు చేస్తున్నారు. మరికొందరు ఆక్రమించిన భూములను ఏకంగా ఇతరులకు కౌలుకిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఆక్రమణదారులు దుక్కులు దున్ని పైర్ల సాగుకు సమాయత్తమవుతున్నారు.

● దర్జాగా ఆక్రమణలు

మండలంలోని వెంగళాపురంలో సర్వే నెంబర్లు 155/1, 2లలోని 150 ఎకరాలలో సుమారు 100 ఎకరాలను కొందరు ఆక్రమించి పైర్లు సాగు చేస్తున్నారు. వీరిలో కొందరు తిమ్మారెడ్డిపాలెం, యర్రారెడ్డిపాలెం, వలేటివారిపాలెం గ్రామాలకు చెందిన కొందరికి కౌలుకు ఇచ్చారు. దర్జాగా బోర్లు కూడా వేసి విద్యుత్ కనెక్షన్లు కూడా తీసుకొని పంటలు సాగు చేస్తుండడం గమనార్హం. అలాగే లింగసముద్రంలోని పంచాయతీ గ్రేజింగు భూములలో సుమారు 600 ఎకరాలలో దాదాపు 150 ఎకరాలకు పైగా ఆక్రమించారు. తాజాగా తిమ్మారెడ్డిపాలెంలోని సర్వే నెంబరు 1లోని 512 ఎకరాల పంచాయతీ భూములలో 200 ఎకరాలు ఆక్రమణలకు గురయ్యాయి. ఇంత జరుగుతున్నా అధికారుల కళ్లకు కనిపించదా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

● యథేచ్ఛగా పంటల సాగు

ఇక ఆర్ఆర్ పాలెంలోని సర్వే నెంబరు 255 నుంచి 313 వరకు గల 790 ఎకరాల కండేవారి బీడులో దాదాపు 200 నుంచి 250 ఎకరాల ప్రభుత్వ అసైన్‌మెంటు భూముల్లో ఏళ్ల తరబడి పొగాకు, జామాయిల్ సాగు చేస్తున్నారు. వీరంతా మొగిలిచెర్లకు చెందిన వారు. వీరు ఒక్కొక్కరు 5 నుంచి 40 ఎకరాలకు వరకు ఆక్రమించి జామాయిల్ సాగు చేస్తున్నారు. తాజాగా కొందరు వర్షాలు పడుతుండడంతో దుక్కులు దున్ని జామాయిల్ సాగుకు సిద్ధం చేస్తున్నారు. మొగిలిచెర్లలో సుమారు 200 ఎకరాలు, పెంట్రాలలో 50 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించి పైర్లు సాగు చేస్తున్నారు. ముత్యాలపాడు రెవెన్యూలో ముత్యాలపాడు, పెదపవని గ్రామాల్లో 2200 ఎకరాల ప్రభుత్వ భూమిలో 800 నుంచి 1000 ఎకరాల వరకు ఆక్రమణలకు గురైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ కొందరు ఆక్రమణదారులు భూములు ఆక్రమించడం, నకిలీ పట్టాలు, పాస్ పుస్తకాలు సృష్టించి, కోర్టుకు వెళ్లి స్టేలు తెచ్చుకొంటున్నారు. దీంతో అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. అయితే 2012, 2022లో రెవెన్యూ అధికారులు సర్వే చేసి సుమారు 8 వేల ఎకరా ల్లో 3 వేల ఎకరాలకు పైగా ఆక్రమణలకు గురైనట్లు నిర్ధారించారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి కబ్జా భూములను కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


ఆర్ఆర్‌పాలెం కండేవారి బీడులో ఆక్రమిత భూమిలో జామాయిల్


వెంగళాపురంలోని పోరంబోకు భూమిలో వేసిన బోరు



గ్రావెల్, మట్టి వ్యాపారాలకు అనుమతులు ఇవ్వలేదు

● పీఎం ఖాన్, డీఈ, జలవనరుల శాఖ, కావలి

ఈ ప్రశ్నోత్తరాలు

కావలి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కావలి డివిజన్‌లో గ్రావెల్, మట్టి వ్యాపారాలకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. రైతుల అవసరాల కోసం కావలి మండలంలో మూడు చెరువుల్లో నుంచి మట్టి తోలకానికి అనుమతులిచ్చాం. దానిని రైతుల పొలాలకు మాత్రమే ఉపయోగించుకోవాలి. వ్యాపారం చేసినట్లు తమ దృష్టికి వస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జలవనరుల శాఖ కావలి డీఈ పీఎం ఖాన్ తెలిపారు.

? కావలి డివిజన్‌లో గ్రావెల్ తవ్వుకునేందుకు ఎవరికైనా అనుమతులు ఇచ్చారా.

! గ్రావెల్ తోలుకునేందుకు జలవనరులశాఖ ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు.

? మట్టి తోలకాలకు ఏమైనా అనుమతులు ఇచ్చారా.

! కావలి మండలంలోని కావలి పెద్ద చెరువు, తాళ్లపాలెం చెరువు, మన్నెంగిదిన్నె చెరువులలో మట్టి తోలకానికి రైతులకు అనుమతులు ఇచ్చాం.

? మట్టి తోలుకున్నందుకు రైతులు క్యూబిక్ మీటరుకు ఎంత చెల్లిస్తారు.

! క్యూబిక్ మీటరుకు రూపాయి మాత్రమే చెల్లిస్తారు. ఆ మట్టిని రైతుల పొలాలకు వినియోగించుకోవాలి.

? రైతుల పొలాలకు కాకుండా రియల్ ఎస్టేట్ వెంచర్లకు ఆ మట్టిని వాడుకోవచ్చా.

! రైతుల అనుమతుల మీద తీసుకున్న మట్టిని ఎలాంటి వ్యాపార అవసరాలకు వాడకూడదు. అలా వాడితే వారిపై చర్యలు తీసుకుంటాం.

న్యూస్ బాక్స్

సచివాలయంలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

వలేటివారిపాలెం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కళవళ్ల గ్రామ సచివాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పరిశీలించారు. సిబ్బంది లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విధుల్లో సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మృతురాలి కుటుంబానికి ఇంటూరి పరామర్శ

లింగసముద్రం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీఆర్ కోటకు చెందిన పాటిబండ్ల మాల్యాద్రి తల్లి వరమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఆ గ్రామానికి వెళ్లి వరమ్మ పార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వంకాయలపాటి మల్యాద్రి, బోయిళ్ల కొండపనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కి అధికారుల డుమ్మా


ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

వలేటివారిపాలెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హౌసింగ్ ఏఈ, డిప్యూటీ తహసీల్దారు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. ప్రతీ సోమవారం ఈ కార్యక్రమానికి ఒకరిద్దరు అధికారులు మాత్రమే హాజరవుతున్నారు. అయినప్పటికీ గైర్హాజరైన అధికారులపై సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. దీంతో అధికారులు డుమ్మా కొట్టడం పరిపాటిగా మారింది. సమస్యలపై వచ్చిన అర్జీదారులు ఉసూరుమంటూ వెనుదిరిగి వెళ్లిపోతున్నారు.

'ఐడియాథాన్' గోడపత్రిక ఆవిష్కరణ

కావలి(టౌన్), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఐడియాథాన్ కార్యక్రమం గోడపత్రిక ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ కృత్రిమ మేధను ఉపయోగించి అంతరిక్ష పరిశోధనలో ఏ విధమైన ప్రగతి సాధించవచ్చు అనే అంశంపై విద్యార్థుల సృజనాత్మకత, నూతన ఆలోచనలు ఆవిష్కరణలు ప్రదర్శించే అవకాశం ఐడియాథాన్ ద్వారా కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం ఈనెల 23న జరుగుతుందని విశ్వోదయ ఆర్అండ్‌డీ డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్ తెలిపారు. విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ సునీల్ కుమార్, శ్రీనాథ్, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

అల్లూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎనిమిది గ్రామ పంచాయతీల ప్రజలు ప్రత్యేక ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రజనీకాంత్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 19న ఇస్కపల్లి-1, 20న ఇస్కపల్లి-2, 21న పడమర గోగులపల్లి, 22న తూర్పు గోగులపల్లి, 23న నార్తుఆములూరు, గ్రద్దగుంట, 28న బీరంగుంట, బట్రకాగొల్లు, 29న పురిణి, 30న ఇందుపూరు గ్రామ సచివాలయాల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 5 నుంచి 15 ఏళ్లు పైబడిన బాలల ఆధార్ కార్డుల్లో మార్పు చేర్పులు చేసుకొనుటకు ఈ కేంద్రాలు ఉపయోగపడతాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

అన్నదాత సుఖీభవ కోసం అధికారులను సంప్రదించాలి

వలేటివారిపాలెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అన్నదాత సుఖీభవ నగదు జమ కాని రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ శాఖ సిబ్బందిని ఈనెల 20వ తేది లోపు సంప్రదించాలని మండల వ్యవసాయశాఖాధికారి కేవీ శేషారెడ్డి సోమారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన రైతులు వినియోగించుకోవాలని తెలిపారు.

సనాతన ధర్మ పరిరక్షణలో భాగమే

ఆలయాల అభివృద్ధి

● ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి


నార్తుమోపూరులో ఎమ్మెల్యే కృష్ణారెడ్డికి పూలమొక్క అందజేస్తున్న నిర్వాహకులు

అల్లూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధి సనాతన ధర్మ పరిరణలో ఒక భాగమని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నార్తుమోపూరులో ఉన్న పర్వతవర్థిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో రేబాల కోదండరామిరెడ్డి చారిటీస్ నూతన పాలకవర్గాన్ని, ఇందుపూరులో ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ నూతన పాలకవర్గాల ఎంపిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రేబాల కోదండరామిరెడ్డి చారిటీస్ ట్రస్ట్ చైర్మన్‌గా రేబాల కిషోర్‌కుమార్‌రెడ్డి, ధర్మకర్తలుగా మేడా సుదివ్య, బట్టమేకల కొండమ్మ, పొన్నెగంటి శ్రీనివాసులు, ధూళిపాళ్ల గోపాలయ్య, పొంగూరు వెంకటేశ్వర్లు, కొమ్మి బాలయ్య, బండి పెంచలమ్మ, బుర్రి కవితలను ఎంపిక చేశారు. ఇందుపూరు ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా గునపాటి ఫణికుమార్, ధర్మకర్తలుగా ఏలూరు భారతమ్మ, రత్నాకరం ప్రభావతమ్మ, దాసరి వెంకటేశ్వర్లు, పొన్నగంటి అంకమ్మ, గుడిపాటి వెంకట రత్నం, దుగ్గలూరు కృష్ణయ్య, చాట్ల నాగమ్మ, పాముల విమల, రత్నాకరం వెంకట రామలక్ష్మి ప్రసాద్‌లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలక మండలిలో అన్ని సామాజిక వర్గాలకు చెందిన సభ్యులు ఉండడం మంచి పరిణామమన్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలను, చైర్మన్‌లను ఆయన సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సోమశిల కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, వేమిరెడ్డి కోటారెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పలగాటి శ్రీనివాసులురెడ్డి, రేబాల శంకర్‌రెడ్డి, ఎందేటి హరికృష్ణ, అంబటి రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

బోగోలు రైల్వే ఎల్సీగేట్-144 నేటి నుంచి మూత


బోగోలు రైల్వే ఎల్సీగేట్-144 వద్ద ఆగిన వాహనాలు

బిట్రగుంట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వేస్టేషన్ పరిధిలోని ఎల్సీగేట్-144 మంగళవారం నుంచి 6 రోజులు తాత్కాలికంగా మూసివేస్తునట్లు రైల్వే అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైల్వేగేట్ సమీపంలో పట్టాల మార్పు, మెయింటినెన్స్ పనుల కారణంగా మూత వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అంతరాయాన్ని గమమనించి కావలి వైపు వెళ్లే వాహనాలు శ్రీవేంకటేశ్వరపాలెం మీదుగా వెళ్లవచ్చని తెలిపారు. బోగోలు ఎల్సీగేట్-143 కుమ్మరవీధి గేటు వైపు వెళ్లేందుకు అవకాశం ఉందని తెలిపారు.

కందుకూరు పట్టణాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే ఇంటూరి


ఎమ్మెల్యే ఇంటూరిని సన్మానిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ చౌదరి

కందుకూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణ అభివృద్ధికి ప్రణాళికాబద్ధ కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్టీఆర్ సర్కిల్ నుంచి పామూరురోడ్డు జంక్షన్ వరకు రోడ్డు వెడల్పు, డివైడర్ సెంట్రల్ లైటింగ్ ఏర్పాట్ల పనులు ప్రస్తుతం జరుగుతుండగా అంబేడ్కర్ విగ్రహం సెంటర్ నుంచి వాసవీకాలనీ వరకు రోడ్డు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులకు మూడు రోజుల్లో భూమిపూజ చేయమని తెలిపారు. పట్టణంలో దశాబ్దాల క్రితం నిర్మించిన సైడుకాలువల స్థానంలో కాంక్రీట్ కాలువలు నిర్మించేందుకు రూ.2 కోట్ల నుడా నిధులు వెచ్చించనున్నట్లు తెలిపారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పట్టణ అభివృద్ధికి ఒక్క పైసా కూడా విడుదల చేయలేదని, రామాయపట్నం పోర్టు భూమిపూజ సందర్భంగా కందుకూరు పట్టణ అభివృద్ధికి రూ.20 కోట్లు ఇస్తున్నట్లు జగన్ ప్రకటించారే కానీ నిధులు విడుదల చేయలేదని విమర్శించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కందుకూరు వచ్చినప్పుడు రూ.50 కోట్లు ఇస్తానని ప్రకటించగా ఇప్పటికే రూ.7 కోట్ల మంజూరయ్యాయని, మరో రూ.5 కోట్లతో ప్రతిపాదనలు పంపగా త్వరలోనే విడుదల కానున్నాయని తెలిపారు. తొలి ఏడాదిలోనే రూ.10 కోట్లతో కందుకూరులో అభివృద్ధి పనులు చేశామన్నారు. పట్టణంలో ఇళ్లమధ్య ఉన్న డంపింగ్ యారులో లక్షటన్నుల చెత్త పేరుకుపోయిందని ప్రభుత్వ సహకారంతో ఈచెత్తను రీసైక్లింగ్ చేసే ప్రక్రియను మొదలు పెట్టామని, నాలుగు నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 500 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశామని తెలిపారు. సోమవారం 86 మందికి రూ.85.5 లక్షల చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, జనిగర్ల నాగరాజు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యేను కలిసిన పీఏసీఎస్ చైర్మన్

లింగసముద్రం మండలం చినపవని పీఏసీఎస్ చైర్మన్‌గా ఎంపికైన ముళ్లపాటి లక్ష్మీనరసింహం చౌదరి, సభ్యులు రావెళ్ల మాలకొండయ్య, కనపర్తి మాలకొండయ్యలు ఎమ్మెల్యే ఇంటూరిని కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. వారివెంట రాళ్లపాడు ఆయకట్టు కమిటీ చైర్మన్ ఏలూరు వెంకటేశ్వర్లు, నాయకులు మోతుకూరు పర్వతాలు, సోంపల్లి మనోహర్, బుచ్చయ్య చౌదరి, మాధవరపు బ్రహ్మయ్య, కంకణాల సుబ్బులునాయుడు, గొర్రెపాటి శ్రీను, మేదరమిట్లపాలెం సర్పంచు కూరపాటి మాధవి తదితరులున్నారు.

కావలి కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలి


కావలిని జిల్లా కేంద్రం చేయాలని ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న జిల్లా సాధన సమితి సభ్యులు

కావలి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కావలి కేంద్రంగా కావలి, కందుకూరు, ఉదయగిరి, కోవూరు నియోజకవర్గాలతో జిల్లా ఏర్పాటు చేయాలని జిల్లా సాధన సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఎం. వంశీకృష్ణకు వినతిపత్రం అందచేసారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కావలిని 24వ జిల్లాగా చేయాలనే ప్రజల ఆకాంక్ష మేరకు ఉద్యమం జరిగిందన్నారు. కావలిని జిల్లాగా చేసేందుకు అవసరమైన అన్ని మౌలిక వసతులు, వనరులు ఉన్నాయన్నారు. సువిశాలమైన సముద్ర తీర ప్రాంతం, రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, దగదర్తి విమానాశ్రయం, పోర్టు ఆధారిత పరిశ్రమలైన బీపీసీఎల్, ఇండోసోల్ కంపెనీలతో పటు పలు పరిశ్రమలు రానున్నాయన్నారు, రైల్వే లైన్, జాతీయ రహదారుల కనెక్టవిటీ ఉన్నాయన్నారు. వస్త్రరంగంలో కావలి మినీ ముంబైగా పేరొందిందన్నారు. కావలి జిల్లా ఏర్పడితే గుంటూరు-విజయవాడల జంటనగరాల లాగా అభివృద్ధి చెందటానికి వీలుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధనసమితి సభ్యులు పులి రజని, పులి చక్రపాణి, కరవది భాస్కర్, అక్కిలగుంట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోకూరు పీఏసీఎస్ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం


చైర్మన్, డైరెక్టర్లను సన్మానిస్తున్న సెక్రటరీ, రైతులు

వలేటివారిపాలెం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోకూరు పీఏసీఎస్ అధ్యక్షుడుగా ఘట్టమనేని లక్ష్మీనరసింహం సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. సొసైటీ కార్యాలయంలో సొసైటీ పెయిడ్ సెక్రటరీ మద్దు మధుబాబు చైర్మన్ లక్ష్మీనరసింహం, డైరెక్టర్లు సాదం సుబ్బారావు, బత్తిన కృష్ణయ్యార్తిలతో ప్రమాణ స్వీకారం చేయించి ధ్రువీకరణపత్రం అందజేశారు. వారిని సెక్రటరీ, రైతులు శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు గుర్రం లక్ష్మీనరసింహం, ప్రగడ శ్రీనివాసులు, ఇంటూరి రంగారావు, ప్రగడ మోహన్‌రావు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై ఇద్దరి మృతదేహాలు


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


నక్కా రాంకుమార్ (ఫైల్)

బిట్రగుంట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వేసెక్షన్ పరిధిలోని తలమంచి- కొడవలూరు రైల్వే స్టేషన్ల మధ్య వేర్వేరు చోట్ల రెండు మృతదేహాలను గుర్తించినట్లు కావలి జీఆర్పీ పోలీసులు సోమవారం తెలిపారు. తలమంచి రైల్వే స్టేషన్ యాడ్ దిగువ మార్గంలో ఉన్న సుమారు (35) ఏళ్ల యువకుడు మృతదేహం పరిస్థితిని బట్టి రైలు పట్టాలు దాటుతుండగా, లేదా రైల్లో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడు గ్రీన్, బ్రౌన్ కలర్ ఆఫ్ హ్యాండ్స్ టీషర్టు, బ్రౌన్ రంగు లోయర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని జీఆర్పీ పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● హెల్త్ అసిస్టెంట్...

తలమంచి - కొడవలూరు రైల్వే స్టేషన్ల మధ్య ఎగువ మార్గంలో సుమారు (54) ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. అతని వద్ద లభించిన సెల్‌ఫోన్ ఆధారం విచారించగా ఒంగోలుకు చెందిన నక్కా రాంకుమార్‌గా గుర్తించారు. ఆయన బోగోలు మండలం కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్ (విలేజ్ హెల్త్ క్లీనిక్ - విశ్వ నాథరావుపేట 1)లో పని చేస్తునట్లు బంధువుల సమాచారంతో నిర్ధారిం చారు. విధులకు హాజర య్యేందుకు వెళుతూ ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారిపడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. రైల్లో నుంచి పడటం వలన మృతదేహం గుర్తుపట్టని రీతిలో ఉంది. రాంకుమార్‌కు భార్య ప్రసన్న, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

కొద్దిపాటి వర్షానికే

చెరువులా ట్రంకు రోడ్డు

కావలి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలో ఓ మోస్తరు వర్షం పడినా ట్రంకురోడ్డు జలమయం అవుతుండటంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో ప్రధానమైన ట్రంకురోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలువలు మూతబండలతో ఆక్రమణలకు గురికావటంతో కాలువల్లో పారాల్సిన నీరు రోడ్డుపైన పారుతుంది. కాలువలపై మూత బండలు వేసి ఆక్రమించటమే కాక దుకాణాల ముందు ఎత్తుగా మట్టి పోసుకోవడంతో ఇక వర్షపునీరు పోయేందుకు ఎటూ మార్గంలేక రోడ్డుపైనే నిలిచి పారాల్సిన పరిస్థితి ఏర్పడింది. సోమవారం సాయంత్రం కురిసిన ఒక మోస్తరు వర్షానికి ట్రంకురోడ్డు జలమయం అయింది. దీంతో ఆ రోడ్డుపై రాకపోకలకు వాహన చోదకులతో పాటు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మున్సిపల్ అధికారులు స్పందించి వర్షపునీరు కాలువల్లోకి వెళ్లే విధంగా ఆక్రమణలను తొలగించి నీరు వెళ్లే మార్గాలను సుగమమం చేయాల్సి ఉంది.


రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు